# అన్నమాచార్య సాహితీ కౌముది



రచన :-

డాక్టరు ముట్నూరి సంగమేశం, ఎం.ఏ., పి.హెచ్‌డి.,

సంపాదకులు :

కామిశెట్టి శ్రీనివాసులు, ఎం.ఏ.,

ప్రచురణ :

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

1981

# అన్నమాచార్య సాహితీ కౌముది




రచన :

**డాక్టరు ముట్నూరి సంగమేశం**, ఎం.ఏ., పి.హెచ్‌డి.,

సంపాదకులు :

**కామిశెట్టి శ్రీనివాసులు**, ఎం.ఏ.,



తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీ కార్యనిర్వాహకులగు

**శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్**, ఐ.ఏ.ఎస్., **గారి అధికారమున**

ప్రకటింపబడినది

1981

ANNAMACHARYA SĀHITHI KAUMUDI

by

Dr. M. Sangamesam, M.A.,P.hD.,

T. T. D. Religious Publications Series No. 88

First edition 1981
Copies 5,000

Subsidised Price 0-75

Published by :
Sri P. V. R. K. PRASAD, I.A.S.,
Executive Officer.
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# తొలిపలుకు

తాళ్ళపాక అన్నమాచార్యుల పాటలను ప్రచారం చేయడమంటే అది అన్నమయ్య ప్రచారం కాదు. వేంకటేశ్వరస్వామి మహిమలను భగవద్భక్తితత్త్వాన్ని లోకానికి చాటడమే. వేలకొలది పాటలను వ్రాసిన ఆ మహాభక్తుడు, వాగ్గేయకారుడు ఒక్క చోట కూడ, ఒక్క సన్నివేశంలో కూడ తన పేరును చెప్పుకోలేదు ఇంతటి నిష్కామకర్మను ఆత్మ తృప్తితో సాగించిన అకళంకుడు తాళ్ళపాక అన్నమయ్య.

అన్నమయ్య పదాల గురించి జరగవలసినంత కృషి జరగలేదు అనడం వాస్తవమే, కాని ఆ జరిగిన కొంత కూడ నలుగురికీ అందుబాటులో లేకపోవడం శోచనీయం. గత దశాబ్దాలలో ఈ వాఙ్మయం గురించి పలువురు పండితులు, విమర్శకులు సాగించిన ఆలోచనలను వరుసగా గ్రంథాల ద్వారా అందజేయడం మా అన్నమాచార్య ప్రాజెక్టు విధిగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ఒకటి.

డా. ముట్నూరి సంగమేశం గారు బహుభాషాకోవిదులు. శ్రీ వేంకటేశ్వర కళాశాల హిందీ శాఖలో ప్రధానాచార్యులుగా పనిచేసి ఈ మధ్యనే పదవీవిరమణ చేసిన సంగమేశం గారు సంస్కృతాంధ్రాలలో విశంకటమైన పాండిత్యం గలవారు. హిందీ, తెలుగు భాషలలో వీరి రచనలు వన్నెకు వాసికి ఎక్కినవి. వీరు అన్నమాచార్యుల వాఙ్మయాన్ని వివిధ దృక్కోణాలతో పరిశీలించి సప్తగిరి మాస పత్రిక ద్వారా ధారావాహికంగా ప్రచురించిన వ్యాసాలను ఒక గుచ్ఛంగా చేసి తెలుగు వారికి ఒక చిన్న కానుకగా అందిస్తున్నాము. ఈ మా ప్రయత్నాన్ని సహృదయంతో స్వీకరించి ముమ్ముందు మమ్మల్ని ప్రోత్సహిస్తారని మా విశ్వాసం. దీనికి సంపాదకత్వాన్ని నిర్వహించి విపులమైన పీఠికను కూడ చేర్చి గ్రంథ రూపంగా తేవడానికి కృషిచేసిన వారు మా అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు గారు. ఈ మా ప్రయత్నానికి సంపూర్ణ సహకారాన్నిచ్చి సహకరించిన డా. ముట్నూరి సంగమేశం గారికి మా హృదయ పూర్వకమైన ధన్యవాదాలు.

శ్రీ వేంకటేశ్వరస్వామి సేవా నిర్వాహణలో నాకు కలిగిన గొప్ప అనుభూతి ఈ అన్నమాచార్య వాఙ్మయం మీది రక్తి. అన్నమయ్యలా – ఒక జీవనాయికలా ఇలా పాడుకో గలిగితే ఎంత బాగుంటుంది.

"ఇది గాక సౌభాగ్య మిదిగాక తపముమరి
యిదిగాక వైభవంబిక నొకటి గలదా"

మకరసంక్రాంతి
14-1-81

పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# ఉపోద్ఘాతము

అన్నమయ్య పదాలకు పూర్వం పాటలున్నా అవేవి మన దృష్టికి రాకుండావే కాల గర్భంలో కలసి పోయాయి. 13 వ శతాబ్దానికి చెందిన కృష్ణమాచార్యుల సింహగిరి నరహరి వచనాలు తాళబంధ ఛందోవిరహితాలైన వచన మాలికలు. పల్లవి చరణాలతో కూడిన సంకీర్తనల రచనకు తాళ్ళపాక అన్నమాచార్యుడే ఆద్యుడు. పాటలుగా పాడుకో గలిగితే సరేసరి; లేకపోతే పద్యాలుగ చదువుకోవడానికి అవకాశమున్న అర్థభావ ప్రధానా లైన నిండు రచనలివి. అన్నమయ్య శృంగార మంజరి ప్రణాళిక మీదవే భట్టుమూర్తి వసుచరిత్ర కావ్యమంతా అల్లపడింది. ఇక పదాలు, పదబంధాలు, జాతీయాలు, పలుకు బళ్లు, అలంకారాలు, భావశిల్పం, మొదలైన విషయాల్లో ప్రబంధ కవులందరు తాళ్లపాక కవులకు ఋణపడ్డవారే.

తాళ్లపాక అన్నమాచార్యులు 32,000 సంకీర్తనలు రచించగా సుమారు 20 వేల పాటలు గాలిలో కలసిపోగా మిగిలిన 12 వేల సంకీర్తనలవైనా పండితులు సమ దృష్టితో పరిశీలించక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కీ.శే॥ రాళ్లపల్లివారు ఈ విషయంలో తమ ఆవేదన నిలా ప్రకటించారు[1]. "ముప్పదేండ్లకు పైబడి యీ సారస్వత శాఖ వెలుగులోవున్నా తెలుగువారి చూపు దీనిమీద తగినంత పారలేదు. దీనికి కారణాలెన్నో! వాటి గొడవ యిక్కడ తడవ బనిలేదు. శబ్దం, అర్థం, తాత్పర్యం, వాక్యం, వ్యాకరణం, జాతీయం, దేశీయం, సంగీతం, శృంగారం, పదరచనా పరిణామం, సంకీర్తన, భక్తితత్వం, సమకాలపు సంఘచరిత్రనీడలు; ఇత్యాదిగా పలుమొగముల పర్యవేక్షణ యిందు సాగవలసి యున్నది."

గేయాన్ని ఎంతగనో ఆదరించిన మన తెలుగువాళ్లు గాయకులను మాత్రం పంక్తి బాహ్యులని తీర్మానించారు. పద్యానికి పట్టాభిషేకం కట్టూ పదాన్ని నిరసించారు. పద్యకావ్యాలను పరిశీలించిన వాఙ్మయ పరిశోధకులు ఎందుకోమరి పదరచనలను పరిహ రించారు. పాటకున్న ప్రాముఖ్యాన్ని తెలుపుతూ క్రమక్రమంగ అది పొందిన నిరాదరణమ గల్లెటీ అనే ఆంగ్లపండితుడిలా వ్యక్తంచేశాడు:

---

1. తాళ్లపాకవారి పలుకుబళ్ళు - పీఠిక. రా. అ. కృ. శర్మ పు. vi–vii ఆం. ప్ర. సాహిత్య అకాడమి. జూలై 1971 .

[1] " Among other peoples and in other eras the great ages of literature have begun with song. The Andhra nation sings naturally, constantly melodiously though the matter of the songs that cartmen and porters sing as they move in file down the road is not always worthy of their singing. But Telugu literature has ignored and despised Telugu song; it has imported an alien prosody, in which the language moves uneasily, as though constricted by borrowed garments" కాలం తిరగబడింది. దేశకవితాశాఖకు చెందిన సంకీర్తన వాఙ్మయంపై నిరాదరణ క్రమక్రమంగ నడలి నవ్యదృక్పథాలతో దీనిని పరిశీలించడానికి ఆధునికులు ముందంజవేస్తున్నారు. ఇప్పుడు సాహిత్యవిమర్శకులు, వాఙ్మయపరిశోధకులు పదాలకు పదకర్తలకు – ఆంధ్రవాఙ్మయంలో గల స్థానాన్ని ప్రత్యేకమైన దృష్టితో భిన్న విభిన్నదృక్పథాలలో పరిశీలించడానికి పూనుకొన్నారు.

గత దశ శతాబ్దాలలో తాళ్ళపాక కవుల వాఙ్మయాన్ని పరిశీలించిన తిరుపతి పండితులలో ముట్నూరి సంగమేశంగారొకరు. అప్పుడు T.T.D Bulletin అనే పేరుతో వెలువడే సప్తగిరి మాసపత్రికలో వరుసగ అన్నమాచార్యులమీద వీరు కొన్ని వ్యాసాలను ప్రకటించడం జరిగింది. సాహితీ విద్యార్థులకు అవి వుపకరిస్తాయనే ఉద్దేశ్యంతో వాటిని వుద్ధరించి ఒకసంపుటిగ తీర్చడం జరిగింది. ఈ సంపుటాన్ని పదారు వ్యాసాలు అలంక రించాయి. 'షోడశకళానిధికి షోడశోపచారాలు' అనే అన్నమయ్య గీతం గుర్తుకు వస్తుంది.

డా. ముట్నూరి సంగమేశంగారు హిందీభాషలో ఆచార్యులైనా సంస్కృతాంధ్రాలలో విశంకటమైన పాండిత్యం గలవారు. ప్రాచీన తమిళభక్తి వాఙ్మయంతో వీరికిగల పరిచయం ఈ వ్యాసాలకు చక్కని రసపుష్టిని చేకూర్చింది. అన్నమాచార్యుల హృదయాన్ని తెలుసు కొని ఒక్కొక్క విషయాన్ని చిన్నచిన్నమాటలతో పొంకంగ ప్రతిపాదించడం జరిగింది. ముక్తకాలవంటి అన్నమయ్య పాటల్లా ఈ వ్యాసాలు వేనికవి ప్రత్యేకంగ, అర్థవంతంగ, నిండుగ, నాతిదీర్ఘంగ తీర్చిదిద్దబడ్డాయి.

'అన్నమాచార్యులు' అనే వ్యాసంలో వీరు అన్నమాచార్యులు జన్మించింది 1424లో అని పేర్కొన్నారు. ఈ విషయంలో నాకున్న అభిప్రాయభేదాన్ని తెలుపుతున్నాను. తాళ్లపాక అన్నమాచార్యుల జన్మతిథిని నిర్ణయించడానికి నాకుగల ఆధారాలను మనవి చేస్తున్నాను. తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల తొలి రాగిరేకులమీద ఈ క్రింది

1. Gramyam and Grammar - A Galletti.

వాక్యాలు మలచబడినవి "శుభమస్తు. శ్రీమతే రామానుజాయ నమః. స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశక వరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్న మాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుఁడు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహనశక వరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ॥ ౧౨ నిరుధానకు తిరువెంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్ళపాక అన్నమా చార్యులు విన్నపముచేసిన శృంగార (ఆధ్యాత్మ) సంకీర్తనలు" – ఈ వ్రాతనుబట్టి అన్నమా చార్యుల నిర్యాణం శా.శ. 1424 (క్రీ.శ. 1503) దుందుభి ఫాల్గుణ బహుళద్వాదశి అని సంవత్సర, మాస, తిథి, నామాలతో స్పష్టంగ తెలుస్తున్నది. '1346 క్రోధి' అన్నది అన్నమయ్య జననమా? వేంకటేశ్వరుని సాక్షాత్కారమా? అన్నది కొంతయోచించి తేల్చ వలసిన విషయం. రాగిరేకులమీది వ్రాత ప్రధాన ఉద్దేశ్యం అన్నమాచార్యుల జనన మరణాలను గురించి తెలపడంకంటె సంకీర్తన రచనా ప్రారంభ పరిసమాప్తాలను తెలపడమే అని తోస్తుంది.

పెద తిరుమలాచార్యుల సంకీర్తనల తొలి రాగిరేకులోని మాటలుకూడ పరిశీలింప దగినవి – "శాలివాహన శక వరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ॥ ౧౨ మొదలుగాను, తాళ్ళపాక అన్నమాచార్యులుంగారు తమ కొమరుఁడు తిరుమలా చార్యులను దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకితముచేసి చెప్పుమనఁగాను, విన్న పము చేసిన సంకీర్తనలు" అని పెద తిరుమలాచార్యుల సంకీర్తన రచనా ప్రారంభమునే తెలుపడం జరిగింది. ఈ దృష్టితో చూచినపుడు –

తాళ్ళపాక అన్నమాచార్యులు జన్మించినది .... శా. శ. 1330 (క్రీ.శ. 1408)
వేంకటేశ్వరుడు ప్రత్యక్షమై సంకీర్తన
రచనల కాదేశించినది .... శా. శ. 1346 (క్రీ.శ. 1424)
అన్నమాచార్యుల నిర్యాణం .... శా. శ. 1424 (క్రీ.శ. 1503)

అని నిశ్చయానికి నేను రావడం జరిగింది. శ్రీయుతులు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, చాగంటి శేషయ్య, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, ఆచార్య జి. యస్. రెడ్డి ఈ విషయాలను అంగీక రించారు. కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1945 లో వేంకటేశ్వర వచనాలకు పీఠిక వ్రాస్తూ అన్నమాచార్యులు 1408 నుండి 1503 దాక జీవించినట్లు పేర్కొన్నారు. కాని 1949 లో అన్నమాచార్య చరిత్ర పీఠికలో 1424 నుండి 1503 దాకా అన్నమా

చార్యులు జీవించినట్లు వ్రాసివారు. వీరి కుమారులు డా॥ వేటూరి ఆనందమూర్తి "తాళ్ళపాక కవులు, కృతులు—వివిధ సాహితీ ప్రక్రియలు" అనే గ్రంథంలో 1424–1503 వాదాన్నే బలపరచారు.

అన్నమాచార్యుల జీవితచరిత్రను వ్రాసిన చిన్నన్న కూడ తాతగారి జన్మతిథిని, సంవత్సరాన్ని పేర్కొనక వట్టిమాస, నక్షత్రనామాలే తెలిపాడు.

"రాజీవనయను వరప్రసాదమునఁ
దేజంబు మతియు నెంతే విన్తరిల్ల
లక్కమాంబకుఁ బుణ్యలావణ్యనిధికి
చక్కని గ్రహము లుచ్చమున మూఁడలర
అనుపమ లగ్నంబు నందు వైశాఖ–
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు...."

సదాశివరాయలు పరిపాలించే కాలంలో తాళ్లపాక తిరువెంగళనాథుడు తిరుమల దేవాలయంలో ఒక శాసనం వేయించాడు. అది శా. శ. 1468 నాటిది. తాళ్లపాక అన్నమయ్యగారి జన్మనక్షత్రం నాడు వైశాఖ - విశాఖలో వేంకటేశ్వరస్వామికి రెండుపళ్లు నుండలు ఉభయమిచ్చే వైనం తెలుపబడింది.

చిన్నన్న చరిత్ర, శాసనం అన్నమాచార్యుల జన్మతిథిని గురించి — మాస, నక్షత్ర నామాలనే తెలుపుతున్నవి. ఉపలబ్ధాలైన ఆధారాలనుబట్టి, రాగిరేకులలోని వాక్య రచనావిధానాన్ని బట్టి, పెద్దలూహించిన భావ సరణిని బట్టి నాబుద్ధి కందినంత వరకు "అన్నమాచార్యులు శా. శ. 1330 లో వైశాఖ మాసమున విశాఖ నక్షత్రయుక్త దినమున (సర్వధారి సంవత్సరమున నిజ వైశాఖ (వైయాశి) మాసమున శుక్ల చతుర్దశి బుధవారమున క్రీ. వె. 1408 మేనెల 9 తేదిన) జన్మించె" నను సాధుసుబ్రహ్మణ్య శాస్త్రులగారి వాక్యాన్నే నేను ప్రమాణంగా స్వీకరిస్తున్నాను.

భగవద్విరహమనే వ్యాసం చదువుతూవుంటే నాకీ పాట బుద్ధికి తోచింది. రసవంత మైన ఆ 'ఏల' పాటలోని కొన్ని చరణాలు రసికుల దృష్టికి తెస్తున్నాను.

మేడలెక్కి నిన్నుఁ జూచి - కూడేననే యాసతోడ
వాడుదేరి వున్నరందురా - వెంకటేశ
యోడ నుంటివిందాఁ కానురా ।।

నిండఁబూచిన మానిపై - గండుఁగోవిల గూయఁగా
నిండిన నీయెలుఁగంటాను - వెంకటేశ
అందుకు నిన్ను రమ్మంటిరా ।।

బొండుమల్లె పానుపుపై - నుండి నిన్నుఁ బాడి పాడి
నిండు జాగరములుంటిరా - వెంకటేశ
యెండలాయ వెన్నెలలురా ।।

పట్టుచీరకొంగు జారి - గుట్టుతో నేనుండఁగాను
వట్టి నవ్వులేల నవ్వేవు - వెంకటేశ
దిట్టవు నీయంత వారమా ।।

ముమ్మాటికి నీబాసలే - నమ్మివున్నదాన నేను
కుమ్మరించరా నీకరుణ - వెంకటేశ
చిమ్ముఁజీఁకటెల్లఁ బాయను ।।

జీవనాయిక భగవత్సంయోగంకోసం పడ్డ తాపత్రయం నిరీక్షణ ప్రస్ఫుటమౌతుంది.

'గేయసాహిత్య' మనే వ్యాసంలో అన్నమాచార్యుల భాషా ప్రయోగం గురించి చర్చిస్తూ సంగమేశంగారు 'ఆధ్యాత్మకీర్తనలలో అసలీ గ్రామ్యాగ్రామ్య ప్రశ్నయేలేదు. అవి శుద్ధమైన భాషకుదాహరణములు' అన్నారు. ఈ వాక్యాన్ని మనం కొంత విపులీకరించుకోవలసివుంది. అన్నమయ్యభాష ప్రజల భాష. భాషావిషయంలో అన్నమయ్య తీర్మానం ఇది. ఏ నిఘంటుసిద్ధమో, పండితుల సంకెళ్లకు బద్ధమో అయిన కృత్రిమభాష కాదిది. "మీరను కొంటున్న గ్రామ్యాన్ని నేను వాడుతున్నాను. ఎలా? పదిలంగ, పొంకంగ, చవులూరించే ట్లుగ. ప్రజావ్యవహారంలో సహజంగ నిలిచిన శబ్దాలు విరిసినపువ్వులు. వానిని పిసికి వాసనచూడడం కాదు, మృదువుగ అలంకరించుకోవడం రసికత,"– అన్నట్లే అన్నమయ్య ఆచరించాడు. శబ్దప్రయోగ విషయంలో భావ ప్రకటనలో ఇంత సౌందర్యదృష్టిగల పదకర్త ఆంధ్రవాఙ్మయంలో మరొకడు కనిపించడు.

తిరుమల తిరుపతి దేవస్థానం పరిశోధన ప్రచార విభాగంగ అన్నమాచార్య ప్రాజెక్టు స్థాపింపబడడంతో తాళ్ళపాక వాఙ్మయానికి సంబంధించిన కార్యకలాపాలు ఒక కొలిక్కి

వచ్చాయి. ఈ పరిశోధన ప్రణాళిక క్రింద అముద్రితంగవున్న తాళ్లపాక వాఙ్మయం ముద్రించడం, సంకీర్తనల విషయసూచికలు, శబ్దార్థపరిశీలనలు, లఘునిఘంటువులు, భావవివరణలు, సంకీర్తనల విభాగాలు (విషయ విషయదృష్టితో), విశ్వవిద్యాలయస్థాయిలో పరిశోధనాకేంద్రాల వ్యాప్తి, సుప్రసిద్ధపండిత విద్వాంసులు స్వరపరిచిన సంపుటాల ప్రకటన మొదలైన కార్యకలాపాలన్నీ సాగుతున్నాయి. ప్రచార ప్రణాళిక క్రింద విద్వద్గోష్ఠులు, ఉపన్యాసాలు, సంగీతకచ్చేరీలు, నృత్యప్రదర్శనలు, గ్రామఫోనురికార్డులు, కాసెట్లు, చలనచిత్రాలు మొదలైన ఏర్పాట్లు సాగుతున్నాయి.

ఇప్పుడు సాగినది, సాగుతున్నది కొంతే సాగవలసినదెంతో ఉంది. రసహృదయు లందరు చేదోడువాదోడుగా నిలిచి ఈ పవిత్ర సుందరకార్యక్రమాన్ని జయప్రదంగ మాతో నిర్వహింపచేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ఈ భగవత్ భాగవత కైంకర్యంలో నాకు అధికారికమైన సహకారంతోబాటు ఎంతోఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని సంతరిస్తున్న తి. తి. దేవస్థానం శ్రీ కార్యనిర్వాహకులు, శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ గారికి, దేవస్థానం పరిపాలనా సంఘ చైర్మన్ శ్రీ బి. నాగిరెడ్డిగారికి, సభ్యులకు నా హార్దమైన కృతజ్ఞతలు. ఈ సంపుటాన్ని ఇలా వెలుగులోకి తీసుకొనిరావడానికి తోడ్పడిన తి. తి. దేవస్థానం ముద్రణాలయ మేనేజర్ శ్రీ విజయకుమార్‌రెడ్డిగారికి తదితర సాంకేతికసిబ్బందికి నా ధన్య వాదాలు. ఈ వ్యాసాలు ప్రూఫులు దిద్దడంలో తోడ్పడిన అన్నమాచార్య ప్రాజెక్టు రీసెర్చ్ అసిస్టెంటు చిరంజీవి కోరాడ రామకృష్ణకు శ్రీనివాసుని అనంత మంగళాశాసనాలు.

> " త్రికరణశుద్ధిగ చేసినపనులకు
> దేవుడుమెచ్చు లోకమునుమెచ్చును "
>
> —అన్నమయ్య.

కామిశెట్టి శ్రీనివాసులు,
స్పెషల్ ఆఫీసరు,
అన్నమాచార్యప్రాజెక్టు.

# మున్నుడి

అన్నమాచార్యుని గురించి వ్రాసిన నా యీ వ్యాసావళి నేటికి ఇరువది సంవత్సరములకు పూర్వము, ఆర్ట్సుకాలేజి మ్యాగజైనులోను, దేవస్థానమువారి మాసపత్రికలోను వరుసగా ప్రకాశితమైనది. మరుగునపడిన యీ వ్యాసావళిని తిరిగి పుస్తకరూపమున వెలుగులోనికి తెచ్చిన కృషి, అన్నమాచార్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసరు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు ఎం. ఏ. గారి కార్యోత్సాహమునకు, కళాభిరుచికి, సాహిత్యాభిమానమునకు నిదర్శనము. వారికి నా ధన్యవాదములు. వారికిని, వారికృషి నామోదించిన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ ఐ. ఏ. ఎస్. గారికిని, తదితర దేవస్థానాధికారులకును శ్రీ వేంకటేశ్వరుడు తోడ్పడి వారిపూనిక నిర్బాధకముగా కార్యరూపమందుకొన జేయగలడని ఆశించు చున్నాను. అన్నమాచార్యసాహితీ ప్రచారమున కుపయోగపడి, తదభిమానుల ఆదరమున కేమాత్రము పాత్రమైనను ఈ వ్యాసావళి వ్రాసినప్పటి నా ఆశయము కొండంతగా ఫలించినట్లు భావింతును.

తిరుపతి
11-9-80

ముట్నూరి సంగమేశం.

# విషయ సూచిక


| | | | పుట. |
|---|---|---|---|
| | అన్నమాచార్యులు | | i to xx |
| 1. | అన్నమాచార్యులు | — ప్రబంధాను సంధానము | 1 |
| 2. | అన్నమాచార్యులు | — నమ్మాళ్వారు | 5 |
| 3. | అన్నమాచార్యులు | — శరణాగతతత్త్వము | 9 |
| 4. | అన్నమాచార్యులు | — శృంగార భక్తి | 14 |
| 5. | అన్నమాచార్యులు | — భగవద్విరహము .... | 17 |
| 6. | అన్నమాచార్యులు | — లీలావర్ణనము .... | 26 |
| 7. | అన్నమాచార్యులు | — ప్రసంగమాధురి | 30 |
| 8. | అన్నమాచార్యులు | — రూపమాధురి | 34 |
| 9. | అన్నమాచార్యులు | — సంసార నిరసన | 37 |
| 10. | అన్నమాచార్యులు | — వైరాగ్యబోధ | 42 |
| 11. | అన్నమాచార్యులు | — మానసబోధ | 46 |
| 12. | అన్నమాచార్యులు | — విజ్ఞానచర్చ | 50 |
| 13. | అన్నమాచార్యులు | — సంకీర్తన తత్త్వము | 54 |
| 14. | అన్నమాచార్యులు | — లోకానుభవము | 60 |
| 15. | అన్నమాచార్యులు | — లోకసంగ్రహము | 64 |
| 16. | అన్నమాచార్యులు | — గేయసాహిత్యము | 68 |

# అన్నమాచార్యులు

ఆంధ్రసాహిత్యములో గద్యపద్యములకున్న స్థానము గేయములకు లేదు. గేయము స్త్రీపామరుల పరముగానో సంగీతైకలోలులైన పండితుల పరముగానో నిల్చిపోయి తనకుగల సాహిత్యపు విలువను కూడ విస్మరింపజేసుకొన్నది. గేయకవికి పేరుప్రతిష్ఠలు లేవు. సభా తాంబూల మసలే లేదు. శ్రమకు తగిన ఫలమైనను గిట్టుబాటుకాలేదు. "ముది విటులు, విధవలంజలు, పదకవితలు, మారు బాస బాపన వర్యుల్." అని గేయకవికొక విచిత్రమైన స్థానమొసంగి, వికృతమొనర్చి, వెలివేసి, అందుకనుకూలించిన పంక్తిలో కూర్చుండబెట్టితిమి. కాని ఇరుగుపొరుగు భాషలలో చూచినచో ఈ పరిస్థితి వ్యత్యస్తమై కనిపించును. కన్నడంలో దాససాహిత్యము, తమిళమున ద్రావిడప్రబంధము, మహారాష్ట్రమున సంభంగ గీతములు, బంగాళీలో వైష్ణవసాహిత్యము, హిందిలో భక్తిసాహిత్యము, ఏది చూచినను గేయనిబద్ధమైన సాహిత్యమే. కాని వాటికున్న విలువ గుర్తించబడినది. పద్యకావ్యముతోపాటు పద కవిత్వముకూడ పండితాంగీకృతమై తగిన గౌరవమందుకొన్నది. ప్రథమ శ్రేణికిజెందిన కవులలో పదకర్తలకు కూడ స్థానము లభించినది. చండీదాసు, విద్యాపతి, సూర్‌దాసు, మీరాబాయి, పురందరదాసు, ఆండాళ్, తుకారామ్ వంటి భక్తకవిగాయకు లెందరో ఆ యా భాషలలో ఆచంద్రార్కమైన కీర్తిగడించిరి. తెలుగులో త్యాగయ్య క్షేత్రయ్యల కొక విధమైన కీర్తిప్రతిష్ఠలు లభించినవి. కాని అవి వారి సాహిత్యమునుబట్టికాదు. సంగీత నృత్యశాస్త్రములలో వారికున్న అపూర్వ ప్రజ్ఞావిశేషమునుబట్టి వచ్చినవి. గేయమును సంగీతము కొరకు గాక కేవల సాహిత్యదృష్టితో చదివి ఆనందించుటయే మనము మరిచిపోయితిమి. అధునాతన సంప్రదాయముల ననుసరించి కొంత విశాలదృక్పథ మలవరచుకొని, ఎంకి పాటలో, ఏతముపాటలో, స్త్రీల పాటలో, శిశువుల పాటలో చదివి ఆనందింప సాహసించిన సహృదయులు కూడ ఆధ్యాత్మ రామాయణ కీర్తనలుగాని, అన్నమయ్య కీర్తనలుగాని, రసైకదృష్టితో చదివి ఆనందించుచున్నట్లు తోచదు. పండితుల లెక్కలో ఇది సాహిత్యమే కాదు. పాఠ్యగ్రంథముల కిది పనికిరాకపోయె. కాని ఇతర భాషలలో ఈ పద్ధతి లేదు. అది తెలిసికూడ మనకున్న పదసాహిత్య భండార మెట్టిదో, అందున్నవి మణులో మసి బొగ్గులో మనము చూచి గ్రహించవలదా? తాళ్ళపాక అన్నమయ్యకీర్తనలు 32 వేలు. ఇంత ఎక్కువగా కీర్తనలు వ్రాసినవారు అన్యత్రా అరుదు. కొన్ని కొన్ని భాషలలో పద సాహిత్యమంతయు కలసి యీ సంఖ్యలో సగములేదు. ఆ యా విషయములు నిదానముగా

గుర్తించి యోచించినచో అన్నమాచార్యుల వారి సాహిత్యమున కీయవలసిన స్థానమేదో దాని నెంతవరకు గౌరవించవలెనో మనకు తట్టకపోదు. ఉదాహరణమునకై రెండుమూడు కీర్తన లీ క్రింద చూపి ఆపైన ప్రకృతివిషయము ముచ్చటింతును.

౧ బౌళి రాగము.

ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదలో హెూమమై పోయ కాలము ॥ ఏడ ॥

ఇది మేలయ్యెడి నా కది మేలయ్యెడి నని
కదిసిన యాసచే గడవలేక
ఎదురు చూచి చూచి యెలయించి యెలయించి
పొదచాటు మృగమైపోయె కాలము ॥ ఏడ ॥

ఇంతట దీరెడి దుఃఖ మంతట దీరెడి నని
వింత వింత వగలచే వేగి వేగి
చింతయు వేదనల జిక్కువడుచు నగ్ని
పొంతనున్న వెన్నయై పోయ కాలము ॥ ఏడ ॥

ఇక్కడ సుఖము నా కక్కడ సుఖంబని
ఎక్కడికైనా నూర కేగి యేగి
గ్రక్కన శ్రీ తిరువేంకటపతి గానక
పుక్కిటి పురాణమై పోయ కాలము ॥ ఏడ ॥

౨ శ్రీరాగం.

ఏతదఖిలంబునకు నీశ్వరుండై సకల
భూతములలోన దా బొదలు వా డితడు ॥ ఏ ॥

గోపాంగనల మెరుగు గుబ్బచన్నుల మీద
చూపట్టు కమ్మ కస్తురిపూత యితడు
తాపసోత్తముల చింతాసౌధములలోన
దీపించు సుజ్ఞాన దీప మితడు ॥ ఏ ॥

జలధి కన్యాపాంగ లలితేక్షణములలో
కలసి వెలుగుచున్న కజ్జలంబితడు
జలజాసముని వదన జలజమధ్యమునందు
అలర వెలువడిన పరమామృతం బితడు ॥ ఏ ॥

పరివోని సురత సంపదల నింపులచేత
వరవధూతతికి పరవశమైన దితడు
తిరువేంకటాచలాధిపుడు తానైయుండి
పరిపాలనము సేయ భారకుండితడు ॥ ఏ ॥

3 శ్రీరాగం

ఇతరులకు నిను నెరుగ దరమా
సతత సత్యవ్రతులు సంపూర్ణ మోహవిర
హితు లెరుంగుదురు నిను నిందిరారమణా ॥ ఇత ॥

నారీకటాక్ష పటు నారాచ భయరహిత
శూరు లెరుగుదురు నీ చూచేటి చూపు
ఘోర సంసార సంకులపరిచ్ఛేదులగు
ధీరు లెరుగుదురు నీ దివ్య విగ్రహము ॥ ఇత ॥

రాగభోగ విదూర రంజితాత్ములు మహా
భాగు లెరుగుదురు నిను బ్రణుతించు విధము
ఆగమోక్తప్రకా రాభిగమ్యులు మహా
యోగు లెరుగుదురు నీ వుండేటి యునికి ॥ ఇత ॥

పరవద భాగవత పదపద్మ సేవా నిజా
భరణు లెరుగుదురు నీ పలికేటి పలుకు
వరగు నిత్యానంద పరిపూర్ణ మానస
స్థిరు లెరుగుదురు నిను తిరువేంకటేశ ॥ ఇత ॥

ఇట్టి చక్కనిశైలిలో రచించి సంకీర్తనాచార్యుడనిపించుకొని, పరమభాగవతులపంక్తికే, నిల్వదగిని భక్తిప్రపత్తులు గడించుకొని సంసారియైయుండి సర్వాత్మనా ఆ సర్వేశ్వరునిలో

తన జీవనము నివేదించి ఐహికాముష్మికము లరచేతికి దెచ్చుకొన్న అన్నమాచార్యులు కడపజిల్లా తాళ్ళపాకలో క్రీ॥ శ॥ 1424 లో జన్మించెను. ఈతడాస్వామి నంద కాంశమున జన్మించెనని ప్రతీతి.

బాల్యములోనే యే ప్రాక్తనజన్మ సంస్కారము వలననో యీ జన్మలో పూవునకు తావి వలె పుట్టి బుద్ధి ఎరిగినది మొదలు అలవడిన భగవద్ధ్యానానుసంధానపరుడై, పదునారవయేట పరుషవారితో కలసి తిరుపతి యాత్రకై వచ్చి కొండ యెక్కుచు మూర్ఛిల్లిన యీ మహాను భావునికి కలలోనే పద్మావతీదేవి దర్శనభాగ్యము లభించినది. "చెప్పులు విడిచి కొండ యెక్కు" మని ఆ తల్లి ఉపదేశించినదట! మేల్కాంచి హర్షపులకిత గాత్రుడై, ఆనందా శ్రులతోనే ఆశువుగా ఆ జగన్మాతపై 'వేంకటేశ్వరా' అను మకుటముతో అన్నమయ్య ఒక శతకము చెప్పెను. తర్వాత కొండపై కరిగి యథావిధిగా యాత్ర చేసుకొని, తనపాలి దేవుడైన యా వేంకటేశ్వరుని సన్నిధిలో నిల్చి రోజు కొకటి చొప్పన యాతని దివ్యలీలలు వర్ణించు పదములు వ్రాసి పాడుచూ భగవత్ కైంకర్య మొనర్పసాగెను. వైష్ణవదీక్షనంది, కొన్నాళ్ళీరీతి స్వామి సేవలోనే యుండి, తిరిగి స్వగ్రామమేగి తిరుమలమ్మ, అక్కలమ్మ అను నిర్వురు భార్యలను పెండ్లాడి సంసారి అయ్యును భగవద్భజనమాత్ర మేమరక కాలము గడుపసాగెను. తనయంత వారైన కొమరుల బడసెను. రాజాదరణము బడసి మన్నవ లందెను. శృంగారమంజరి. ద్విపద రామాయణము మున్నగు గ్రంథములు వ్రాసెను. నరవర్ణనచేయుట కిష్టపడక రాజైన నరసింహరాయలతో వైరము పెట్టుకొని, నంకెళ్ళబడి, సర్వేశ్వరునికృపచే విముక్తుడై, భక్తిప్రభావమిది యని లోకమునకు జాటెను. వైష్ణవాలయము లెన్నియో దర్శించి యేదేవునికీర్తించిననూ వేంకటేశ్వరపరముగానే కీర్తించి, ఆ దేవుని ముద్ర తోనే పదములు వ్రాసెను.

> 'ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా
> కేళీ విహార లక్ష్మీ నారసింహా'

అని సంబోధించి అహోబల నారసింహస్వామిని స్తోత్రముచేయుచూ,

> 'దారుణోజ్జ్వల దగద్ధగిత దంష్ట్రానల వి
> కార స్ఫులింగ సంగక్రీడయా
> వైరి దానవ ఘోర వంశ భస్మీకరణ
> కారణ ప్రకట వేంకట నారసింహా.'

అని పూర్తిచేయుట అతని పద్ధతి. ఈ అహోబిల మఠములోనే కొన్నాళ్ళుండి యితడు

వేదాంతమభ్యసించెను. ఉత్తరవయసులో ఇతడు తరచు తిరుపతిలోనూ, సమీపమునగల మంగాపురములోనూ నివసించుచూ వచ్చెను. తన సర్వస్వమును శ్రీ వేంకటేశ్వరునికి నివేదించి, ఐహికాపేక్షలన్నియు విడిచి యోగవైరాగ్యశృంగార భావభూయిష్ఠములైన 32 వేల పదములు వ్రాసి, స్వామి భండారమున కాన్కగా సమర్పించి, యీ పరమవైష్ణవుడు క్రీ॥ శ॥ 1503 లో పరంధామప్రాప్తి నందెను.

అన్నమయ్యకొడుకు పెద తిరుమలాచార్యులుకూడ కవి, భక్తుడు, ధాత, స్వతంత్రుడు. రాజాశ్రయమెరుగడు. తానూ తన తండ్రివ్రాసిన కీర్తనలను రాగిరేకులపై చెక్కించి, సంకీర్తన భండారమున భద్రపరపించి, పాటకుల నేర్పరిచిన వ్యక్తి యీ తిరుమలాచార్యుడే. ఈ కుటుంబములో చినతిరుమలయ్య, చిన్నన్న, నరసయ్య, అక్కలమ్మ వగైరా లందరూ కవులే. వీరు కొన్ని వైష్ణవకులాలకు గురువులుకూడ. 1540 వరకు యీ కీర్తనలు దేవాలయములో పాడుచుండిరని తెలియుచున్నది. తర్వాత వెవ్వరో యీ సంప్రదాయము తప్పినది. తిరిగి యీ నాటికి తిరుమల-తిరుపతి దేవస్థానమువారి శ్రద్ధవలన నీకీర్తనలు వెలుగు జూచుచున్నవి.

అన్నమాచార్యునిలో సంగీత సాహిత్యములు రెండుసూ సమపాళ్ళలో సంక్రమించినది. భక్తి ప్రభావము లాతడు సాధించిన సంపదలు. భక్త్యావేశములో తనను తాను మరచి చిందులుద్రొక్కి నటించుచూ తారస్థాయిలో పాడి ఆ భగవంతుని నోటనే భళా అనిపించుకొని ధన్యుడైన మహాకవి మన అన్నమయ్య.

'ఎంతటివారైన నెవ్వరును హరి
చింతించక నిశ్చింతులు కారు' అని ప్రారంభించి,

'పరమపాతకుడ భవబంధుడ శ్రీ
హరి నిను దలపగ నర్హుడ గాను,

అని ఆ దేవుని యెదుట తన నేర మొప్పుకొని, దైన్యమోడి,

'కింకరిష్యామి కిం కరోమి బహుళ
శంకా సమాధాన జాడ్యం వహామి' అని కొంతవరకు అది భౌతిక అధ్యాత్మములమధ్య విచికిత్సావిమానుడై యూగులాడి, శ్రీ వేంకటేశ్వరుని పదముల పైబడి మనోవాక్కాయకర్మలా,

'సర్వాంతరాత్ముడవు, శరణాగతుడ నేను
సర్వాపరాధి నైతి చాలు చాలు నయ్య' అని శరణువేడి అభయమర్థించి,

"అధికుని గాచు టేమరుదు నన్ను
అధముని గాచుటే అరుదు గాక." అని ఆ దేవునికే మా రుపదేశించి దాస్యమునుండి సఖ్యమునకు సాగి తదుపరి నర్మసఖియై, వైతాళికుడై, ఉదయాది సాయంత్రమువరకు గల ఆ స్వామిలీలలన్నియూ వర్ణించి,

'పాడేము నేము పరమాత్మ నిన్ను
వేడుకతో ముప్పదిరెండువేళల రాగాలను' అని, 'దిక్కైనన్నేలితి వింక' చాలు నా జన్మ తరించెనని మురిసిపోయిన భక్తుడీ అన్నమయ్య.

అన్నమయ్య జన్మతః స్మార్తుడు. సంస్కారతః వైష్ణవుడు. పుట్టుకతో తెచ్చుకొన్నది భక్తి. దానికొక పద్ధతి నేర్పినది విశిష్టాద్వైతము. దీక్షతో నందినదే తడవుగా, 'మతి రామానుజ మతమే నాకును చతురత మెరసిన సంధ్య' అని తనకుగల ధర్మకర్మము లన్నియు నందే కలవని విశ్వసించి, తిరుమంత్రము జపించి, చరమశ్లోకమెరిగి. ద్వయార్థ మెరిగి తలంచిన వాడీ అన్నమాచార్యుడు ఈ మతము ననుసరించి జీవుడు దేహేంద్రియాదుల కంటె విలక్షణమైన చిత్పదార్థసంజ్ఞుడు. అణు పరిమాణుడు. జ్ఞానానందమయుడు. ఆ యీశ్వరుని నియామకమునకు లొంగినవాడు. అతడు శేషి. జీవుడు శేషము. మోక్షమున నీశ్వరసాధర్మ్యమొంది జీవుడు సుఖించును. కాని దీనికాటంకము సంసారము. అది మాయ. దానికే ప్రకృతియనియు, అచిత్తనియు సంజ్ఞలు. ఈశ్వరునికి లీలాభూమి అగుటచే ప్రకృతి మాయ అయ్యును నిత్యము. జడమయ్యును భగవదిచ్ఛాపరిణామ మందున్నది గాన నానావికారములకు అది ఆస్పదము. ఈశ్వరుడు పురుషుడు, ప్రకృతి స్త్రీ. అతడు తండ్రి, ఇది తల్లి. దీనియందు జీవునికిగల మమకారమే బంధహేతువు. ఆ మాయలో జీవుడు, కర్తృత్వ భోక్తృత్వములు తనయందారోపించుకొని పడరానిపాట్లు బడి, కర్మవిపాకము పెంచుకొని, నవయుచుండును. ఆ యీ అర్థములు చక్కగ గుర్తించి అన్నమాచార్య లెన్నెన్నోరీతుల తన కీర్తనలలో ఆ తత్వములు వివరించెను.

"జీవుడించుకంత, చేత సముద్రమంత
కీలెక్కి పలుమారు చిగురించీ మాయ"

అని తెలుసుకొని యీ మాయా వ్యామోహమే 'అనయంబు లిన్నిటికి నాధార మాయె' నని గుర్తించి, "మోనమున మాయావిమోహితుండైపోయి, కాసుచేయనివని గాసిపడె ప్రాణి" అను నిశ్చయమునకు వచ్చినాడు. కాని ఇది జీవుని దోషమా? అన లా మాయను నియోగించు వా డీశ్వరుడే కదా! ఇంతగా భ్రాంతి కడు బుట్టించి పరమ మురిపించే వాడు దేవుడే. మాయలో పుట్టి మాయలో పెరిగిన జీవు లా మాయను తొలగించుకోగలరా?

"పెనగి తల్లికడ బిడ్డలు భువిలో
యెనగొని యెక్కడి కేగుదురయ్యా!" అని ఆ దేవునితో తర్కించి,

"ఇదిగో మా అజ్ఞాన మెప్పుడూ సహజమే, కదిసి నీవే మమ్ము కరుణించవయ్యా" అని అన్నమయ్య తన దేవునికి నివేదించెను. బంధమోక్షములకు కర్తలెవరు? జీవుని కర్మమా? ఆ పరమేశ్వరుని విలానమా?

"కర్మమంటా మాకు గట్టేవుగాక
కర్మము ధర్మము నీ కల్పితము గాదా"

అని ఇత డా పరమాత్మునే మారు ప్రశ్నించి తగువుబెట్టుటకు తయారగును. నిజమే. ఈశ్వరుడు సర్వేశ్వరుడు. చిదచిద్విశిష్టుడు. సర్వాంతర్యామి. సకలకల్యాణగుణాకరుడు. నిఖిల హేతుప్రత్యనీకుడు. సృష్టిస్థితిలయకారకుడు. అతడే సర్వమునకు కర్త. అతడుకాని దిందొకటియు లేదు. అందుకే అన్నమయ్య, "ఎవ్వరిగాదన్న నది నిన్ను గాదనుట, ఎవ్వరి గొల్చిన నది నీ కొలువు" అని పల్కినాడు.

ఆ సర్వేశ్వరుడు భక్తజన సులభుడు. కాని ఆ భక్తి సులభమా? దానికికూడ ఆ పరమేశ్వరుని కృపయే ప్రధానము. అందుకు తగిన గురువు దొరికినగాని ఆ మార్గమే బోధపడదు. భాగవతసేవానిరతి వల్లగాని ఆ భక్తి కుదుటబడదు. త్రికరణశుద్ధిగా ఈశ్వరుని నమ్మి, అతని సఖ్యము వరించి, అతనిలీల లెంచి, ఆకీర్తి నుతించి, తన్మూర్తి చింతించి, తదీయపదముల కెరగి, తన్నెరిగినవారి నెల్ల సేవించి, దాసులకు దాసుడై, దేహాత్మకైంకర్యములచే ఆ దేవుని సంప్రీతునిగా చేసుకొనునంతటి పరానురక్తిగలవాడు భక్తుడు. అన్నమాచార్యుడిట్టి భక్తినే తనకు త్రికాలసంధ్యగా భావించినాడు.

'సహజ వైష్ణవాచారవర్తనుల
సహవాసమె మా సంధ్య ।

అతిశయమగు హరిసంకీర్తనమే
సతతంబును మా సంధ్య
మతి రామానుజ మతమే నాకును
చతురత మెరసిన సంధ్య ।సహ।

పరమ భాగవత పదసేవనమే
సరవి నెన్న మా సంధ్య
సిరివరు మహిమల చెలువొందగ వే
సరక వినుటె మా సంధ్య ।సహ।

మంతు కెక్క తిరుమంత్ర పఠనమే
సంతతమును మా సంధ్య
కంతుగురుడు వెంకటగిరిరాయని
సంతర్పణమే మా సంధ్య ॥ నహ ॥

అన్నమాచార్యుని భక్తి, అగాధమైన లోతుతోపాటు అపారమైన వైశాల్యము పెంచుకొన్నది. అందేక రసత లేదు. వైవిధ్యమున్నది. పరమేశ్వరుని కీతడిచ్చిన భక్తి పుష్పములు పలురకములు. నానావిధ సువాసనావిలసితములు. ఇతని భక్తిలో జ్ఞానమున్నది. వైరాగ్యమున్నది. దాస్యమున్నది. సఖ్యమున్నది. వాత్సల్యమున్నది. అంతటా అధ్యాత్మ మున్నది. అన్నిటా శృంగారమున్నది. తొలిపూజలోనే వేంకటేశ్వరునికి శృంగారమంజరి కూర్చియిచ్చి, ఆ స్వామిచేత తల యూపించుకొన్న భక్తకవి యీ అన్నమయ్య. లోకములో శృంగారభావము కొంత హేయమనిపించినను, భక్తిలో నదే పరమార్థమగును. మాధుర్య మునగాని ఏకాంతమలవడదు. అది సాలోక్యసిద్ధికి మొదటిమెట్టు. వలచి వలపించుకొను ప్రేయసీప్రియులలో కంటె మిక్కిలి సామీప్యసాధర్మ్యము లింకొకచోట లభింపవు. ఈ ప్రేమ నిస్స్వార్థము. అహంకార మమకారముల నణచుకొని ఆ సర్వేశ్వరుని, 'జంటయై, ఆతని దాసానుదాసియై అంటి' యుండుటలో కూడా యీ ఏకాంగీభావమున్నది. అన్నమాచార్యునిలో ఈ భక్తి పాకమునకు వచ్చినది. తా నొక వనిత. తన కూరుపేరులు లేవు. అవన్నియూ ఆ సర్వేశ్వరునివే. అతనియం దీ "కొమ్మ తన ముత్యాలకొంగు జారగ పగటు గుమ్మ రింపుచు దెచ్చుకొన్న దీ వలపు!" తిరిగి మారందినదా? లేకున్ననేమి? ఈ వలపు చాలదా?

"ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మరి
యిది గాక వైభవం బిక నొకటి కలదా? ॥ ఇది ॥
అతివ జన్మము సఫలమై పరమ యోగివలె
నితర మోహాపేక్ష లిన్నియును విడిచె
సతి కోరికలు మహా శాంతమై యిదె చూడ
సతతవిజ్ఞాన వాసనవోలె నుండె." ॥ ఇది ॥

కాని యీ కోరికలు పొల్లువోయినవా? 'కాలమెల్లా మోసపోవు కానియ్యరా, కల కాలమెల్లా జరిపేవు కానియ్యరా' అని అన్నమయ్య ఆ దేవునితోనే పంతగించి, మించి, అతనిని కైవశము చేసుకొని, అమ్మయ్యా,

"అగపడి శ్రీవేంకటేశ్వర అంతర్యామివై
నగి నగి నను నీవేలితి నాకా యీ మాయ" అని కృతార్థుడై గర్వించినాడు.

ఏకాంతి మచ్చినది. ఆంతరంగిక వ్యవహారములలో పాల్గొను పధికారము గడించినాడు. పద్మావతీ వేంకటేశ్వరు లిరువురికు నిష్టసఖుడై, యింటి చుట్టమై, గుట్టెరిగి, కూటము లెరిగి, తగవరియై, చనవెంచి తప్పున్నచో తడివిచెప్పగలంత పెద్దరికము వహించగలిగినాడు. ఆయన కోపించినచో 'ఆడువారు కడు కొపులగుట నీ వెరుగవా, నేడు కొత్తలుగా భూమి నేర్చుక వచ్చిరా' అని చెప్పి, ఆమె పంతగించినచో,

"ఓతము రా బతిమాటచేసితే వేడుక గాక
కత్తికోత గొసరితే కాంత యింపౌనా
అత్తి యిచ్చకురాలయితే నాతడే మన్నించుగాక
మొత్తాన తప్పలెంచితే మోహము నిలుచునా" చాలు లెమ్మని బుద్ధులెరిం

గించును. మరొకతరి

"తరుణి నీయలుక కెంతటి దింతి నీ వేళ
కరుణించగదర వేంకటశైల నాథా" అని తిరిగి ఆయనతో రాయబారములు నడుపును. ఈలోపున నామె వ్యసనము చూచి, 'స్వామీ నీ వలిగిన సరా? అయ్యో, ఆయమ్మకందరూ శత్రువులే· 'పెంచు కోవిలనోరు పెడతటికి బోదాయె. బిగువునామని మీద పిడుగు పడదాయె' ఏమిచెప్పమందువు, అని బ్రతిమలాడియూ, బహుమాలియో మెత్తబరుచుకొనును. ఇంతగా ఆంతర్యము లెరిగినవాడు గనుకనే యిష్టాగోష్ఠివినోదములలో నా దేవునిమీద పరిహాసోక్తులు వినరుటకుకూడ సాహసించును.

"తలపు కామాతురత్వముమీద నలవడిన
నిల నెట్టివారైన నేలాగుకారు ॥ నీ ॥
ఓలి నిరువుర సతుల నాలింగనము సేయ
లోలు డటుగాన నాలుగు చేతులాయె ॥ తల ॥"

ఇట్లు నరసోక్తులాడుచున్ననూ ఆ దేవుని సేవలో మాత్ర మావంతయు వేమరడు. ఎన్నిదోషము లెంచినను, 'నీవలన కొరతేలేదు. మరి నీరుకొలది తామరవు' అని ఆ దేవునితో వేదో విధముగా రాజీపడును. 'పువ్వుల వలన నార తలకెక్కినట్లు, ఎవ్వరు నినుగూడి యేపు మిగులుదురు' నా సంగతియూ నంతే అని తన దురునుతనమును తానే నమర్థించుకొనును. 'నీ మహత్త్వంబు లోనికి వెలుపలికి గప్పి, కామింప నిట్టిదని కానరా దటుగాన' మా అజ్ఞానము క్షమింపుమనును.

"కంటే సులభమిది కానకుంటే దుర్లభ

మింటిలోననె యున్న దిహము బరమును" అని నిత్యనైమిత్తిక క్రియా కలాపములలోకూడ ఆ స్వామికి సహచరుడై, తన యింట నాతనిని నిల్పి, ఆతనియింట తాను మెలసి, ఆసాయంత్రమతనికి యూడిగము లొనర్చును. ప్రొద్దుపొడుచుటకుముందులేచి,

"మేదిని జీవుల గావ మేలుకోవయ్యా

నీ దయే మాకెల్ల రక్ష నిద్ర మేలుకోవయ్యా" అని ఆతనికి మేలుకొలుపు పాడును. అమీద సుప్రభాతము వినిపించును. ముఖమజ్జనాదులు సమకూర్చును, బాలభోగ మిడును. అంతలోననే హర్షవాత్సల్యభావ భరితాంతఃకరుణుడై,

"ముత్తెమువలె నున్నాడు ముద్దులాడు

ముక్కునవయ్యగ దిన్న ముద్దులాడు'' అని కన్నులెగురవేసి నవ్వుల ఆనందబాష్పములు నింపుకొనును. ఆతని కంగరక్షలు పెట్టి ఆరతులిచ్చి దిష్టితీయును. మజ్జనము సమకూర్చి, 'నందడి ఓడుపుము సానముఖా' మందరధరునకు మజ్జనవేళా' అని తక్కినవారి కాజ్ఞపెట్టును. నలుగులిడి, మజ్జన మాచరింపజేసి, తడియొత్తి, పాడిగట్టి' అలంకరించి, అంగరాగములుపూసి, ఆ దేవుని దివ్యమంగళవిగ్రహము కన్నులార చూచి, అంతలోనే కన్నులలో కన్నులు కలిపి, 'చూపు లోపలిచూపు చూడకుర వోరి, పైపూత చూపులకే పాలైతివోరి' అని ముఖముమీది దృష్టి పాదములపైకి మరల్చును. తిరిగి నిత్యసేవాకార్యములలో నిమగ్నుడై కైవారములుచేసి, ఏలలు పాడి, లీలలు వర్ణించి, ఉత్సవములలో నతనితో నూరేగివచ్చి, రాత్రి తిరిగి ఆస్వామికి ప్రక్క వేసి, పవళింపు పాడి వినిపించును. తీరుబడిగా రాత్రి తా నొక్కడు తనలో తానా పరతత్త్వపు నిజతత్త్వము లేవో యెంచి, తన యాత్మను తానే సంబోధిచుకొని,

"జీవాత్ముడైయుండు చిలుకా నీ
వావలికి బరమాత్ముడైయుండు చిలుకా ।జీ।

నీవన నెవ్వరు నేనన నెవ్వరు
నీవ నేనైయుండు చిలుకా
శ్రీ వేంకటాద్రిపై జిత్తములోనుండి
సేవించుకొను గట్టి చిలుకా ।జీ।

దైవ మానుషములు తలపించి యెపుడు నా
తలపున బాయని చిలుకా

ఏదియు నిజముగా వివి యేటి కని నాకు
నెరిగించి నటువంటి చిలుకా ।జీ।

అని యే ఆధ్యాత్మకతత్త్వములో పాడుకొని ఆనందించును. భక్త్యావేశములో ఇతడు తనను తాను తన మత దీక్షనుగూడ మరచిపోయి, 'నీలోపల నే గలసి నీవౌట యెన్నండురా, అని జన్మతః తనకబ్బిన స్మార్తవాననవల్లనో యేమో అద్వైతసిద్ధి కాసించును. కాని ఇతడు వలచినది ముక్తికాదు, భక్తి. అదియే తాను వరించినది. అది ప్రేమభక్తి. ఆప్రేమదాస్యములోను, సఖ్యములోను, వాత్సల్యములోను, శృంగారములోను కూడ వ్యాపించి నిండినది· ఏదో ఒక రూపమున, ఏదో ఒక వ్యాజమున, ఏదో ఒక వెపమున ఈ దేవునినన్నిధాన మబ్బిన చాలు. అతని విడిచి యితడుండలేడు. ఒక్కక్షణమోపికపడి తద్వియోగము సహింపలేడు. అట్టితరి నాతని నిష్ఠురములాడుటకు కూడ వెనుదీయడు· 'భ్రమియించే విట్టే పదిమారులు, నిముష మేడాదాయె నీవలన నాకు' అని సాధించి అతనిని స్వాయత్తుని జేసికొనును.

అన్నమాచార్యుడు మాటనేర్పుగల కవి. ఆమీద భావుకుడైన భక్తుడు. ఈ రెండును గలసి ఇతని కవిత్వమున కొక వింత శోభకూర్చినవి. ఇతడేది చెప్పినను వినవలె ననిపించును. తాను చెప్పనది తావెరుగును. చెప్పవలసిన తీరు తనకే తెలుసును. ఏవిషయమైనను నరే చెప్పవలసినప్పుడు తాను ముందది తన హృద్వీధికి తెచ్చుకొని, దాని అట్టుముట్టు అనవాళ్ళన్నియు గ్రహించి, ఆకళించుకొనిగాని చెప్పడు. చెప్పనపుడు చెప్పినదే చెప్పినను విసువురాని ధోరణిలో మాటలు పేర్చి, మనకంటిముందు ఆ విషయమును మూర్తికట్టించి, మాటకు మాట తోడిచ్చి, భావమునకున్న బరువంతయు దానిలో నిమిడ్చి, మన హృదయమున కత్తునట్లు చెప్పను. ఆ చెప్పినదాని కొక తర్కము, ఒకపద్ధతి, ఒకరీతి, ఒక హేతువు జోడించి, నిర్ణయముచేసి, నిశ్చయించి మరీ చెప్పను. ఐహిక తాపత్రయము మన మందరము ఎరుగుదుము. దాని నందరూ నిందింతురు. కాని అదే విషయమును గూర్చి చెప్పిన అన్నమాచార్యుని బాణీ వినుడు.

"యిందుకొరకే గదా యిందరు నిట్లయిరి
కిందుపడి మరికాని గెలుపెరుగరాదు ।ఇందు।

అటమటపు వేడుకల నలయించి మరికదా
ఘటియించు వరము తటుకున దైవము
ఇటుసేయ నీశ్వరుని కీసుగలదా, లేదు
కుటిలమతి గనికాని గుణి గానరాదు ।ఇందు।

బెండువడ నవగతుల బెసెగించి మరికదా
కొండనుచు బరిమొనంగును దైవము
బండుసేయగ హరికి బంతమా యటుగాదు
యెండ దాకక నీడ హిత వెరుగరాదు ।ఇందు।

మునుప వేల్పులకెల్ల మ్రొక్కించి మరికదా
తనభక్తి యొసగునంతట దైవము
ఘన వేంకటేశునకు కపటమా అటుగాదు
తినక చేదును దీపు తెలియనేరాదు ।ఇందు।

ఇది కేవలము కాదన్నది ఔనని చెప్పు మొండినమర్దనము కాదు. ఉన్నదాని నున్నట్లు భావించి, నిజానిజము లెరిగి, నిలకడ గలిగి మాటాడు విధము. తలనొప్పి కలిగించునంతటి తత్త్వముపదేశించు నప్పుడుకూడ ఈ కవి యిదే పద్ధతిలో చెప్పి శ్రోతలను మెప్పించును. అసలు తానా విషయమును అనుభవించి, దాని లోతుపాతు లెరిగి గాని చెప్పడు. ఆ చెప్పునది నిజాయితీకలిగి చెప్పును. అదియే యితనిలోగల ఆకర్షణ 'పరమేశ్వరుని భజింపుడు. దేహాభిమానము తగదు. ఆ మోహ మా యీశ్వరునిపైకి మరల్చుకొనుడు' అను మాట లెందరో చెప్పిరికదా! అన్నమయ్య చెప్పునదికూడ వినుడు.

"కాలము కాలముగాదు కపటాలె తరుచాయె
చాలునింక దీనితోడి జాలి మానరే ।కాలము।

పిన్ననాటినుండి తన పెంచిన యీ దేహము
మున్నిటివలె గాదు ముదిసీని
యెన్నికదినాలచే నెప్పుడేర బడునో
కన్నవారిచేతికి గ్రక్కున నియ్యరే ।కాలము।

కింకపు కినరుచేత కీడైన దేహము
వంక వంక తెరువుల వడిసీని
యింక నీ విధిచేత నెపు డేడబడునో
వెంకటేశు జేర బడవేయగదరే" ।కాలము।

ఈ చమత్కృతికి తోడు ఇతనికి వచనవక్రత కూడ అబ్బినది. చెప్పినది అనుకోని వంపులోని కీడ్చి, 'ఆఁ' అని ఆశ్చర్యము కలిగించునంతటి వింతధోరణిలో మెరపించి చెప్పును. ఒకప్పుడు నూటిగా మాట్లాడినట్లే మాటాడుచు తటాలున మాట మరల్చి మనకు

దిగ్భ్రమ గలిగించును. 'మంచిది వో సంసారము' అనిచెప్పి వెంటనే, 'మదమత్సర ములు మానిన' అని జోడించుసు, "ఇదివో సంసార మెంత సుఖమోకాని" అని ఆశ పుట్టించి, "తుదలేని దుఃఖమను తొడవు గడియించె" నని చెప్పి దాని సత్యము బయట పెట్టును. ఆ దేవునితో మాటాడినను ఇత డిదేధోరణిలో మాటడును.

"సామాన్యమా పూర్వ సంగ్రహం బగు ఫలము
నేమమున బెనగొనియె నేడు నీవనక"

అని ఆ దేవునికే కర్మబంధమంట గట్టి,....

"జగతి ప్రాణులకెల్ల సంసారబంధంబు
తిగుల బంధించు దురితంపు కర్మమున
మగుడ మారుకు మారు మగువ నీ వురముపై
తెగి కట్టి రెవ్వరో దేవుండ వనక ॥ జగతి ॥

ఉండనీయక జీవనోపాయమున మమ్ము
కొండలను గొబలతతి గొని త్రిప్ప ఫలము
కొండలను వెలకొన్న కోనేటిపతివనగ
నుండవలసెను నీకు నోపలేననక ॥ జగతి ॥

అని ఋజువుచేసి మాటడును. 'ఏదో అనినాడు పోనిమ్ము' అని నవ్వి సరిపెట్టుకొనుటకు కూడ అవకాశమీయక, అంతకు మించి నమ్మించగల యెత్తున మాటాడి, 'ఔను కాబోలు' నని ఆ దేవునికే భ్రాంతి పుట్టించును.

పాము జంపినయట్టి పాతకమున బెద్ద
పాముమీద నీకు బవళింప వలసె
కోమలి జంపిన కొరతవల్ల నొక్క
కోమలి నెద బెట్టుకొనియుండ వలెసె ॥ పాము ॥

ఇదివిని ఆ దేవుడుమాత్రము కాదనగలడా? మొండికెత్తి కాదనినాడనుకొందుము. అంతటితో ఈ తగవు తీరిసదా?

బండ విరచినట్టి పాతకమున బెద్ద
బండబోయిడవై పని చేయవలసె
కొండ వెరకినట్టి గుణమున తిరుమల
కొండమీద నీకు గూచుండవలసె ॥ బండ ॥

ఇదీ యితని వాగ్ధోరణి, దీనికి తోడితనికి నూతనప్రియత్వమున్నది. పాడిన వన్నియూ పాటలే కాని పాడినదే పాడి విసిగించుట యితడెరుగడు, చెప్పినవిషయమే చెప్పి వినిపించవలసినప్పుడు కూడ భాషలోనో శైలిలోనో కొంత వింత చూపి క్రొత్తని పించిగాని చెప్పడు, ఒకచోట,

తెలుపు జలములలోన తెప్పవలె దేలీనె
తలకి పాతాళమున దాగియుండీనె
కెలసి తనకన్నులను కెంపువడజేసీనె
నెలత భీకరముగా నేడు నవ్వీనె। తెలుపు।

అని ధ్వనించిన అవతారములే వేరొకచోట వర్ణించవలసివచ్చినపుడు తొలిపద్ధతినే మార్చి.

నడక కెటు నీటిలోననె యీదులాడీని
తడవి పట్టెదమనిన దాగిపోయీని
తడబడక నేల గుంతలువోవ దవ్వీని
కడప మీదనేవుండి కదలడెప్పుడును । నడ । అని వర్ణించును.

కాని యీతని యీ స్వభావమునకు విరుద్ధముగా వర్ణించు వస్తువుగాని, భావము గాని ఎప్పటి కప్పుడు మారునంతటి వినూత్నత్వము కలవి కావాయె! ఎంత వర్ణించిననూ ఆ వేంకటేశ్వరునే వర్ణించ వలెను. ఏది చెప్పిననూ అతని గూర్చియే చెప్పవలెను. ఏ వేళ కీర్తించిననూ ఆతనినే కీర్తించవలెను. అంతయూ అధ్యాత్మమే. శృంగారము కూడ ఆ అధ్యాత్మపుటంచులలోనే మెసలవలెను. అణుమాత్రమైననూ యీ మర్యాదకు భంగమురాకూడదు. అది భగవదపచారమగును. భక్తి పెడమార్గముపట్టును. ఆ యీ విషమసమస్యల కెదురీదగల ప్రతిభగలవాడు గనుకనే అన్నమార్యుడదే విషయమును, అదే భావమును, పదేపదే పాడి కీర్తించినను నూతనత్వము చూపగల్గెను. ఇందుకు కావలసిన కల్పనాశక్తియు, భావనాపటిమయు ఈతనికి సహజముగా అబ్బినవి. ఈ ప్రతిభగలదు కనుకనే అనునిత్యము దర్శించు నా వేంకటేశ్వరుని మూర్తి యితనికి, ఒకపరి కొకపరి యొయ్యారమై మొకమునం గళలెల్ల మొలచినట్లుండి' కనిపించెడిది. సరి. ఆ శోభకు సాటిరాగల సొంపు లెచ్చటనున్ననూ తడివి తెచ్చి, వలసినచోట హేతు ప్రత్యయములు కూడ కల్పించి, కనిపించిన ఆ అందమునకే అందము కూర్చగల భావన జోడించి, ఇతడా దృశ్యమును వర్ణించి తీరును.

జగదేకపతిమేన జల్లినకర్పూరధూళి
జిగిగొని నలువంక చిందగాను
మొగి చంద్రముఖినురమున నిలిపెగనుక
పొగరు వెన్నెల దిగబోసినట్లుండె,

ఇట్లు ఉపమానములు తడివి సొంపులుభావించి, హేతువులూహించి చెప్పగల చతురుడు గనుకనే ఆ దేవదేవుని లీలావిలాసములు వర్ణించినపట్ల నేమాత్రము తడుముకొనక ఎప్పటికప్పటికేదో ఒక వినూతనమైన భావమో, అనుభవమో, ప్రసంగమో, పలుకుబడియో అందిపుచ్చుకొని తన ప్రతిభ వెల్లడించినాడు. ప్రసంగములు కల్పించుటలో ఇతనికితడే సాటి. సామాన్య విషయమునకు గూడ విశేషమయిన ప్రసంగమల్లి, ఆ వాతారవణములోనో, ఆ పృష్ఠభూమిలోనో దానినినిల్పి. అందుకైన అంగప్రత్యంగ ములన్నియు నమకూర్చి అయిన వాటికితోడు లేనివి కొన్ని అలంకరింపుగా జోడించి, అప్పటి పాత్రల వాక్క్రియాకలాపాదు లన్నియు నూహించి, భావములెరిగి, కతలల్లి కళ్ళకుకట్టినట్లు వర్ణించిచెప్పును. "నాయికకు విరహ తాపమైనది, నాయకుడామెనుద్ధరించెను" అను చిన్నవిషయము చెప్పవలసినప్పుడు దానికితడెంత కల్పించెనో చూడుడు.

"మతిమంది చిత్తజుడు మగువగారించెనని
పతి వేంకటేశ్వరుడు పడతి గదిసి
ప్రతిలేని మనసెల్ల బరవశముచేసి మరు
నతివకన్నులనించె నదియెపోబలిమి."

ఇతడు లోకానుభమున్నకవి ఆవేశోద్రేకములుకల భావుకుడు. ఎప్పుడేది ఏవిధముగా పల్కిన పలుకున కాకర్షణము భావమున కార్జవత్వముచేకూరునో ఎరిగివల్కగలదిట్ట. ప్రశం సించవలసినచోట కూడ సహేతుకముగా

"మాకెల్ల రాజానుమతో ధర్మయిది నీ
యాకడగలుగుటయేమరుదు"
శ్రీకాంత ఒక దెస భూకాంత ఒకదెస
కైకొన నీకిటు గలిగెనటా
యాకడ శ్రీవేంకటేశ యిహపరము
యేకమై మాకగుటేమరుదు."

అని గడుసరియై పొగడుసు కాని లేని పోని దైన్యముతోడి విసిగించడు. మొగమిచ్చు మాటలచే కార్యముసాధించుటకూడలేదు. నిర్మోమాటముగా చెప్పిననూ విని కోపముతెచ్చు కొను పద్ధతిలో మాటాడడు. ఏదిచెప్పిననూ ఉల్లాసముతోచెప్పును. అధ్యాత్మకీర్తనలలో దైన్యసంతాపవైరాగ్యాది భావములు వర్ణించినప్పుడు గూడ ఇతడు తన వ్యక్తిత్వము మరచి పోడు. ఆ దేవునిపైగల అచంచలమైన విశ్వాసప్రత్యయముల బలమున దైన్యమెంచిన మరుక్షణము లోనే ధైర్యమొలుకబోసి మాటాడును.

ఎన్నిబాధలబెట్టియేచెదవునీవింక
నెంతకాలముదాక గర్మమా
మన్నించు మనుచు నీమరగు చొచ్చితిమి మా
మాటాలకించవో కర్మమా ''

అని దైన్యముగా ప్రారంభించి మరుక్షణములోనే నాకేమికర్మము నన్నుబట్టి తిరుగుట నీ కర్మమని ఎదురుతిరిగి

"వరున నేనుగ మీదవాని సున్నంబడుగ
వచ్చుగా నీకిట్ల గర్మమా
పరమపురుషోత్తముని భ్రమతబడినీవిట్ల
బట్టబయలైతిగా కర్మమా ''

అని దానినే వెక్కిరించిఅదమాయించును. దేవుని లీలలు వర్ణించినపుడది డోలగాని తిరవీధిగాని కల్యాణముగాని యేమైననూ అందులో ఆ మహానుభావుని విశ్వలీలావిహారములే చూచును. పవళింపుసేవ చేయుతరి స్వామివారి ఊయెలలో అన్నమయ్య కెన్నెన్నివన్నెలు, విలాసములు కనిపించినవో చూడుడు.

"అలర చంచలమైన ఆత్మలందుండనీ అలవాటుచేసె నీ యుయ్యాలా।
పలుమారును చ్ఛ్వాసపవనమందుండనీ భావంబుదెలిపె నీ వుయ్యాలా।
ఉదయాస్త శైలంబులొనర గంబములైన ఉడుమండలముమోచె నుయ్యాలా।
అదననాకాశపద మడ్డదూలంబైన అఖిలంబునిండె నీ వుయ్యాలా।
పదిలముగ వేదముల్ బంగారుచేరులై పట్ట వెరపైతోచె నుయ్యాలా
వదలకిటు ధర్మదేవత పీఠమైమిగుల వర్ణింప నరుదాయ నుయ్యాలా।
కమలకును భూసతికి కదలు కదలుకు మిమ్ము గౌగలిచంగజేసె నుయ్యాలా
అమరాంగనలకు నీ హావభావవిలాస మందందెజూపె నీ వుయ్యాలా।

కమలాసనాదులకు గన్నులపండువై గణుతింపనరుదాయ నయ్యాలా
కమనియ్యమూర్తి వేంకటశైలపతి నీకు కడువేడుకైయుండె నయ్యాలా। ''

శృంగారకీర్తనలలోకూడ అన్నమయ్య తన నాయకుని దేవత్వ మణుమాత్రమయిన చెక్కు చెదరనీయడు. నాయిక తన ఆత్మ లేదా అలమేలుమంగ పామరశృంగారమైనచో చెంచులక్ష్మి, లేదా గొల్లవెలది. సంయోగవియోగములు రెండును మర్యాదాబద్ధమై వర్ణింపబడును.

''ఇందుముఖి నినుకౌగలించి లోపలిజగము
కందునని నీ బిగువు కౌగిలే వదలె। ''

''నెలత నీ వాలు గన్నులుమూసి జగమెల్ల
గలయ జీకటైయిన గ్రక్కునను వదలె। ''

''వెడవెడని తమ్ములము పీడుదోడాడమన
సడరీని తలప వెరపయ్యాని
వడిలోక మేలు దేవర దివ్యవదనంబు
కడునెంగిలని యొరులు గందురో యనుచు। ''

భాషపై నితని కపారమైన అధికారమున్నది. భాషయితనిచేతిలోపడి ఎంత కావల సినంత సాగి, ఎంతవలదన్న నంతనంకోచించును. ఏమలుపులోకి కావలెనన్న ఆమలుపులో నికి మళ్లి, ఏస్థాయిలో ధ్వనించవలెనన్న ఆస్థాయిలో ధ్వనించును. అన్నమయ్య సంస్కారి. అతడు శయ్యలెరుగును, పాకము లెరుగును. కావ్యగుణములన్నియు నతనికి కరతలా మలకములే. భావానుగుణమైన భాషవాడి ముద్దులొలికె ముచ్చటగలిగించు శైలిలో వ్రాయగలడు.

''జయము మనది వనచరులాల
రయమున దర్మదారలు తుత్తుతూ
రక్కసులమీద రాముడలిగెనట
దిక్కులనడుపుడు తిడిం తిడిం
యెక్కుడు సేనను యిటు మెరయింపుడు
ధక్కానినదం ధమధమధమం. ''

అని ధ్వన్యనుకరణాత్మకములైన శబ్దములువాడి భావమును మూర్తికట్టించును. అలంకారములు కూర్చుటలో యితనికితడేపాటి. వస్తువునకు వస్తువేకాదు భావమునకు వేరొక

భావమునుపమానముగా వాడి కూడ తన ప్రతిభచూపగలడు. ఆశ వగవంటిదట; మమత జగడమువంటిదట; వెంకటేశ్వరుని కృపనీతివంటిది. ఇతర దేవసంస్మరణము భూతము వంటిది. ఆ స్వామినీరుకొలది తామరట : ఈ సంసారము చమురుదీసిన దివ్వెయట ! ఉపమలు రూపకములు సాంగరూపకములు కూర్చి యితడు వర్ణ్యవస్తువునకు తోడు మరొక కల్పితవస్తుప్రపంచమునే మన కనుల ముందుబెట్టును. వ్యంగ్యమాశ్రయించి విరోధములు ధ్వనించును. ప్రాచీన పరంపరాగత కవిసమయములు వాడినను కొత్తధోరణిలో వాడును. కొన్నికొత్తవి కల్పించనూగలడు.

"ఘనదురితపు సల్లకలువలు వికసించె
మినుకు శశివర్ణుడ మేలుకోవయ్యా"

"తలపుతామరంలోన తావైయుండుదు నీవు తుమ్మెదరో"

"అంతకంతకుగాలి కణగునాయనలంబు
కాంత నిట్టూర్పులాకలి చెరచెగాక"

"ధవళమగు కలుహారదళనఖంబులచేత
యువతి కుచగిరుల చంద్రోదయంబాయె
తివిరి ముఖచందురుని తెలివి యౌవనసుధా
ర్ణవమునకు సురతమధనంబు ఘనమాయె."

"ఈ వైభవమ్ము పై నిచ్చగించితిగాని
ఈవైభవానంద మిదివొందనైతి"

భాషకుగల లాక్షణిక సంపదనంతయు కొల్లగొట్టి మరీ యితడుపయోగించుకొనినాడు. గ్రుక్కత్రిప్పకుండ జాతీయములుపేర్చి, గుదులుగ్రుచ్చి లెక్కలేనన్ని సామెతలందించి, సాటువులుచెప్పి మాటాడగలడు. అలరి యాటలు, నీడల చూపులు, మంచు బులకలు, ఎండచూపులు, కొంకి కోరికలు, అంకెలమోవి, చీకటిమేను, బయలీత, పులకలనారు, ఆరుమూరుసేత, నంతవలపు వంటి సరసమైన పలుకులకుతోడు చిగురుగొమ్మైనచేవ, మీసాలపై తేనియల్, తంగేటిజున్ను, తలపూవాడనివంటి వెన్నో జాతీయ ప్రమోగము లితని రచనలో కోకొల్లలుగా దొరకును. సామెతలు దొంతులు దొంతులుగా పేర్చి అందించుటయే కాదు తనపలుకొక సామెతగా మెరపించగల చాతురికూడ ఇతనిలో కలదు. ఒకే పదములో అయిదారు సామెతలు గుమ్మరించును.

"కంటిలోని నలుపు కానబొయ్యేరా"

''కొంకితెంచి ముడికొంటె కురుచే కాదా''

"మొదలుండ కొనలకు మోచినీళ్లు పోయనేల"

"చెంతనిండు చెరువుండ చెలమలేలా"

"కుమ్మరి కొకయేఁడు గుదియకొకనాడు"

ఇట్లెన్నైనచూపవచ్చును. పల్లవిలోగల భావముతోపాటు పలుకుబడులనుకూడ చరణములలో పల్లవింపజేయుట ఇతనిశిల్పమున కొక విశిష్టత. ఒకచరణమున కొకచరణము ప్రతిబింబమువలె, కవల పిల్లలవలె, యీడుదీయక మెరయుచుండును.

ప్రలపనవచనైః ఫలమిహకిం చం
చలకుద్యక్షాలనయాకిం
ఇతర వధూమోహితం త్వాంప్రతి
హితవచనైరీహిత మిహకిం
సతతం తవానుసరణమిదం మమ
గతజల సేతూకరణం కిం
వికట వినయదుర్విటం త్వాం ప్రతి
సుకుమారార్ద్ర స్తుత్యాకిం
ప్రకట బహులకోపనం మమతే
నకలం చర్విత చర్వణమేవ

తెలుగులో వెట్టు సరళమైన వ్యావహారిక భాషనుపయోగించెనో సంస్కృతములోకూడ ఇతడట్లే వ్యవహారసరళమైన భాషనుపయోగించెను. సంకీర్తనల కిదియే సలక్షణమైన భాష అనితానే లక్షణముకూడ వ్రాసెను. ఇతడు మహాస్వతంత్రుడైకవి లవ్యాకరణమేమి అలంకారశాస్త్రమునకున్న అవధులేదాటి పోగలధీరుడు. ఇతని శిల్పమొకొక్కచో సాహిత్య శాస్త్రమునకే అందదు.

"వెలలేని వేదములు వెదకితెచ్చిన చేయి
చిలుకు గుబ్బలిక్రింద చేర్చుచేయి
కలికి యగు భూకాంత కౌగలించిన చేయి
వలనైన కొనగోళ్లవాడి చేయి" అనుచోటగల చిత్రగర్భితయెంత చాతు

ర్యమో చూడుడు. ఇది బొమ్మలో బొమ్మమెరపించువేర్పు.

మహాప్రౌఢుడైన యీ కవిని వెలుగులోకిదెచ్చి తిరుమల తిరుపతి దేవస్థానము వారాంధ్రలోకమువారి కృతజ్ఞతకుపాత్రులైరి. ఇక యితని సాహిత్యమును ప్రచారమునకు దెచ్చుకొనవలసిన బాధ్యత తెలుగులది. పాటలైననూ, ద్విపదలు, మంజరులు, రగడలు విషమజాతి సీసములు అగుటవలన నివి పద్యములవలె చదువుకొని ఆనందించుటకు కూడ వీలిచ్చును. లాలి, జోల, సువ్విపదములు మనమెరుగనిదికావు. పండితులాదరించి యీ పాటలలోగల సాహిత్యసౌందర్యమును లోకమున చాటెదరినియూ, పాఠ్యగ్రంథములలో తావిచ్చి విశ్వవిద్యాలయములవారు వీటి ప్రచారమునకు చేయూతనిచ్చెదరనియూ, ఆశించు చున్నాను. నాడు యీ కవిపట్ల మనము న్యాయముచేసినవారము కాజాలమని విన్నవిం చుచూ, ఆ వేంకటేశ్వరునే యీ యూహకు బలమిమ్మని ప్రార్థించుచున్నాను.

# అన్నమాచార్యులు - ప్రబంధానుసంధానము

శ్రీమన్నాథమునుల వారి కృపవలన మనకు తమిళభాషలో ఆళ్వారులు రచించినవి నాల్గువేలపదములు (పాశురములు) లభించినవి. ఈ పదసమూహమునే నాలాయిరమనియూ, ద్రావిడవేదమనియూ, పంచమాగమనియూ, ప్రబంధమనియూ పిలుతురు. ఆళ్వారులు జన్మతః భక్తులు. పరమేశ్వరునియందు అచంచలమైన అనురక్తి కలిగి, నిరంతరనామ స్మరణానుసంధానముచేసి తరించిన మహనీయులు. వీరు సంఖ్యకు పండ్రెండుగురు. పొయిగై, పూదత్త, పేయ్, పెరియ, ఆండాళ్, తిరుమళిశై, కులశేఖర, తిరుప్పాణి, తొండ రడిప్పొడి, తిరుమంగై, మధురకవి, నమ్మాళ్వారులని వరుసగా వీరి తిరునామములు భగవత్కైంకర్యమే ప్రాణాధారమను భావనతో మెలగి, భగవచ్ఛరణాగతి పూరితమైన బ్రదుకు బ్రదికి, భగవద్విషయమే నోటవచించి తరించిన ఈభక్తుల రచనలు వేదవేదాంత విజ్ఞానసారభూతములై వెలసి, తరువాతివారికి వేదములవలె ప్రమాణములైనవి. వేద మంత్రములకు వలెనే ప్రబంధపాశురములకు కూడ వినియోగము చెప్పబడినది. అర్చ నామష్టానాదులలో ప్రయోగము విధించబడినది. అధ్యయనాధ్యాపనలకు పరంపర యేర్పడినది. రాగతాళములతో పాడుకొని ఆనందించుట కనువులు కూర్పబడినవి. ప్రతిపాద్యవిషయమును సుబోధముచేయు వార్తికములు. వ్యాఖ్యలు వెలసినవి. కాని ఈసాహిత్యమంతయు తమిళ భాషలోనే పెరిగినది. తదితరభాషీయులైన వైష్ణవులకు మతాభిమానముచే వీటియందు గౌరవలోపము కలుగలేదుకాని, వీటి తత్త్వము చక్కగా నెరుగు ఉపాయము మాత్రము దూరమైనది. అన్నమయ్య అట్టి తెలుగువైష్ణవులలో నొకడు. తాను స్వతః భక్తుడు. పరమేశ్వరుని సన్నిధానమున దీక్షితుడు. అహోబలయతీంద్రుల వద్ద వేదాంతమభ్యసించినాడు. తాను నేర్చిన ప్రబంధమునే తన భక్తిప్రపత్తుల కాదర్శముగా, మార్గదర్శిగా భావించి తదనురూపమైన రచన తెలుగులో వెలయించినాడు. పాట్టుల మర్యాదలోనే 32 వేల పాటలు వ్రాసి ఆంధ్రవేదమును నిర్మించినాడు. అందుకే చిన్నన్న.

"జ్ఞానమత ద్రావిడాగమ సార్వభౌము
లైన మావారల నాళువారలను" స్మరింతునని ముందుగా,
"వేదంబులెల్ల ద్రావిడముగాజేసి
వేదాంతవిదులు గోవిదులువైనట్టి

గురుతరులగు పరాంకుశ ముఖ్యయోగి'' వర్యుల నెన్ని, అమీద,
"వేదంబు తెలుగు గావించి సంసార
ఖేదంబు మాన్పిన కృష్ణమాచార్యు
ఘనతరపంచమాగమ సార్వభౌము
ననఘు శ్రీ తాళ్ళపాకాన్నమాచార్యు'' దలచి ప్రశంసించెను.

పై పద్యములో చెప్పిన కృష్ణమాచార్యులు సింహగిరి వచనములు వ్రాసినవారు. వేంకటేశ్వరపరముగా వేదవేదాంతములను తెనుగుచేసిన కీర్తి అన్నమాచార్యునిది. ఇదే సందర్భములో కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరితములో వ్రాసిన పంక్తులుకూడ స్మరించదగినవి. ''ద్రవిడవేదాంత రచనమునకై శఠకోపయతీంద్రు లవతరించిన విధముగా నాంధ్రవేదాంతరచనమునకై యన్నమాచార్యు డవతరించినాడు. "ఆళ్వార్లు రచింపగా నరవమున ద్రావిడవేదమమనీ పంచమాగమనీ పేర్కొనబడు దివ్య ప్రబంధము నాల్గువేల సంకీర్తనములు పాట్టులు (సీసపద్యాలవంటివి) కలది. కాగా అన్నమాచార్యుడొక్కడే రచించిన ఆంధ్రవేదము ముప్పదిరెండువేల పాటలుగలది. ఈ సంకీర్తనలు దివ్యప్రబంధము ననువర్తించియే పరమాత్మునకు భక్తజీవులకు పతిపత్నీభావము, నాయికానాయకభావము కల్పించి, యుజ్జ్వలరసానుభూతి నొదవించుచు ననేక దేవాలయముల లోని అర్చామూర్తుల నభివర్ణించుచు శరణాగతి మహత్వమును బ్రతిపాదించుచు నింక ననేక విధముల లోకనీతి, ధర్మోద్బోధ, భూతదయాది విశేషాంశముల వెలయించుచు నెంతో వింతగా వేడుకగా సంగీతసారస్యముతో నవరసభాషతో వేదవేదాంతేతిహాసాదిసూక్తి తదర్థ ప్రతిపాదనములతో వెల్విరిసి పెరియవాచ్చాంబిళ్లైవంటి మహావ్యాఖ్యాత వెలసెనేని, యఖం డానందతాండవముగా బెద్దపెద్ద వ్యాఖ్యాచమత్కారములు త్రవ్వి తీయదగినట్లు విజ్ఞాన నిధులై విరాజిల్లుచున్నవి ''

పై పంక్తులలోని యాథార్థ్యము తెలియవలెనన్న ఉభయభాషావిదులైన వేదాంతు లీ రెంటిని — ఆళ్వారుల పాట్టులను, అన్నమాచార్యుని పాటలను — చక్కగా శోధించి వ్యాఖ్యానించుట మంచిది. అంతవరకు మనకందినంతమేర కీ రెంటిని సరిపోల్చి చదివి చూసినచో కొంతకు కొంత్తైన సత్యము బయటపడక మానదు. అసలు అన్నమాచార్యుడు ఆళ్వారుల పంక్తికెక్కిన భక్తుడు. ఇక దివ్యప్రబంధములోగల విషయమే — భగవత్ప్రేమ, భక్తి లక్షణము, మోక్షోపాయము, గుణానుభవము, నామసంకీర్తనము, సాక్షాత్కారసాన్నిధ్య ప్రాప్తులకై దైన్యము, వియోగముచే పరితాపము, సంయోగమాసించి పంపు సందేశము, అవతారవిభవము, అర్చామూర్తుల వైభవము మున్నగు వర్ణనలే — అన్నమాచార్యుని

కీర్తనలలో ప్రతిపాద్యవిషయములైనవి. తాను స్వతంత్రుడు, కవి, ఉల్లాసోద్రేకములు కల భక్తుడు, సంగీతజ్ఞుడు. కాన అన్నమాచార్యులు ద్రావిడవేదమును అనువదించుటకు బదులు అనుకరించెను. దానివలన స్ఫూర్తిగొని తన రచన వెల్లివిరియించెను. మచ్చునకు ఆళ్వారులలో మొదటివారైన పొయిగైఆళ్వారు రచనలొండు రెండుచూసి, తదుపరి అన్నమాచార్యుని పదములు చూసినచో యీ విషయము స్పష్టమగును.

పొయిగైఆళ్వారు వ్రాసినవి నూరుపాశురములు వీనిలో పదిపాశురములు వేంకటాద్రిని వేంకటేశ్వరుని వర్ణించుచూ చెప్పినవి. వేంకటాచలమును దర్శించినంతనే మోక్షలబ్ధికాగల దనియు, నిత్యసూరులుకూడా దివినుండి దిగివచ్చి శ్రీవేంకటేశ్వరుని సేవించుచుందురనియు "ఎళ్వార్ విడైకొళ్వార్" అను పాశురములో వారుశెలవిచ్చిన అభిప్రాయమే అర్థాంతరముగా "అదివో అల్లదివో హరివాసము" అను పాటలో అన్నమాచార్యుడు వెల్లడించెను. ''అదివో నిత్యనివాస మఖిలమునులకు'' ''నింగినున్న దేవతల నిజ నివాసము" "కైవల్యపదము వేంకటనగ మదివో" అను వాక్యములలో నీ భావము మరింత సన్నిహితముగా గోచరించును.

'పరమేశ్వరు డా పవిత్రస్థలమున (వేంకటాద్రిపై) శంఖమూది నిల్చెను. నేడా కొండ నానాదిశలనుండి భక్తుల నాకర్షించుచున్నది. పురుషులు ధూప దీప పుష్పస్రజాదులు తెచ్చియిచ్చి ఆ దేవుని సంప్రీతునిగా జేయవెంచి వత్తురు' అను భావమును "వకైయఱునుణ్ కేళ్వివాయ్‌వార్ కళ్" అను పాశురములోనూ అట్లే భక్తురాండ్రను గూర్చి "వడైయారుం వాట్కణ్ణార్" అను పాశురములోనూ పొయిగైఆళ్వారు వర్ణించిరి. ''నానాదిక్కుల నరులెల్ల వానలలోన వత్తురుగదలి'' అను అన్నమయ్యకీర్తన కివి స్ఫూర్తినిచ్చినవని యూహించినచో తప్పులేదు.

''సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్రయోజనవాసులు ను
వ్రతములతోడనె వత్తురు గదలి

ముడుపులు జాళెలు మొగిఁడల మూటలు
కడలేని ధన ముఁగాంతలును
కడు మంచి మణులు కరులుఁ దురగములు
వడి గొని చెలఁగుచు వత్తురు గదలి

ఆళ్వారులనాటికినీ అన్నమాచార్యులనాటికినీ దేవుని ఆరాధనల స్వరూపస్వభావములలో వచ్చిన మార్పులుకూడా మన కీ పట్టున బోధపడగలవు. అస్తు. ఆళ్వారులు ఏ అర్చా మూర్తిని వర్ణించిననూ, ఆదేవుని పరవ్యూహాది ఇతరరూపములను గూడ ప్రస్తావించి, అభేదము పాటించి, అంతర్యామిత్వ మంగీకరించి ప్రపత్తితో వర్ణింతురు. "వెళ్ళత్తు నుళ్ళామం వేంగడత్తు మేయానుం ఉళ్ళత్తునుళ్ళావెన్ఱు ఓర్" అని పొయిగైయాళ్వారు, ఆ క్షీరాబ్ధివాసుడే వేంకటాద్రివాసుడనియూ, అతడే భక్తహృదయాంతర్వాసి అనియూ వర్ణించి, ఆతని యీ అంతర్యామిత్వమెరిగిన వారి కత డెట్టఎదుటనే కలడు కనుక వేరొకచోట వెదక వలసినపనిలేదని శెలవిచ్చిరి. తిరిగి, "ఉనర్వార్ ఉన్ పెరుమై" ఇత్యాదిగా గల పాశురములలో వేదములకే అందరానంత మహత్వగుణసంపన్నుడైన ఆ వైకుంఠాధిపతియే, ఆ సర్వజగన్నాయకుడే, యీ వేంకటాధిపుడని వర్ణించి, ఈశ్వరుని పర, వ్యూహ, అర్చా రూపముల సమన్వయము సాధించిరి. "ఇడన్దదు భూమి, ఎడుత్తదు కున్ఱమ్" వగైరా వాక్యములచే వరాహ, వామన, రామ, కృష్ణావతారములు ధ్వనించి, శ్రీ వేంకటేశుని వైభవము నభివర్ణించిరి. ఈ సంప్రదాయ మన్నమాచార్యునిలో వెన్నుదన్ని నిల్చినది. అడుగడుగునా అతని రచనలో నీరీతి వర్ణనలు కనిపించును.

1) వందేహం జగద్వల్లభం దుర్లభం
మందరధరం గురుం మాధవం భూధవం

2) రామవామం యజ్ఞరక్షణం లక్షణం
వామనం కామినం వాసుదేవం
శ్రీమదావాసినం శ్రీవేంకటేశ్వరం
శ్యామలం కోమలం శాంతమూర్తిం

3) ఆలించి శ్రీవేంకటేశు డాత్మలో వెలుగగాను
మేలి మాతని మీద మెరయంగ వలదా

4) అప్పుడు శ్రీవేంకటేశు డంతరాత్ము డందరికి
తప్పక యాతడే కాచు తలపేటి తలపు

ఆళ్వారులు దేశములోగల అర్చామూర్తులలో, తత్రాపి దివ్యతిరుపతులుగా పేర్కొన బడిన క్షేత్రములలో గల స్థానకాసీన శయన చలన రూపములలో ప్రత్యక్షమగు మూర్తులను వర్ణించువట్ల వాటి అభేదమును ధ్వనించుట మరవరు. "వేంగడముం విణ్ణగరుం" అను పాశురములో పొయిగైఆళ్వారు వేంకటాద్రి, కంచి, తిరుక్కోయిలూరులలో గల అర్చా

మూర్తుల విభవమిట్లే వర్ణించిరి. అన్నమాచార్య డేదేవళమేగి యేదేవునియెదుట నిలిచి పాడినను, వేంకటేశ్వర వరముగానే పాడి, అతని ముద్రతోనే నివేదించెను. ఈరీతి హృదయసామ్యము గలవాడగుటచేతనే అన్నమయ్య ఆళ్వారుగా భావింపబడి, 'తిరమై ఆళ్వారుల తేజముఁ దానైయుండు, గరుడానంత ముఖ్య ఘనులనంగతిని' అని తర్వాతి వారిచే కీర్తింపబడినాడు.

---

# —నమ్మాళ్వారు

ఆళ్వారులలో నమ్మాళ్వారు మిక్కిలి ప్రసిద్ధులు. వీరినే శఠగోపయతి అనియూ పరాంకుశముని అనియూ పిలిచెదరు. ఈ మహనీయుడు కురుకూరను గ్రామములో జన్మించి జన్మప్రభృతి యేడునంవత్సరములు బాహ్యప్రపంచముతో నిమిత్తము విడిచి నోటి మాట కంటిచూపులేక శుద్ధజడపదార్థమువలె జీవించెను. తల్లిదండ్రు లితని నొకచింత మాని తొర్రలోవిడిచిరట! ఆ మీద కొన్నాళ్ళకు మధురకవిఆళ్వారులాత్రోవనేగి చెట్టు తొర్రలోనున్న ఆ మహాత్ముని పరీక్షించి, మాహాత్మ్యమెరిగి, శిష్యులై, తనకును తరువాతి వారికినీ ఉపకారము చేసినారు. ఈ ఇద్దరి నమాగమఫలితముగా దివ్యప్రబంధములో నేడు దివ్యాతి దివ్యములుగా భావింపబడుచున్న పాశురములెన్నోలభించినవి. అందులో నమ్మాళ్వారు సాయించిన పాశురములు 1296. ఇవినాల్గు గ్రంథములుగా విభాగింప బడినవి. వాటి క్రమమిది.

1. తిరువాయిమొళి, 1102–పాశురములు,
2. తిరువిరుత్తమ్, 100 పాశురములు.
3. తిరువాశిరియమ్, 7 పాశురములు.
4. పెరియతిరువందాది 87–పాశురములు.

వీనిలో తిరువాయిమొళి మిక్కిలి ప్రసిద్ధము. దీనికి దీర్ఘశరణాగతి అని మారుపేరు. ఇందాద్యంతము భగవదున్ముఖమగుప్రేమయే వర్ణ్యవస్తువు. అకారణమున నిది భాగవతులకు మిక్కిలి ప్రేమపాత్రమైనది. దీనిలోగల పాశురములన్నిటిని నంగీతజ్ఞులు రాగతాళములతో కీర్తనలుగా పాడుకొందురు. ఇది ఘంటము చేతబట్టి వ్రాసినకవిత్వముకాదు.

అనాహూతముగా ఆళ్వారుల శ్రీముఖమునుండి వెలువడిన భక్తిరసామృతప్రవాహము. తొలిపాశురపుటంత్యపదము మలిపాశురపు టాదిపదమై ఎడతెగని ధారగావెలలి యీ రచన నిరంతరతైలధారవంటి భక్తికి నిదర్శనప్రాయమైనది. ఇట్టి రచనా సంప్రదాయమునకు 'అందాది' రచన అనిపేరు. తెలుగులో పెదతిరుమలాచార్యులు వ్రాసిన చక్రవాళమంజరి యీ లక్షణముగల రచన. భక్తియే ఎంతసేపైననూ ప్రతిపాద్యవిషయమగుటచేత ఇట్టి రచనలలో పునరుక్తులుండకతీరవు. కాని భగవన్నామసంకీర్తనమునకు పునరుక్తిదోషము లేదు కదా! ఈభక్తులీ గ్రంథములో ఎన్నెన్నో దివ్యక్షేత్రములలోగల అర్చామూర్తుల నభివర్ణించుచూ పాశురములుచెప్పిరి. ఇందులో రెండుదశకములు ప్రత్యేకించి తిరుపతి వేంకటేశ్వరపరముగా చెప్పబడినవి. ఇవిగాక అక్కడక్కడ క్వాచిత్కముగా కూడ వేంకటేశ్వరుని ప్రస్తావన కలదు.

నమ్మాళ్వారు భక్తి శృంగారభక్తి అనిపించుకొనును. తిరువాయిమొళిలో నాయకుని కొరకు విలపించు నాయిక విరహావస్థలు, దూతికాసందేశములు, వగైరా ఘట్టములెన్నేనికలవు. పైగా, ఇందులో దేవుడు, జీవుడు, ప్రకృతి మున్నగువాటి తాత్త్వికవివరణముతోపాటు శరణాగతితత్త్వము కూడ చక్కగా ప్రతిపాదింపబడినది. ఇందలి మొదటిపాశురములోనే శరణాగతి వివరింపబడినది.

" అతిశయంబులకెల్ల నత్యధికమైన
యతిశయంబగు నానంద మ్మశమముగ
గల్గిభాసించు నమ్మహాఘనుడెవండొ ;
జ్ఞానశూన్యత యన్యశేషత్వబుద్ధి
దనకు దానీశ్వరుడనను తలపుగనుట
యిట్టి యజ్ఞానములు నశియింపజేసి
పొదుగుపట్టని క్షీరంబు భూమిమీద
గార్చుధేనువువలె గటాక్షంబుపొంగ
భక్తిరూపమౌజ్ఞానంబు పరగునట్లు
కరుణనామీదజల్లు రక్షకుడెవండొ ;
భగవదను భవానంద సంబంధమందు
భంగమనియెడు మరణం బెరుంగనట్టి
నిత్యసూరుల బాలించు నేతయెవడొ ;
అట్టి పరమపూరుషుని నర్వార్తిహరము

లైన దేదీప్యమాన పాదారవింద
ములనె సర్వదాయా[శయంబుగ దలంచి
నల్బుమీా జీవనము మాననంబనీవు." (1-1)

( తిరువాయిమొళి-శ్రీబచ్చుపావయ్య సెట్టిగారు )

ఇట్లనితర సరళమైన పద్ధతిలో మోక్షోపాయమును వెల్లడించుటచేతనే తిరువాయి మొళి ద్రావిడవేదమనిపించుకొన్నది. తెలుగులో అన్నమాచార్యుని రచన కూడ ఇంతే చక్కటిది. ద్రావిడవేదమును రచించుటకు నమ్మాళ్వారులెట్లో ఆంధ్రవేదము రచించుటకు అన్నమాచార్యులట్లే అవతరించెనని కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వచనము. ( చూ. అన్నమాచార్య చరిత్రము పీఠిక ) ఈ యిర్వురిలోగల మరికొన్ని బహిరంగ సామ్యములు కూడ శాస్త్రిగారు వెల్లడించిరి. "శఠకోపయతి వైశాఖమాసమున విశాఖా నక్షత్రమున నవతరింపగా నన్నమాచార్యుడును వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరించినాడు. శఠకోపయతి పదునారేండ్లవయసువాడయిన తర్వాత సర్వవిద్యలు గోచరించి ద్రవిడసంకీర్తనములు రచింపదైవానుగ్రహమందగా నన్నమాచార్యుడును నట్లే పదునారవయేట స్వామిప్రత్యక్షమై యుద్బోధింపగా సంకీర్తన రచనసాగించెను. శఠకోపయతి శ్రీతిరువేంగడనాథుని మీాదను నింకనవేక దివ్యస్థలములలోని విష్ణుమూర్తుల మీాదను సంకీర్తనములు రచింపగా నన్నమాచార్యుడును ప్రధానముగా శ్రీవేంకటనాథుని మీాదను నింకనవేక పుణ్యస్థలముల విష్ణుమూర్తులమీాదను సంకీర్తనములు రచించెను. శఠకోపయతి స్వామికౌస్తుభాంశమున జన్మించినట్లు విజ్ఞులు విశ్వసింపగా నన్నమాచార్యుడు స్వామినందకాంశమున నవతరించినట్లు ప్రాజ్ఞులు పరిగణించిరి." ( అన్నమాచార్యచరిత్రము. పీఠిక పు-121)

వీరికి గల ఆంతరంగిక సామ్యములు ఆయీ రచనలు రెండును చూచిన వారికెల్లరికి విదితమే. నమ్మాళ్వారులు ఘంటాపథముగా.

" ఆదినారాయణుడు వేంకటాద్రియందు
విడిసియున్నాడు గనుక నయ్యెడకు నరిగి
వానిగాంచెడువారు సౌభాగ్యపరులు." (9-3.)

అని అభివర్ణించిచెప్పిన శ్రీవేంకటేశ్వరుడే అన్నమాచార్యుని ఆరాధ్యదైవము. అతడే ఇతని సర్వస్వము. ఆ అర్చామూర్తియే వేదచోదితుడైన "పరమాత్ముడు సర్వపరిపూర్ణుడు, సురలకు నరులకు చోట యినమూర్తి."

" కలది యీమూర్తివల్లగతిగనవలెను
ఇల నిందునమ్మకుంటె ఎందుమరిలేదు.
కంటిమా బ్రహ్మమును వేంకటపతిగనినట్లు
కంటిమా అవతారాలు కతలెగాక
కంటిమా హృదయములో గలిగినదైవమును
కంటిమా వైకుంఠము కడవారినైనాను "

ఈ స్వామి శంఖచక్రధారియై, వరదాభయమూర్తియై, ముప్పొద్దులా భక్తుల ననుగ్రహించు చున్నాడే! ఇక కావలసినదేమి? "సంశయాత్మా వినశ్యతి"

" వేసితేవేయిరూపుల విశ్వరూపమితడు
శ్రీసతీశుడిందరిలో శ్రీమంతుడు
భానురిపు భూమిమోచే బలవంతుడిన్నిటాను
దాసులైతే మన్నించు నీదైవము గొలువరో "

కాదని మనము సాధించెడిదేమి? అసలు మనమా సర్వేశ్వరుని మాయతరించగలమా? అందుకు మాత్రము మనకుగల శక్తిస్వాతంత్ర్యములేవి?

" దేహమునకు నీడతిరిగివయటువలెనే
శ్రీహరికి కళావిధమై జీవుడటుతిరుగు
దేహమునకు గల చైతన్యము తెగినీడకులేదు
శ్రీహరికి గల స్వతంత్రము జీవునికి లేదు. "

సర్వతంత్ర స్వతంత్రుడా వేంకటేశ్వరుడొక్కడే. తదితరములన్నియూ నతని అధీనమే.

" ఆయంబిది తెలియంగలదీ యాత్మజ్ఞానము
మాయలు ఈ కాలము కర్మము మాధవునాధీనము. "

కావున వృథాభిమానమువిడిచి త్రికరణశుద్ధిగా 'హరి సర్వపాపేభ్యో అహం త్వామ్మవె, గరిమనా వాక్యమే ప్రమాణమైనట్టిగతి 'అనినమ్మి శరణాగతుడై తరింపుడని అన్నమాచార్యు డుపదేశించినాడు.

" హరినామమేముక్తి అరసి కైకొంటేను
ధరనాతని దాస్యమే తగినముక్తి "

అనిచాటిచెప్పి, ముక్తితత్వము నిర్ణయించి కైంకర్య ముద్బోధించినాడు.

నమ్మాళ్వారులోవలెనే అన్నమాచార్యునిలో కూడ శృంగారభక్తి వెల్లివిరిసినది. నాయికా నాయకభావమును వర్ణించి, ప్రేమభక్తిని నిరూపించు రచన లెన్నిటికో నమ్మాళ్వారు వ్రాతలే మూలప్రేరకములు. అన్నమాచార్యునికి కూడ అవియే స్ఫూర్తినిచ్చినవి. ఆ యీ విషయము లింకొక మారు ముచ్చటింతును. ప్రకృతమునకీ క్రిందివాక్యములలో అన్నమయ్య తిరువాయిమొళివట్ల జూపిన గౌరవప్రపత్తులు మాత్రము గమనింపదగినవి.

" పరమగువేదము బహుళము చదివియు
హరివెరిగిన వారరుదనుచు
తిరువాముడియై దివ్యమంత్రమై
విరిసిన పంచమ వేదమేకలిగె.
కలియుగంబునకు గలదిదియె
వెలసిన పంచమవేదమే కలిగె "

---

## —శరణాగతి తత్త్వము

అన్నమాచార్యుని జీవితమే ఒక దీర్ఘశరణాగతి. పుట్టి బుద్ధిగనిన పదునారవ యేటనే అతడు తన్ను శ్రీ వేంకటేశునికి దానునిగా దాసానుదాసిగా శరణాగతునిగా భావించుకొని ఆత్మార్పణచేసుకొన్నాడు. ఆ మీద అహోబలములో వన్ శఠకోప యతీంద్రుని వద్ద వేదాంతమభ్యసించి ఈ శరణాగతితత్త్వమునే మరింత దిట్టపరచుకొన్నాడు. వైష్ణవ ధర్మములో అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే। తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహం' అనిచెప్పిన గీతా వాక్యముపై విశ్వాసముమెండు. అదిగాక "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ। అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" అను చరమశ్లోకమును విశిష్టాద్వైతులు భగవంతుని వాగ్దాన ముగా విశ్వసించి అతని శ్రీ చరణములనే శరణముగా గొని తరింపనెంతురు ఈ తత్త్వమునకు బలమిచ్చు తర్కసంపదయే తక్కిన సిద్ధాంతసంప్రదాయమంతయును. ఆళ్వా రులనాటినుండి యీనాటివరకు వెలసిన విశిష్టాద్వైతమత గ్రంథము లన్నియూ ఇదే విషయ మును పునః పునః పరివరి విధముల ప్రతిపాదించుచూ వచ్చుచున్నవి. అన్నమాచార్యుని

పదములన్నియూ ఇదే విషయమును కేంద్ర బిందువుగా నుంచుకొని రచించబడినవి. పదే పదే అతని ప్రపన్నత గోచరించు చుండును. అడుగడుగునా అతని శరణాగతి ధ్వనించును.

1) ఇన్నివిధాలు ఇక నేల ప్ర
పన్నుడై మీద బహువిధులేలా

2) వెరగుతో మరచితే వెనకలేదు
కరివరదుడే తక్కగతి యొండులేదు.

3) హరి నీమయమే అంతాను
అరసి నీకు శరణనియెదను

4) ఆచార విచారాలవియు నేనెరుగ
వాచామ గోచరపు పరదుడవు నీవు

5) అంతర్యామీ అలసితి సొలసితి
ఇంతట నీ శరణిదె చొచ్చితిని.

ఇట్లు కృతనిశ్చయుడై ఆ వేంకటేశ్వరుని కైంకర్యమంగీకరించుటలో తనకుగల విశ్వాసప్రత్యయాదులన్నిటినీ కూడ అతడు తన రచనలో వెల్లడించెను. "నిత్యసూరులా పరమాత్మని శరణని తరించిరి ఆళ్వారులా పరమేశ్వరుని పదములు నమ్మి పరమ పదమంది ధన్యులైరి. నమ్మిన వారికా నారాయణు డరచేతి వైకుంఠము. నమ్మకపోవుట మనపాపము" అని అన్నమాచార్యుని నిశ్చయము.

నీవేమి సేతువయ్య నీవు దయానిధి వౌదువు
భావింపలేనివారి పాపమింతేకాని

పరమపదమొసగి పాపమడచేనని
చరమశ్లోకమునందు చాటితివి తొలుతనే
నిరతి నీభూమిలోన నీ వల్ల తప్పులేదు.
పరగనమ్మని వారి పాపమింతే కాని

నీ పాదములకు నాకు నెయ్యమైన లంకెని
యేపున ద్వయార్థమున నియ్యకొంటివి తొలుత
దాపుగా నీవల్ల నింకతప్పులేదు యెంచిచూచి
పైపైనమ్మనివారి పాపమింతే కాని.

బంతిపురాణములను భక్తనులభుడనని
అంతరాత్మ వీమాట ఆడితివి తొలుతనే
ఇంతట శ్రీ వేంకటేశ యేమిసేతువయ్య నీవు
వంతాన నమ్మనివారి పాపమింతే కాని.

దీనికి కారణమీ జీవుని అన్వతంత్రత. "జీవుడించుకంత చేతిసముద్రమంత" అతడీ కర్మముగడచి తరించుట దుష్కరము. అసలాకర్మమెక్కడిది? ఏనాటిది? ఎవరు కూర్చినది? "కర్మమంటా మాకు గట్టేవుగాక, కర్మము ధర్మము నీ కల్పితమె కాదా?" అని అన్నమాచారి ఆ దేవునే సమస్తమునకు కర్తగా నిలవరించును.

"ఇందరి పాపపుణ్యాలు ఇన్నియు నీ చేతలే
కందువ స్వతంత్రులుగారుగాన
చందపు శ్రీ వేంకటేశ శరణంటినిదె నీకు
చెంది నీవే కాతుగాక చేతలూను వలెనా?"

తానుగా జీవుడీ సంసారము తరించలేడు. అందుకని అహంకృతితో ఆచరించిన కర్మ మతనిని మరింతగా సంసారపంకమున దిగద్రోచునేగాని ఉద్ధరించదు. పరమాత్మునినమ్మి చెడినవారులేరు. నమ్మక చెడినకంటె ఆతడిచ్చిన దేహేంద్రియాదు లాతని కైంకర్యమునికే వినియోగించి అచంచల విశ్వాసముతో, అనన్యభక్తితో ఆ నారాయణుని చరణద్వంద్వ మాశ్రయించుటయే తరణోపాయము.

ఇంకొక రహస్యము. జీవుడెంతచెనటియైననూ ఆ సర్వేశ్వరుని కృపకు పాత్రుడైనచో చాలు! తరించగలడు.

పరుసమొక్కటే కాదా పయిడిగాజేసేది
అరయలోహమెట్టున్నా అందుకేమీ

వనజనాభుని భక్తివదలకుండిన జాలు
మనసు ఎందు తిరిగినా మరియేమి
మొనసి ముద్రలు భుజముల నుండితే జాలు
తనువెంత హేయమైనా దానికేమి.

శ్రీకాంతునామము జిహ్వాదగిలితే జాలు
ఏ కులజుడైనాను హీనమేమి

సాకారుడైన హరి శరణుజొచ్చిన జాలు
చేకొనిపాపములెన్ని చేసినానేమి.

జీవుడెట్టున్నానేమి జీవునిలో అంతరాత్మ
శ్రీవేంకటేశునకా చింతయేమి
యేవలన పరమైన యిహమైన మాకు జాలు
కైవశమాయ నీతడు కడమలింకేలా.

భక్తితో హరిని కైవశముచేసుకొని నాకేమియని స్వాధీనపతికా నాయికవలె గర్వించినా డన్నమయ్య. తనతప్పులేవో తానెరుగును. సంసార తాపత్రయమునకుతానుగూత కొంతకు కొంత లొంగినవాడే. ఐహికాముష్మికముల మధ్య అదా ఇదా అని అల్లాడి అలమటించిన వాడే. ఎన్నెన్నోరీతుల, ఎన్నెన్నో విధముల, ఎంతగానో తనకు తానుగా వైరాగ్యమెంచి బోధించుకొన్నవాడే. అన్నిటికి మించి ఆ వేంకటేశ్వరుని శరణంటినిగదా? నాకేమి? అను నిబ్బర మొకటి గడించుకొన్నాడు. అంతేకాదు, ఆ దేవునితో తర్కవితర్కములు పెంచి వాదోపవాదములుచేసి, ఔను కాదనిపించుకొని, నయముననో, భయముననో ఆతనిని తనకు సుముఖునిగా చేసుకొనగల నేర్పు కూడ అన్నమయ్యకు గలదు.

శతాపరాధములు సహస్రదండనలు లేవు
గతి నీవని వుండగ కావకుండరాదు.

తలచి నీకు మ్రొక్కగా దయజూడకుండరాదు
కొలిచి బంటననగా కోపించరాదు
నిలిచి భయహస్తుడనై నీయెదుట దైన్యమే
పలుకగ గావకుండ బాడిగాదు నీకు.

శరణు చొరగ నీకు సారె నాజ్ఞ వెట్టరాదు
సరి పూరి గరవగ చంపరాదు
అరయ జగద్ద్రోహినౌదు నైనా నీనామము
గరిమ నుచ్చరించగ కరగకపోరాదు.

దిక్కు నీవని నమ్మగా దిగవిడువగరాదు
ఎక్కువ నీలెంకగాగా యేమనరాదు
తక్కక శ్రీ వేంకటేశ తప్పులెల్లా జేసివచ్చి
ఇక్కడ నీదాసినైతి నింక దోయరాదు.

అట్లని అన్నమాచార్యునిగురించి అన్యథా భావించకూడదు. శరణార్థులకని చెప్పిన సకలసద్గుణములు ఆతనిలో గూడుకట్టి నిల్చినవి. అహింస, సత్యము, భూతదయ, సర్వసమత్వము, వైష్ణవసాంగత్యము, ఆచార్యాభిమానము మున్నగు సదాచార సత్సంప్రదాయము లన్నియు అతనికి వెన్నతోబెట్టినవిద్యలుగా అబ్బినవి. ఆ యా గుణములుద్బోధించు పదము లతనిరచనలో పరస్సహస్రముగా నున్నవి.

1) దైవమొక్కడె సతత భజనీయుడు
భావమున నమబుద్ధి బాయగ దగదు

2) ఎవ్వరిగాదన్న నది నిన్ను గాదనుట
ఎవ్వరి గొల్చిన నది నీ కొలువు

3) సకల భూతదయ చాల గలుగుట
ప్రకటించి దేహ సంభవమైన ఫలము

4) ఇన్ని జన్మము లేటికి హరిదాసు
లున్నవూర దాసుండిన జాలు

5) మతి రామానుజ మతమే నాకును
చతురత మెరసిన సంధ్య

ఇట్లెన్నేని చూపవచ్చును. ఈతనిలో శరణాగతి తత్త్వము చక్కగా జీర్ణించినది. ఆళ్వారులలో సమ్మాళ్వారు వ్రాసిన తిరువాయి మొళికి దీర్ఘ శరణాగతి అని మరియొకపేరు. అన్నమాచార్యుని రచనకు కూడ అట్టి నామ మన్వయించును. సిద్ధాంత ప్రతిపాదనలోనేమి, భక్తి నుద్బోధించుటలోనేమి, శరణాగతిని వివరించి ప్రోత్సహించుటలోనేమి ఈతని రచన తిరువాయిమొళికి మరుబాస వలెనే దీపించును. అందుకే కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 'తిరువాయిమొళి మొదలగు దివ్యప్రబంధరచనలకివి (అన్నమయ్యకీర్తనలు) తీసిపోవు' అనియూ, 'ఈ సంకీర్తనలు తెల్గునాటి విష్ణ్వాలయములలో దివ్యప్రబంధములుగా నిత్య సంకీర్తనార్హములుగా నెగడదగినవి' అనియూ వ్రాసిరి. ఈకీర్తనల కా గౌరవమబ్బు సుదినమెప్పుడో!

---

# —శృంగారభక్తి

ఈశ్వరోన్ముఖమైన అనురాగమే భక్తి. ఈ అనురాగమనునది ఆయాభక్తుల భావనావిశేషమునుబట్టి, భగవంతునితో వారు తమకేర్పరచుకొను సంబంధవిశేషమునుబట్టి, పరిపరివిధముల వ్యక్తమగును. ఏ సంబంధము లేకున్నను భక్తుడొక్కొక్కతరి ఆ భగవంతుని అనంతకల్యాణగుణవైభవముల నభివర్ణించి తద్గుణగానములోనే అనురక్తి చూపును. ఊహించి కల్పించుకొనిన సంబంధములలో భక్తుడాభగవంతునికి తానొకపరి సేవకునిగాను, వేరొకపరి స్నేహితునిగాను, మరియొకసారి తల్లిగాను, ఇంకొకసారి పత్నిగాను భావించు కొనును. ఆయాసంబంధములన్నియూ ఆ పరమేశ్వరునిపట్ల తనకుగల అనురాగమును సువ్యక్తము చేసుకొనుటకే ఉపకరించిననూ, దాంపత్యధర్మమెంచి యేర్పరచుకొనిన సంబంధములో నివి అన్నియు అనాహూతముగా లభించును. దాస్యసఖ్య వాత్సల్యాది భావములన్నియూ పాతివ్రత్యమున నవశ్యాచరణీయములే అగుటచేత దాంపత్యభావ మితర భావముల సమష్టియేకాదు. సర్వోత్కృష్టమైన భక్తిభావమనికూడ తజ్ఞులచే కీర్తింపబడినది. భక్తునికీభావమున భగవంతుని నిరంతర సామీప్య సాహచర్యములు లభించును. అందుకని భక్తులీభావమును మధురభావమనిచెప్పి అనుభవమునకు తెచ్చుకొందురు. లోకములో వైచ్యమైనను, భగవద్విషయమున శృంగార మత్యుత్తమమైన భావమని అంగీకరింపబడి నందున భక్తులీభావ మాశ్రయించి సంయోగ వియోగాద్యవస్థాంతరము లెన్నోని భావించుకొని ఆ పరమాత్మునితో ప్రణయకలాపము నిర్వహింతురు. ఇది జీవాత్మ పరమాత్మల విశుద్ధ దాంపత్యము. అనాది సిద్ధమైన ప్రణయము. విశ్వవ్యాప్తమైన శృంగారము. నమ్మాళ్వా రులకి విశ్వమంతటనూ ఇట్టి ప్రణయమే గోచరించెను.

" ప్రబల చక్రంబుధరియించు స్వామిదర్శ
నంబభిలషించి, జలధిలో, నగములందు,
గగనమందెల్ల వెదకియు గానలేక
కాయమున్నంతపరకెడబాయనట్టి
మన్మథార్తిని బొందితో మారుతంబ!
జగములన్నీట నింపెడు జలధరంబ
స్వామిచేష్టితములకు లోబడుచు వాని
బొందనేరక దుఃఖంబు బొంది తౌర!"

(తిరువాయిమొళి—శ్రీ బచ్చు పాపయ్యశెట్టిగారు.)

అఖిరేణు పరిపూర్ణమైన యీ ప్రేమభావమే భక్తుని హృదయమునుకూడ ఈశ్వరోన్ముఖమొనర్చి స్పందింపజేయును. ఈశ్వరోన్ముఖమగుటచేత నిది అమృత స్వరూపమనియూ, అదేకారణమున మధురమనియూ, శృంగారోపేతమగుటచేత శృంగారభక్తి అనియూ పిలువబడును. నమ్మాళ్వారులలోనేమి, అన్నమాచార్యులలో నేమి యీశృంగార భక్తి అత్యుజ్జ్వలమైన స్థాయినందుకొని వర్థించినది. ఇచ్చట శృంగారమొక సాధన. దీనివలన సిద్ధించునది నైరంతర్యమైన తైలధారవంటి ప్రేమభక్తి. మొదట గోపికలీమార్గమున సిద్ధిబడసిరి. రాధాదులీక్షేత్రమున శాశ్వతలైరి. ఆళ్వారులీత్రోవచరించి తరించిరి. ఆండాళ్లు తన్నీవిధినే ఆ శ్రీరంగశాయికి సమర్పించుకొన్నది. అన్నమాచార్యులిదే పద్ధతిని శ్రీవేంకటేశ్వరుని ప్రణయమనునంధించి ఆతనికృపకు పాత్రుడైనాడు. 'నీగుణము నేనెరిగి విన్ను గొలువగనేర, నాగుణము నీ వెరిగి నన్ను నేలుకోవయ్య' అని ఇతడా పరమపురుషునికి తన్నర్పించుకొని "జంటనై ఆతని దాసానుదాసినై, అంటియుండెదగాక" అని నిశ్చయించుకొనెను. అట్లయినచో 'పువ్వులవలన నారిపాదలి తలకెక్కి నట్లెవ్వరును తనుగూడి యేపు మిగులుదురు' అని ఆతని నమ్మకము. అందుకని 'వలవనేరుతుగాని వాదించనేరరా' అని చెప్పి తన్నేలు కొనుమని త్రికరణశుద్ధిగా ఆ వేంకటేశ్వరుని ప్రార్థించెను.

శృంగారనాయికగా నున్నతరి అన్నమాచార్యుడు తన్నా వేంకటేశ్వరుని ధర్మపత్ని అలుమేలుమంగగా భావించుకొని 'అక్కరో వెంకటేశుడేనలమేల్మంగ నిక్కడ నసుగూడి యేలినాడమ్మ' అని తన పరిచయముచెప్పి, తమ ప్రణయమెరిగించును. ఆతనితో తన కేర్పడిన యీ దాంపత్యమీనాటిది కాదట!

> " కలికి కోరికల నుంగరము బెట్టిన నాడె
> చెలుపంపు విరహాగ్ని చేసెగా పెండ్లి'

కాని తానింకను ముగ్ధ. సరిసాలాపములు నెరపలేదు. సిగ్గువిడిచి అతని ననుసరించలేదు. అట్లని భావమున నాతని పొందు విడిచి యుండనూలేదు. సర్వకాల సర్వావస్థలలోను అతనినే తలచును. ఆయన గుణములే వర్ణించును. మరచి నిద్రించిననూ ఆయనతోటి పొత్తులే కలలుగాంచును.

> " కాంతునివే గలలోన కౌగలించినట్లాయె
> నంతలోనే పులకించి నట్లాయెను
> చెంతల నా చెక్కులెల్ల చెమరించి నట్లాయె
> వింతలెల్లా మేనగంటి విభుడెందున్నాడో?'

అని పలవరించుచూలేచి చెలుల నాతని వెదక నంపును. కాని వచ్చిన యాతని తగిన విధమున సత్కరించుట ఎట్లో తెలియదు.

" ఏమి సేయుదునమ్మ ఇన్నియును నిటుగూడె
తామసపు ప్రేమ వేదన బాయనీదు
కిందుపడి కదిసి మ్రొక్కెద నంటినా అతని
యందీ పరవశము చేయాడ నీదు
డెందంబు మరచి యుండెద నంటినా అతని
జెందిన తలంపు మరచియు మరవనీదు "

అని చెప్పి 'పతిగలిసి మేనెల్ల పరవశంబగుకంటె, హితవిరహమున నెదిరి వెరుగుటేమేలు' అని నిశ్చయించుకొనును. ఆ విరహముకూడ తన కనుగుణ మైనదేనట! పతివాల్లభ్యసిద్ధి కదియే ఉత్తమవ్రతమట!

" ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మరి
యిదిగాక వైభవంబిక నొకటి గలదా?
అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్ష లిన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతతవిజ్ఞాన వాసన వోలె నుండె। "

అని చెలికత్తెలా నాయిక వియోగవ్రతమును గురించి చెప్పుకొందురు. ఆ దేవదేవుని కీమె అవస్థ నెరిగింతురు. ఆతని మంకుతనము చూచి విసుగు కొందురు.

" మాయల పూపుటమ్ములు మర్మములు నాటు సింతెకాని
కాయము మీదటె గంటి కానివచ్చీనా
మా అలుమేల్మంగ గూడ మరచె నింతేకాని
ఏయెడ శ్రీ వెంకటేశ డిచ్చకుండాయెనా "

అని ఆతనినే దూరుదురు. కాని వాస్తవమున కా నాయకుడు కూడ ఈ నాయకను విడిచి యుండలేని వాడే. అసలీ అతివయౌవనమే ఆ రాయలకు పెట్టనికోట. అతడు చొచ్చినవేళనే ఆమె జవ్వనపుతోట మూడు పూవులు పూచి, ఆరు కాయలు గాచి అలరును. ఆమె వియోగముచేత నా పరమ పురుషుడు కూడ అహిపతిశయనం బతితాపంబై

బహువేదన కగవడెనట! వీరి దన్యోన్యానురక్తి. కనుకనే 'వెలతబాసి యుండలేను! నిముషమేడు వేడు నాకు' అని ఆ నాయకు డీ తరుణికై తపింపజొచ్చెను. ఆయన కృపవలన నెట్లో నాయిక బ్రదికి బయట పడెను.

" ప్రాణము నందియమైన యీ పడతికిం బ్రాణమువచ్చెను
ప్రాణేశుండు తిరువేంకటపతి కరుణించినను
ఏణాక్షికి నొకతెకుం గాదీ అఖిలంబున కీ దేవుడు
ప్రాణము ప్రాణంబనియెడి పలుకిది నిజమాయె. "

ఆధ్యాత్మదాంపత్యమున నిది ఆఖరిమెట్టు. అనుభవైకవేద్యమైన ఈ సమాగమమే భక్తుడాశించునట్టి భగవదనుగ్రహము. ఈ ఆనందమనుభవించియే భక్తుడు 'ధన్యోస్మి' అను కొనును. ఇట్టి అనుభూతి నరచేతికి దెచ్చుకొనియే,

" పుష్పధూపనైవేద్యాది పూజనముల
వెన్నడర్పించి యెరుగని నన్నుదనకు
భోగ్యవస్తువుగా గూర్చి పొందొనర్చు
నఖిలభువనైకకర్త సంహారకర్త '

అని నమ్మాళ్వారు లానందాతిరేకమున పాడిరి. అదే దివ్యానుభూతి నా మూలాస్వాదన మగా ననుభవించి, ఆతని గొంతులో గొంతుకలిపి ఆలపించిన అన్నమయ్య పలుకులివి!

" అదనెరిగి తిరువెంకటాధీశ పొందితివి
చదురుడవు నిను బాయజాల నొకమారు '

---

# — భగవద్విరహము

ప్రారబ్ధవశమున పరమాత్మునితో తన కేర్పడిన వియోగమును సహింపలేక కుందుచూ తిరిగి ఆతని దర్శనస్పర్శనసామీప్య సాహచర్యాదులంది, అనుభవించి ఆనందించుటకై భక్తుని ఆత్మపడు తహతహయే, ఆధ్యాత్మదాంపత్యమున విరహమని పిలువబడును. లోకములో శృంగారమున సంయోగ వియోగము లెట్లనుభూతికివచ్చి సుఖదుఃఖాత్మకములై రూపించునో, అట్లే అధ్యాత్మశృంగారమునకూడ జీవాత్మ పరమాత్మల వియోగము విరహ

వ్యధగాను, సంయోగము బ్రహ్మానందముగాను భావింపబడుచుండును ఇది భక్తజీవులందరికి అనుభవైక వేద్యమైన విషయము. ప్రాకృతజీవులలో శృంగారమున దశవిధమన్మధావస్థ లెట్లు గోచరించునో, అట్లే భక్తజీవులలోకూడ భగవద్వాల్లభ్య మపేక్షించినప్పుడు తత్తద వస్థోచితములైన అశ్రుచింతావ్యధా వ్యామోహ విభ్రమజ్వర శరీర కార్శ్యాదు లన్నియూ యధావసరముగా వర్తించుచుండును. భగవంతుని సంయోగమాశించి, తద్విరహ మసహ నీయమై, తపించు భక్తాత్మను నాయికగా వర్ణించి చెప్పుచూ నమ్మాళ్వారు లానతిచ్చిన పలుకులివి.

"అవనిగొల్చిన ప్రాయంపు టందకాడు
అతిమనోహర లలిత బింబాధరుండు
రమ్యతర పుండరీక నేత్రములవాడు
అట్టి శ్రీపతిపై నానపట్టియున్న
చిన్నబాలకు మేను గృశించిపోయి
హస్తకంకణములు జారె నమ్మలార!"

కాని నాయికఅయిన భక్తాత్మ తనకు తానుగా నీ అవస్థతెచ్చి పెట్టుకొనలేదట! ఆ పరమాత్ముడే ఆమెనట్లు మోహపెట్టి, ఆకర్షించి, ఆకుల పెట్టెనట! ఆమె 'నిరతిశయ పురుషార్థంబు నీరజాక్షు ప్రేమ' అని నమ్మి యీ వ్యధకెరయైనదట. 'ఆపదలయందు బాంధవుండతడొకండె' అని విశ్వసించిన భక్తుడు నమ్మాళ్వారు ఆయమ్మ పక్షమున నా పరమేశ్వరునితో దౌత్యము నెరపుచూ చెప్పిన మాటలివి.

"ఓ శ్రియఃపతి నినుబాసియుంటవలన
వనజ నయన శరీరంబు వాడిపోయె;
మార్దవోపేత మీ నాతి మానసంబు
విరహవేదనతో క్రుంగి కరగజొచ్చె"

వియోగవ్యధాదూయ మానచిత్తయై ధైర్యమెదలి దీనాతిదీనముగా విలపించుచూ, విశ్వవ్యాప్తమైన తన విరహావస్థ నెంద రెందరిచేతనో ఎన్నెన్నో విధముల నతని కెరిగించి వుచ్చి, విసిగి, వేసరి శోకావేగామర్షాశ్రుగద్గదయై సోపాలంభముగా దూతికాముఖమున నాయిక పలికిన పలుకులుకూడ వినదగినవే.

"శౌర్య కారుణ్య వాత్సల్య సద్గుణముల
మమ్ములను మోనపుచ్చి నీ సొమ్ముగాగ
జేనుకొని మీద విశ్లేషదుఃఖ
మనుభవింపగజేసెదే అంబుజాక్ష
జగతి విశ్లేషబాధ కష్టంబునీకు
దెలియకుండుటచే మమ్ము దెలియకుంటి"

నిజమే. సర్వాంతర్యామియైన ఆ పరమాత్మునికి విశ్లేషదుఃఖమెట్లు కలుగును? కాని జీవునికి సత్య మనుభవమునకు రావలెనన్న అతని సంశ్లేష సౌఖ్యమిచ్చిననాడే కదా? అంతవరకు వియోగదుఃఖమే నిశ్చయము భక్తుడైన అన్నమాచార్యులుకూడ ఇట్టి వియోగ దుఃఖ మనుభవించి కుందుచున్న తనఆత్మ (కాంత) ను గూర్చి ఇట్లే వాపోయెను.

"ఎవ్వరు గలరమ్మ ఇకనాకు
నెవ్వగల చిత్తమ్ము వెలకొన్నదిపుడు।
మనను కోరిక దీని మాసిపెదనంటినా
ఒనగూడి మనసు నావద్దలేదు
పెనగి తమకము వాపెదనంటినా
అనయము వెరపు దానైయున్నదిపుడు।

అంతయు నాతని కర్పించిన వెనుక మనవశమున నికనేమున్నది? అనుకూలమైన కాలము కానినా డయినవన్నియు కానివిగను కానివన్నియు కలవరింపులుగను మారునుగదా! "గములైన యాపదలు గదరినప్పుడు తమ్ము దమచేతి యమ్ములే తాకునో కాక!" లేకున్న ఇంత విడ్డూరిమా!

"ఇంతి భువన మోహినియైన ఫలము
కాంతుని దలచి వగల జిక్కెనిపుడు
మెలతకన్నులు గండు మీలైన ఫలము
తొలకు రెప్పలనీరు దొరలె నిపుడు
లలన మై నవపుష్ప లతయైన ఫలము
వలపు చెమట నీట వడిదోగె నిపుడు"

ఇక నేదిగతి! విరహతాపమునకు వలసిన శీతలోపచారము లెన్నెన్నియో చేసి చెలికత్తెలు విసివిపోయిరి. కాని ఫలితము శూన్యము. పట్టుదలవిడక ప్రయత్నించి చేసిన

జతనములన్నియు వమ్మైనప్పుడిక వారుమాత్రమేమిచేయగలరు? వారి కళవళింపుకూడ గమనింపదగినదే!

" ఉయ్యాల మంచముమీద నుంచి వేసారితిమి
ముయ్యదించుక రెప్ప మూసినా దెరచును।
చందమామ పాదమాన నతికి వేగినదాక
యెందును నిద్రలేదేమిసేతమే?
గందపుటోవరిలోన కప్పురపుటింటిలోన
ఇందుముఖి పవళించు నింతలోనే లేచును।

ఇక మానవప్రయత్నములే వ్యర్థము. ఆదైవమాయ నెవరెరిగిరి? అంతటికి కారణమై, అన్నిటికి సాక్షియైన ఆ పరమేశ్వరుడే దీని కుపాయమెరుగవలెగాని మానవ మాత్రులీ విరహమునకు మందు చెప్పగలరా!

"దేవశిఖామణి తిరుమలదేవుని దలపున బాయక
భావించిన యీ కామిని భావము లోపలను
ఆ విభుడే తా నుండిన నాతడె తా నెరుగగవలె
నీ వెలదికి గల విరహం బేమని చెప్పదము"

ఎవరితో చెప్పవలెను? చెప్పక ఉపేక్షించియుండ వశమా? అనలా కొండల కోనేటిరాయడీ మగువ మాట చెప్పినచో వినిపించుకొనునా? వినకున్నచో నేమిచేయనగును?

"ఏమిసోద్యమిది యెంతయును వెరగాయ
నీ మగువ విభుగలయు టెట్లనో యనుచు।
చలము కొని వేడి వెదచల్లు చూపులతోడి
నెలతగని కట్టెదుర నిలువ వెరపాయ
చెలగి లోపలనున్న చిత్తజానల మెల్ల
వెలికి వెళ్లుచు వెల్లి విరిసెనో యనుచు।"

వాస్తవమున కీ నాయిక అవస్థయే విచిత్రముగానున్నది. ఆ నాయకు డెప్పుడో యేకలలోనో కనిపించి మైమరపించి మొగము చాటుచేసుకొన్నాడు. ఈమెకీ విరహజ్వరము తలకెక్కి ఎన్ని ఉపచారములు చేసిననూ దిగదాయె! ఇంతకన్న భగవద్విలాన మింకొకటి యుండునా?

"ఇంత చేసిన భాగ్యమిట్లుండె దైవకృత
మింతయును గడవంగ నెవ్వరికి కాదు।
విరహవేదనచేత వేగెడి విలాసినుల
సొరిది నింతకుమున్ను చూడమో వినమో
అరుదైన దుస్తరంబై భరించగరాని
దురవస్థ లెవ్వరికి దొరకవని కాక।"

కాదు. దీనికి మారు చేయగల వెజ్జు ఆ వేంకటేశ్వరుడొక్కడే. 'వెలతకు కొంతల తిమ్మని నేనిదె తోడ్కొనవచ్చెద. ఎలనాగలు మీరిందరు ఏమరకుడి చెలిని' అని చెప్పి సాహసించి దౌత్యము నెరిపి సాధింపదలచినాడు చెలికత్తెలలో పెద్ద చెలికత్తె అయిన కవి అన్నమాచార్యుడు. అవసరమెరిగి ఆ దేవునితో అతడు విన్నవించిన మాటలివి.

"తరుణిపై మరునికి దయలేదు నీవు
మరునినే పోలితివి మరియేటి బ్రతుకు।
ఎదురు చూచి చూచి యింతకె యేమౌనొ
హృదయము ఝల్లనీ నిటు దలచి
పొదలతీగెల యింట పొరలి యేమౌనొ
మదిరాక్షి కొకటైన మరియేటి బ్రతుకు।"

ఆ యమ్మ మునీశ్వరులవలె మౌనము వహించినది. నిరాహారవ్రతమూనినది. ఆకులలములపై బండినది. అరగన్నువెట్టి అశ్రులు కార్చుచున్నది. నిద్దురెరుగక విన్నుగూర్చి తపించుచున్నది. మా ప్రయత్నములు మేము చేసి వేసారితిమి.

"వనిత భాగ్యంబు దేవరచిత్తము – మాకు
బనిగాదు ఇంక నీ పాదంబులాన।
ఆలవట్టము విసరు నతివలను వలదనదు
పాలిండ్లపై కొంగు పచరింపదు
ఏలాగవునొ వేంకటేశ నీవిపుడిట్టె
పాలించకున్న నీపాదంబులాన।"

ఆమె యీ సంసారముపైననేకాదు, తన బ్రతుకుపైకూడ విరక్తురాలైనది. 'ముచ్చట కెవ్వరులేరు మోహమిది బలుదూరు, ఎచ్చట నెవ్వరులేరు, ఏటికే నా పేరు' అని విల విలపడి తన్ను తానే నిందించుకొనుచున్నది. 'పట్టనికనోప నా ప్రాణంబులు, నీ పట్టు

దైవమె యెరుగు బ్రదుకవయ్యా ' అని నిన్ను కూడ నిందించుచున్నది. అట్లని మార లిగెదవేమో !

"తరుణి నీ అలుక కెంతటి దింతి నీ వేళ
కరుణించ గదర వేంకటశైలనాథా !"

సర్వకాల సర్వావస్థలలోను తన్నాభగవంతుని సామీప్యమున, సాహచర్య సపర్యా నిరతునిగా భావించుకొని, అతనితో సఖ్యమునెంచి, అతని అంతరంగిక లీలలెరిగి, అప్పుడై అనుచరించి ఆనందించుట భక్తుడు సాధించునట్టి ఐహిక ముక్తి. ఇట్టి భక్తి పద్ధతినే సఖ్య భక్తి అనియు, సఖీ సంప్రదాయమనియు చెప్పుదురు అన్నమాచార్యునిలో నీ భక్తి సంప్రదాయము వెన్నుదన్ని నిల్చినది. జాగ్రత్ స్వప్న సుషుప్తులన్నిటిలోను అతడు తన్నాభగవంతుని సన్నిధానముననే నిల్పుకొనును. అతడులేనిదే తనులేడు. తన్నువిడిచి ఆతడుండడు. ఏదో ఒక రీతిని, ఏదో ఒక వ్యాజమున, ఏదో ఒక చుట్టరికమున, ఆతనితో తన కెడతెగని సంబంధముండి తీరును. అది నిర్వహించుటయే తత్హితచింత. అదియే అనన్యభక్తి.

భక్తుడైన అన్నమాచార్యుడా వెంకటేశ్వరునికి తన్నాంతరంగిక సఖిగా సమర్పించు కొనెను. అతనితో తన కెరమరికలు లేవు. ఆ జగత్పతి అందరితో పాటు తనకుకూడ తాళిగట్టిన మగడే. 'సిరుల నను గూడితివి శ్రీ వేంకటేశ నీ కరుణకిటు నే నోర్వగలనా' ? అని అతని అపార కరుణాతిశయమున కొకవంక మురిసి పోవుచునే 'కొమ్మను కౌగిట కూడి కొనరు నన్నడిగేపు' క్రమ్మరం దగులు నేను కావలెనా ? 'అని మరొకవంక నాతని దక్షిణ నాయకత్వమెంచి సరస పరిహాస వచనోపచారము నడిపినదీ వెంకటేశుదాసి'. అలమేల్మంగాదేవి సహరహము తన వక్షమున నానించుకొని నిల్చిన ఆ వేంకటేశ్వరు డీమెను వరించి ఒరుగబోయి గల సౌఖ్యమేమి ? అట్లని ఈమె కలమేల్మంగపై ససూయలేదు. అది ఆమె వాల్లభ్యము.

'గరుడాచలాధీశు ఘన వక్షముననుండి
పరమానంద సంభరితవై
నెరతనమ్ములు చూపి నిరంతరమూ నాథుని
హరుషించంగ జేసితిగదమ్మా'

అని ఆ యమ్మ నీమె యెంతేని ప్రశంసించును. కాని తన సంగతి కావంతయు చింతించదు. నాయకుడు తన్నొల్లకున్న నేమి ? తా నాతని ఆలినని చెప్పుకొనగలదు గదా ! అతడు తన దిక్కుచూడకున్న నే మాయె ? దూరమున నిల్చియైన తా నాతని జూచి సంతసించగలదు

గదా! అదే ఆమె నిబ్బరము. కాని పతిహితాచరణలో మాత్రమీ నిబ్బరమీమెకు లేదు. పత్నీవిరహమునకుందు పతి నలమేల్మంగ కెరిగించి, ఆమె కాతనిపట్ల గల ప్రణయ కోపముడిపి, ఎట్లో వారిద్దరి ననునంధించుటలో ఈమె కెంత తత్పరతయో అంత నేర్పు కూడ కలదు. నర్మసఖియై తానా నాయక కింపు నంపాదించి పలికిన పలుకులివి ;

'నిన్నుగూడిన విభుని నిలువెల్ల సొంపాయె
నిన్నియును నొసగూడె నింతలోపలనె
సొలపు నీ కడగంటిచూపు హృదయముగాడి
లలి నతడు శ్రీ వత్సలాంఛనుండాయె
వెలది నిను నెడబాసి విరహంపు మెయికాక
వలన నాతడు నీలవర్ణుడైనాడు.'

అనలానాయకుని యందు తప్పన్నది లేదేలేదు. ఊరక నీవే లేని పోని తప్పులేవో ఎంచి అతనిని సాధింతువు.

'కాంత నీ నెరుల చీకటి భ్రమయగా
చింత చీకట్లు ముంచినది అరుదా'

దీని కింతజేసి నీవు మూతి ముడుచుకొని కూర్చుంటివే కాని, అతడెప్పటి వలె వచ్చి నీ చుట్టు తిరుగుచున్నాడు. మానముడిగి మంకుపట్టు విడిచి మన్నించుము.

'అందముగ నతడు మాటాడగా నతనితో
మంద మందమెకాని మాటాడవు
గొంది సిందాక చెక్కిట చేయి తియ్య విదె
మందలించక వెనుక మరవ మమ్మా'

వాస్తవమున కాతని విడిచి నీవుండనూలేవు. పైపై బింకములేకాని లోనిమెత్తదనము నే వెరుగనిదా? అట నాతడుకూడ నిన్నువినా నిలువలేడు. ఈ పాటి భాగ్యమునకీ పట్టుదలలేల?

'ఎట్టుదొరికెనో చెలువ యిద్దరికి సిటువంటి
పట్టి నిలుపగరాని జరువైన వలపు
నిడివి తమకంబుచే నిట్టూర్పులివె నీకు
అడియాస తమకంబు లాతనికిని
కడలేని వేదనల కన్నీళ్లివే నీకు
అడపు పరితాపంబు లాతనికిని।'

ఇదిగో నేను పోయి వచ్చితివి గదా! అతడేమనెనో వినుము. అతని పరితాపమే విన్న వింతునా? అతడాడిన పల్కులే వినిపింతునా?

'విభుని వినయములు వినవమ్మా, నిను
నభయం బడిగీ నయ్యో తాను।
కింకరుడట నీ కినుక సేతలకు
వేంకటపతి గతి వినవమ్మా
నలికె లేక నీ చనువున జగములు
కొంక కిపుడు చేకొనెనట తాను।'

ముల్లోక విభుడైన విభునితో పంతమేమి? కొరమాలిన యీ విరహతాప మేమి?

'తల్లివలె తానుండి తాప మవుటకంటె
అల్లంత నుండి కీడొటమేలు
వెల్లిగొని నిట్టూర్పు వేడిచల్లెడి కంటె
పల్లదపు చలిగాలి బాధమేలు.'

అవి ఇట్లు చిలుకకు చెప్పినట్లు చెప్పి బోధించి, యొప్పించుటలోనేకాదు, అవసరమైనచో నాయకునివద్దకేగి, నయముననో భయముననో అతనికిగూడ నచ్చచెప్పి, నాయికవద్ద కాతని రప్పింపగల చాతుర్యమీసఖి కెంతేని కలదు. ఇట్లు సఖ్యము నెరపుచునే యీ సతి తన పతి అయిన పరమేశ్వరునికి హితమాచరించగలదు. రసజ్ఞశేఖరుడైన వేంకటరమణునికి విరహార్తురాలయిన నాయికకన్న ఆమె నెచ్చెలి అయిన దూతికయే నచ్చినది కాబోలు. అక్కడ నాయిక 'పొద్దిక వెన్నడు పొడుచునో, పోయిన చెలిరాదాయె' నని నిద్దురెరుగక నిముసమొక యేడుగా గడపుచున్న సమయమున, ఇక్కడ నాయకుడీ దూతిక భక్తికే అనురక్తుడై అమ్ముడువోయెను. 'ఏమి సేయగవచ్చు వేకాలమేత్రోవ, ఆమీది దైవగతులటు గాకపోదు' అను నిశ్చయముతో సఖి ఆతని నర్మోక్తులాలకించినది. 'మచ్చికల మొగసిరి మందులాత, నీ కిచ్చిన దేహమిది ఎట్టయిన జేయరా' అని అతని అభిప్రాయమున కంగీకృతి వెలిబుచ్చినది.

'చెలువంపు నీ చెలిమి చెరకుపండిన పంట
కెలవు నీ అలుక తంగేటి జున్ను
చలివాపు నీ చనవు జాజులు ప్రసాదంబు
కలిగె నీ కరుణ వేంకటవిభుడ నాకు.'

అని ఆతని వెద మెచ్చుకొనుచునే, తన వచ్చినపని మరొక వెపమున నాతని కెరిగించినది. 'చెలిదా మతి నీ చెరగాక, తలవగ నీకిది తగులైపోయె' నని నాయికనుగూర్చి మరొకసారి ప్రస్తావించినది.

'సారెకు నీవెడసిన సైచలేము నీవు
చేరువ నలిగి మమ్ము జేకొనవే
ధీరుడవు తిరువేంకటాధీశ నను
గారవించి ఇట్లనే కరుణించగదరా.'

అని స్త్రీ సహజమైన జాలిమిలేమి నుగ్గడించి ప్రార్థించుచునే జానెతో, నాయిక యూనంతే అను భావము వెల్లడించినది, అంతకునూ బోని నాయకుని అదలించి, ఆగడ ములుడిపి సాధించినది. ఉపాయాంతరము లెన్నేని యెంచి అనుసరించి, ఆ జగదేకవిభుని తెచ్చి తన వెచ్చెలికి కూర్చినది. అది తన కర్తవ్యము. స్నేహధర్మము. వారి సుఖమే తన సుఖమని ఆమె తలపు. అవసరమెరిగి నాయికకు హితమువదేశించుచూ నామె ఉపన్యసించిన శృంగారభక్తి కిట్టి స్నేహవాత్సల్యములే మూలము.

'పలుకుదేనియల నుపారమియ్యవే
అలరు వానసల నీ అధర బింబానకు
పతి వేంకటేశుగూడి వరవశమియ్యవే
హితమైన నీ మంచి హృదయానకు
అతనినే తలచగ నానతియ్యగదవె
తతితోడ నీలోని తలపోతలకును.'

అన్నమాచార్యునిభక్తి కేవలము కవిత్వముతో నాగదు. విశుద్ధకల్పనగా వెలసి మాత్రమే నిలువదు. భావనకు ప్రాణప్రతిష్ఠచేసి, స్వప్నమును సాక్షాత్కార మొనరించు కొని గాని ఆ భక్తునకు తృప్తిలేదు. తిరుపతిలో స్వామికి కల్యాణోత్సవములు జరుపు నాచార మారంభించి, కన్యాదాతయై కంకణము కట్టుకొని తనయూహకు రూపిచ్చి తరించిన భక్తావతంసుడు మన అన్నమయ్య. నేటికిని వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవములలో అన్నమయ్య సంతతివారే కన్యాప్రదాతలుగా వ్యవహరించి మన్ననలందుకొనుచున్నారు.

# -లీలావర్ణనము

పరమేశ్వరుని లీల లనంతములు. శిష్టరక్షణ, దుష్టశిక్షణములే కాదు. భక్త మనోహ్లాదైక లక్ష్యములుగా కూడా అతని లీలలు వెలయుచుండును. ఇట్టి లీలావిలాసము లెంచి భావించి, కీర్తించి, విని, ఆనందించి తరించుటయే భక్తులగు వారి కర్తవ్యము. లీలారసమే వారికి జీవరసము. లీలాబోధయే వేదాంతబోధ అన్నమాచార్యుని పల్కులలో 'వినికి గనవలసినను విష్ణుకీర్తన చెవికి, వినికిచేసినదియే వేదాంతబోధ!' తొల్లింటి భక్తులందరూ ఇట్టి విశ్వాసము కలవారే. పురాణకథలు పునరుక్తముగా చెప్పి తరుగని ఆనంద మనుభవించుటయేకాదు. పుక్కిటి పురాణములల్లి లీలావైవిధ్య మినుమడింప జేసి చూసి ఆనందించుటకూడ వారికి పరిపాటియే. అర్చామూర్తి కవతారమూర్తితోనో, పరబ్రహ్మముతోనో అభేదము కల్పించి, ఎదుటనే అతని సమస్తవిశ్వవిహారములును జరుగుచున్నట్లు భావించి, నమ్మి ఆనందించుట వారి కలవాటు. ఆ లీలలెంత వర్ణించినను వారికి తనివితీరదు. ఎంత వినినను వినుగురాదు. చెప్పినదే చెప్పి, వినినదే పలుమారు వినినను ఆశ్చర్యమున కంతులేదు. ఆనందమునకు మేర లేదు. అనుసిత్యము తన యెదుట సాక్షాత్కరించి నిల్చిన శ్రీవేంకటేశ్వరుని లీల లెంచి అపార హర్షాశ్చర్యావబోధావిముగ్ధుడై అన్నమాచార్యు డెట్లు తనలో తాను వితర్కించుకొనెనో చూడుడు :—

ఎటువంటి భోగి వీ డెటువంటి జాణ
వటపత్రమున నున్నవాడా వీడు ॥

పొదిగొనఁ బూచిన పున్నాగ తరులలో
పొదలు పుష్పాళ్ళపై పూదేనె సోనలు
కదలుచు జడివాన కాలంపు బెద పెద్ద
నదులై పార నున్నతని

కదలని నడిగడ్డ కల్ప భూజంబుల
పదిలమైన నీడ బంగారు చవికలో
కదిసిన జలరాశి కన్నె కౌగిట గూడి
వదల కెప్పుడు నున్న వాడా వీఁడు.

ఇటువంటి మహాత్ముని మహత్త్వంత వర్ణించిన నేమి? కాని ఏది వర్ణించుట? ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడ ముగించుట? పరిపరివిధములైతోచు నా పరాత్పరుని లీలలలో ఏది

గణ్యము? ఏది కాదు? ఆ తిరుమల శ్రీ వేంకటేశ్వరుని కొకపని సరసమా? ఒక కాలము ప్రియమః?

> "గోళ్ళు మీటుచు నుండె కొన్నాళ్ళు, గొల్ల
> వీళ్ళ పాలారగించె వీడు కొన్నాళ్ళు"
>
> కొండ గొడుగుగ బట్టె కొన్నాళ్ళు.- తా
> కొండముచ్చుల నేలె కొన్నాళ్ళు
> కొండల కోనేటివాడై కోరికల తా
> కొండొక చేతలు దొరకొనియె కొన్నాళ్ళు.

ఇట్లు క్షణక్షణపరివర్తనశీలియై చరించు పరమేశ్వరుని స్థిరత్వమెంచి కీర్తించవలెనన్న ఎంతటి సాహసము కావలెను? ఎంత నేర్పు కావలెను? ఇదిగాక, ఏది చెప్పి ఏది చెప్పకపోయినచో ముప్పు వచ్చునో అని కూడా భయమే. కాని అన్నమాచార్యునివంటి స్వీకృతులైన భక్తులకారీతి జంకుగొంకు లుండవు. 'బండి దొక్కె, బాము నెక్కె, బనులెల్లా దక్కె, అండ జిక్కె, గోపికల కందరికి మొక్కె' అని మంచిచెడ్డలు రెంటినీ ఒకేదృష్టితో చూసి ఒకే కొలికికిదెచ్చి వారేకరువు పెట్టగలరు. కాదన్నచో ఆ భగవంతుడు స్వయముగా వచ్చి తన్ను నడివీధి కీడ్చవలదని వారిని బ్రతిమాలవలసినదే.

> హరి నీవు నాకు లంచిమిచ్చేవు, అన్ని మర్మములు చెప్పేదునా
> దొరవంటా మ్రొక్కనీ దాసులతోడ, తుచ్ఛపు నీచేత చెప్పేదునా
>
> అల్ల నాడు నీవు మైలన్న చొక్కయ, నంబుకొన్న నుద్ది చెప్పేదునా
> గొల్లెతలవాడ చీకటిని తప్పు, కోరి చేసినది చెప్పేదునా
> వెల్లి విరిసి రేవల్లెలోపలి, వెన్న ముచ్చిములు చెప్పేదునా
> తల్లిబిడ్డ నొక్కవావిగ జేసిన, ధర్మపుతగవులు చెప్పేదునా.

ఏది చెప్పిననూ వారిదృష్టి కది ఒప్పిదమైనదే. ఆయా లీలలట వర్తించినప్పుడు తా మాచోట వర్తించి, ప్రత్యక్షముగా చూచి, భాగము వహించి ఆనందించినట్లే భక్తులు విశ్వసింతురు. శాశ్వతుడైన జీవుడా పరమేశ్వరుని శేషమే కనుక అతడున్నచోటవెల్ల తానున్నవాడే. కాని ఐహికబంధమున కట్టుపడియుండుటచేత జీవుని కాయా పూర్వస్మృతులు గోచరించవు. తా నాయా సమయములలో నెట్లు వర్తించెనో తెలియకపోవుటచే

> "అయ్యయ్యో ఏమరివా నాడప్పుడేమై యుంటినో
> అయ్యెడ నీదాసినైతె నాదరింతునా.

అల్లనాడు బాలుడవై ఆవుల గాచువేళ
చిల్లర దూడవైతే జేరి కాతువుగా
వల్లిగా విటుడవై వ్రేపల్లెలో నుండేనాడు
గొల్లెతవైనా నన్ను కూడుకొందువుగా.

అని అన్నమాచార్యులు గడచినదానికై విచారించును. అయాలీలలెంచి యెంచి, తన్మయుడై యేరూపముననో ఆ పరమాత్ముని సాన్నిధ్య మనుభవించి, తదనుగుణమైన సేవాపరంపరలో నిమగ్నుడై తిరిగి ఆనందించును. ఒకప్పుడతనికి వేంకటేశ్వరుడు ఒడిలో దోగినట్లు దోచును. సరి. తా నాతని తల్లియై తత్త దవస్థోచితములైన యూడిగము లెంచవలసినదే కదా? అదే యీ తత్పరత.

ఉగ్గువెట్టరే వో యమ్మా చె-య్యొగ్గీ నిదె శిశువో యమ్మా.
కడుపులోని లోకమ్ములు గదలీ - నొడలూచకురే వోయమ్మా.
తొడికెడి నరగున దొలగదీయరే - ఉడికెడి పాలివి వోయమ్మా.

తొయ్యలు లిట చేతుల నలగించక - పుయ్యెల నిడరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని - నొయ్యన తిట్టకు రోయమ్మా.

ఒకప్పుడీ బాలుడు కృష్ణుడనిపించును. సరి. తా నతనితల్లి యశోదయై, అతని దుడుకుతనము లుగ్గడింప వచ్చిన గొల్లెతలకు బదులిచ్చు పద్ధతిచూడుడు —

కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని

మూసిన కాగుల వేయి ముంగిట పెరుగులూ
ఆసపడకుందురా ఆడే బిడ్డలు
ఓసరించి మోనపోక వుండలేక మీరు
సేసే రింతేసి దూరు చెప్పరాని బిడ్డని.

శ్రీకృష్ణుని లీల లెంత వర్ణించినమా అన్నమాచార్యునికి తనివి తీరదు. ఒకప్పుడు బాలక్రీడలెంచును. వేరొకప్పుడు జలక్రీడ లెంచును. ఇప్పుడు వెన్న ముచ్చిములు చెప్పును. మరొకప్పుడు రాధామాధవ రతి చరిత ముగ్గడించును. ఒకసారి గొల్లపడుచులతో శ్రీకృష్ణుని సయ్యాటలెంచి వర్ణించును. ఇంకొకసారి చెంచెతలతో వేంకటకృష్ణుని విలానవిహారము లెంచి ఆలపించును. ఒకపరి తానే గొల్లెతలలో గొల్లెతయై ఏ ఉద్ధవుని యూరడింపులో విని, వినలేక విసిగి, ఇట్లు పలుకును.

ఒద్దేల మొక్కేవు ఉద్ధవుడా తన, ఉద్దండాలే చెల్లె నుద్ధవుడా
ఊరూర వలపు లుద్ధవుడా నే, మోరుతుమా యిక నుద్ధవుడా
ఊరడించ వచ్చేవు ఉద్ధవుడా తన, ఊరట చెలుము లుద్ధవుడా

ఒప్పులర మా ఉరిసిన పుం, ద్దువ్వులు వెట్టించె నుద్ధవుడా
చెప్పకు మమ్మిక చెలువు డాతడే, ఒప్పియుంటే చాలు నుద్ధవుడా

శ్రీకృష్ణచరిత్రముతో బాటు శ్రీరామ చరిత్రము కూడ అన్నమాచార్యుని కవితలో నడప తడవ నెలకొన్న విషయమే. తిరుమలలో శ్రీ కృష్ణవిగ్రహ మొకటియు శ్రీరాముని విగ్రహ మొకటియు ఏనాటినుండియో వెలసి నిల్చినవి. కృష్ణాష్టమి, రామనవమి వంటి పర్వదినములలో వేంకటేశ్వరపరముగా నాదేవతలకును, వారి మూలమున వేంకటేశ్వరునికిని విశేషోత్సవములు జరుపు నాచారము కూడ కలదు. ఇదే కారణముననో యేమో అన్నమాచార్యుడా యా అవసరములలో విశేషస్ఫూర్తిగొని లీలాగాన మొనర్పసాగెను. నృసింహావతార కథనము కూడ అతనికిట్టే మిక్కిలి ప్రియమైన విషయము. అహోబిల మఠములో కొన్నాళ్ళుండి అలవరచుకొన్న భక్తితాత్పర్యములే యీ నృసింహస్తుతులకు మూలము. ఆళ్వారుల నుండి పరంపరగా గ్రహించినది వామన స్తోత్రము. అవతార కథనము కూడ తత్తుల్యమే. కాని ఇన్నిటిలోనూ అన్నమాచార్యుని స్వకీయముద్ర గోచరించును. ఆ యా మూర్తులందరూ వేంకటేశ్వరమూర్తిగానే అతని యెదుట నవతరించెదరు. అతడు తనకు నచ్చిన ధోరణిలోనే వారివారి చరిత్రలుగ్గడించి ఆనందించును. ఆ పరమేశ్వరునిలో భాసించిన విరోధాభాసములెంచి ఒకవంక సాశ్చర్యముగా చూచుచునే వేరొక వంక సావహానవ్యాజముగా నతనిని స్తుతించును.

ఎవ్వరో కాని యెరుగరాదు కడు
దవ్వులనే యుండు తలపులో నుండు,

మిగుల బొట్టివాడు మింటికిం బొడవు
జగడాలు తపసివేసములును
మగువకై పోరాడు మరి విరక్తుండును
తగు గాపుబనులు నెంతయు దెల్లదనము.

వేంకటేశ్వరుని అర్చామూర్తికొనరించు సేవలన్నియు అన్నమాచార్యుని కా దేవుని విశ్వలీలావిలాసములుగనే కన్పించును. పవళింపు సేవ మొదలు బ్రహ్మోత్సవపు తిరువీధి వరకు గల సమస్త సేవలను అతని బ్రహ్మాండ లీలావిహారములుగనే ఇతడు వర్ణించును

తిరుమల స్థలపురాణములోను, వేంకటేశ్వర మాహాత్మ్యములోను వర్ణించిన గాథలెన్నియో అన్నమాచార్యుని కవితకుజ్జీవమిచ్చినవి ఆ యా ప్రసంగములెంచి, తన్మయుడై ఆతడా లీలామూర్తిని వర్ణించుచుండును.

కొండలలో నెలకొన్న కోనేటిరాయిడు వీడు
కొండలంత వరములు గుప్పెడువాడు

అచ్చపు వేడుకతోడ నవంతాళు వారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక తిరుమలనంబి తోడుత
నిచ్చ నిచ్చ మాటలాడి నొచ్చినవాడు.

---

## ప్రసంగమాధురి

భగవత్కథానుసంధాన మనునది భక్తికి ముఖ్యలక్షణము. ఆ పరాత్పరుని అనంతకల్యాణ గుణములనేమి, అతని నిత్యనూతనలీలా విలాసములనేమి, ఎన్నిమారు లెడ తెగక ఎంచి వర్ణించి చెప్పినను వినినను భక్తునికి తనివితీరదు. ఉన్నకథలకు తోడు లేనివి ఊహించియైన చెప్పుకొని విని అతడానందించు చుండును. మరల మరల అపే ప్రసంగము లెంచి స్మరించి తన్మయుడగుచుండును. ఇది యే ధ్రువానుస్మృతి. దీనివలన భక్తి ధారకు నైరంతర్యమునునది సిద్ధించును. , నాడుగాని ప్రాపంచిక వ్యామోహముల నుండి విముక్తిలేదు. ఈ రహస్యమెరిగిన భక్తుడగుటచేతనే అన్నమాచార్యుడా వేంకటేశ్వరుని దివ్య లీలల నెన్నెన్ని విధములుగానో స్మరించి, సాక్షాత్కరింప జేసికొని, తరించి నాడు. ప్రాకృత ప్రపంచమును విడిచి అన్నమార్యుడా వేంకటేశ్వరునే తన మోహమునకు గురిజేసికొనెను. అతని వాల్లభ్య మపేక్షించి తన జన్మచరితార్థముచేసుకొనెను. 'కొండలలో నెలకొన్న కోనేటిరాయడా, ఎందు వుండినా, నా మనసులో నుండి పాయ లేవురా' అని నిబ్బరముగా చెప్పగలిగినంత మమత్వ మా దేవునిపై గడించి ధన్యుడయ్యెను. ఈ 'మనసులో నుండి పాయలేక పోవుట' యే, ఆ దేవునిచే నీ భక్తునికొరకై ఎన్నెన్నిలీలా విలాసములో నెరపి చూపింపజేసినది. అవియే నిత్యనూతన ప్రసంగములై అన్నమయ్య కవిత కలంకారములైనవి.

అన్నమాచార్యుని భక్తికాలంబనము శ్రీ వేంకటేశ్వరుని అర్చామూర్తి. అతని కంటి కా అర్చామూర్తిలోనే ఆ దేవుని పరవ్యూహ విభవాంతర్యామ్యర్చా రూపములన్నియు గోచరించును. ఇది కారణముగా స్వామికి జరుగు నిత్యోత్సవ, సమయసేవా, సాధారణ కైంకర్యము లన్నియు ఆ భక్తకవి కసాధారణ లీలావిలాస మాధురులుగానే రూపించును. తన్ను తానుమరచి, ఆడి పాడి, అతడా లీలామృత మాస్వాదించి ఆనందించుచుండును. ఆ ఆనంద రసావస్థలో అతడెన్నెన్ని దివ్యప్రసంగములో సాక్షాత్కరింజేసికొని గానము చేయుచుండును. కళ్యాణోత్సవములో నర్చింపబడు స్వామి ఉత్సవ విగ్రహమేమి, అతని దేవేరుల విగ్రహములేమి, అన్నమాచార్యుని కంటికి సజీవరూపములుగానే గోచరించును. వారి విలాసములెన్నియో అతని హృద్వీథి నవతరించును. అవి పూసగుచ్చి అతడు వర్ణించును.

పిడికిట తల బాల పెండ్లికూతురు కొంత
పెడ మరలి నవ్వీనె పెండ్లికూతురు।
పేము కల జవరాలె పెండ్లికూతురు పెద్ద
పేరుల ముత్యాలమెడ పెండ్లికూతురు
పేరంటాండ్ల నడిమి పెండ్లికూతురు విభుని
పేరు కుచ్చ సిగ్గువడీ పెండ్లికూతురు।

అన్నమాచార్యుని లోగల యీ దృష్టివిశేష మెరిగినగాని అతని కవిత నర్థము జేసికొనుట పొసగదు. ఇది తెలిసి నపుడాతని శృంగార కవితలో నున్న మర్మ మామూలాగ్రముగా బోధపడును. వేంకటేశ్వరుని ఉత్సవ విగ్రహమెప్పుడును భూరమాదేవుల విగ్రహముల నిర్వంకల నుంచుకొనియే సాక్షాత్కరించును. మాధుర్యభక్తి కలవడిన అన్నమాచార్యుడు తన్ను తానాదేవునికి దాసినని, ప్రియనని, పత్నినని భావించుకొనిన వాడగుటచేత, ఆ దేవుని కాంతలతో తనకు సాపత్న్య మూహించుకొనును. ఆయనకు మ్రొక్కి, వారికి మ్రొక్కుటకే ఏదోస్వాభిమానము నటించును. ఊడిగమెంచి బెట్టుచేయును.

పొందెరుగుదు నందువు భోగినందువు నీ
అందరు సతులకు వే నాకు మడిచిత్తునా।
ఎవ్వతెకైనా జన విచ్చేవు మెచ్చేవు నీ
నవ్వులకైనాను మన్నన జూచేవు
అవ్వలి ఇవ్వలి నీ అంగనలవద్దను
పవ్వళించి వుండగా పాదము లొత్తుదునా।

అని ఆ దేవునితో వాదించును. ఆ స్వామి జగదేకవల్లభుడు. దక్షిణ నాయకుడు. ఎంత రెందరినో నతుల వాతడు సర్దుకొని రాగల చతురుడు. కాని చనవిచ్చి, స్వాధీన పతిత్వము గడించిన చెలి యగుటవలన ఈ భక్తకవి ఆ పరమేశ్వరుని శృంగారచాపల్య మెంచి అడప తడప విమర్శించుచుండును.

'కడలేని మోహంబు గలవానివలె నా
కడి తాను చీర నీవు కాసె వోసి
వడిగా నేగెదవు ఎవ్వతె కియ్యవలెనో నన్ను
నడిబెట్టి యింతసేయ వలెనా ఓరి।'

అనియో. ఏకతాన సొలసి వే నేమి నీతో బల్కిన
ఆకెతోనే విన్నవించే వావగతేక।

అనిగాని ఉండలేక చేతనున్న వుంగరమిచ్చిన బోయి
వెండియు నాకెకేయిచ్చి విర్రవీగేవు।

అని గాని ఆ దేవుని నిలదీసి నిందించును. ఇది వ్యాజనింద. ఆ వ్యాపారమాతనికి సహజము. తన కతడు దక్క వేరుగతిలేని మాట వాస్తవము. అందుచే నెంతగా నెన్ని పల్కిననూ చివరకు,

నేరములెన్నగ వేను నిజములు పలికిన
వైరములే అవుగాక వలపౌనటే
ఈరుదీయ పేమవచ్చి నికేల మాటలు నీ
వారము మమ్మిక దడవకుమయ్య విభుడా।

అని మరుమాట పెరుగనీయక 'వలవ నేరుతుగాని, వాదించలేనురా. మెలగి నీ వెట్టుండినా మెచ్చుకుంతలేనురా' అని అతనితో రాజీ చేసికొనును.

ఇట్టి ప్రసంగము లన్నమార్యుని కవితలో నడుగడుగునా కనిపించును. ఆ సాయంత మా దేవుని సన్నిధానములోనే నిల్చి, ఆతని సేవావిధులలోనే నిమగ్నుడైయుండు భక్తు డగుటచేత ఎప్పటి కప్పుడా దేవుని విగ్రహములో ఏదో ఒకక్రొత్త వింత, ఒక క్రొత్త చెలువు, ఒక క్రొత్త విలాసము తాను సాక్షాత్కరింప జేసికొనుచుండును. తోడనే అతని హృద్వీథి నొక క్రొత్తయూహ పల్లవించి సరస ప్రసంగమొకటి ఫలించుచుండును. శ్రీ వేంకటేశ్వరుని అర్చామూర్తి కంఠమున అలమేల్మంగాదేవి రూపము చిత్రించియున్న పదకముతో నొక సువర్ణహారమున్నది. అది చూచి తద్వ్యాజమున నాపె వైభవమెంతగా నితడూహించి, ఆ స్వామికి నివేదించెనో చూడుడు.

పరగు నీ మెడ నరపణుల యుయ్యాలలో
ఉరుటు మురిపమున నూగుచును
గిరికొన్న తమకాన కింద మీాదెయగక
మరచెమే నలమేల్మంగనాంచారి ।

మరొకవ్యృదీయూహ మరొక రీతిగా వికసించును. ఆ జగదేక దంపతుల అన్యోన్య మవ్యృదాకవిని తన్మయు నొనర్చును చనవు చాతుర్యములు మెరయ నితడా దాంపత్య మభివర్ణించిగాని నిద్రపోడు. స్వామి ఆయమ్మ నెత్తుకొని నేలదింపనంత ప్రీతితో ఆమె నేలుకొనుచున్నాడట! ఆమెకాళ్లుపట్టి ఏమో అనునయించుచున్నాడట! అదేమి మన్ననయో, అదెంత వాల్లభ్యమో. అది వారికే చెల్లినదట!

ముత్తేల పెండెమిది ముదితది ఆ
గుత్తపు పాదమునకు కొలదైవది
బిత్తరపు ముంజేతనే పెట్టితివి యీ
మత్తగజగమనపై మన్నన నీ కెట్టిదో ।

అని ఆ స్వామి నీ భక్తుడు ప్రశంసించుము. విరిసెజ్జపై పవళింపు సేవలందు కొనుచున్న స్వామిని, తత్పాదప్రదేశమున పతిపాదసేవాపరాయణురాలై దీపించు దేవిని చూచి నవ్యృదన్నమాచార్యుని కెన్నెన్నియూహలో తట్టినవి. ఆమె సుకుమార హస్తము లాస్వామి పాదములొత్తుచున్నవి. ఆమె చేతిప్రేళ్లనున్న రత్నాల బటువుంగరము లాతని పాదధూళిలో మెలగుచున్నవి. మరల నే అహల్యవంటి వారో పదిమంది పడతులుదయించి దేవితో సవతి కయ్యములకు కాలు దువ్వుదురని అనుమానించినాడు కాబోలు. అతి సన్నిహితుడై దేవికీ భక్తుడెట్టి సలహా నిచ్చినాడో చూడుడు :

రంగుమీరిన మంచి రత్నాలు దాచిన నీ
వుంగరాలచేత పాదమొత్తకువమ్మా
అంగన పుట్టెను పాదమంటి శిలను తొల్లి
కంగి నీకు బ్రతి మొన గడియించు జుమ్మీ ।

———

## — రూ ప మా ధు రి

భగవంతుని సౌందర్య మెంతవర్ణించినను ఏది తృప్తి? ఆళ్వారులనాటినుండి యీనాటివరకు ఎందరెందరో ఆ శ్రీవేంకటేశ్వరుని దివ్య సుందర విగ్రహమును వర్ణించిరి. అన్నమాచార్యుడుకూడ తనివితీరునట్లుగా ఆ పరంధాముని శోభావిలాసమాధుర్యము లెంచి వర్ణించి తనిసినాడు. ఆళ్వారుల వర్ణనలకంటె అన్నమాచార్యుని వర్ణనలు కొంత భిన్న మైనవిగా కనుపించును. వారి నాటికిని ఇతని నాటికిని ఈ క్షేత్రములోవచ్చిన మార్పులే దీనికి కారణము. ఆళ్వారుల నాటికీ క్షేత్రము దుర్గమారణ్యభూయిష్ఠము. కొండపై స్వామి కాలయప్రతిష్ఠయినా జరిగెనో లేదో తెలియదు. అది కారణముగా వారి వర్ణనలలో ఇచ్చటి ప్రకృతిశోభ కెక్కువ తావు లభించినది. సాయుధ వరదాభయహస్త ముద్రాంకితుడై నిల్చిన స్వామితోపాటు శ్రీపర్వతము, దానిపైగల వెదురుపొదలు, సెలయేటికాల్వలు, ఏనుగు గున్నలు, కోతిమూకలు, చెంచు దంపతులు, భక్తబృందములు వారివర్ణనలలో రూపుకట్టినవి. కాని అన్నమాచార్యుని నాటికీ పరిస్థితులు మారినవి. పర్వతము జనాకీర్ణమైనది. దేవళము సువర్ణమయమైనది, స్వామికి నిత్యకల్యాణము పచ్చతోరణముగా ఎన్నెన్ని యీడిగ ముతో లభించుచున్నవి. భక్తులైనయాత్రికులతో ఎగువదిగువ తిరుపతులు రెండును కిటకిటలాడ జొచ్చినవి. అట్టి భక్తులలో ఒకడుగావచ్చి యాత్రచేసికొనిన సందర్భములో సాశ్చర్యహర్ష పులకిత గాత్రుడై అన్నమాచార్యుడీ క్షేత్రవైభవమును తొలుదొల్తగా వర్ణించెను.

మహనీయ ఘనఫణామణుల శైలముగంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి
రహివహించిన గోపురములు గంటి॥
పరమ యోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపు జూడగంటి॥

వైభవోపేతమైన స్వామి విగ్రహమును అన్నమాచార్య డెన్నెన్ని విధములుగానో వర్ణించెను. ఒకొక్క సేవలో ఒకొక్క విధమైన శోభలొలుకబోయుచున్న ఆస్వామి రూపురేఖా విలాసము లెంచవలెనన్న భౌతికపు టెల్లలు దాటి ఆధ్యాత్మికపు టంచులవరకు దృష్టి

ప్రసారింపగల ఆ భక్తుడే వర్ణించి చెప్పవలెను. సర్వాలంకార శోభితమైన స్వామి విగ్రహ మాతని కెట్లు కనిపించెనో చూడుడు.

సందడి సొమ్ములతోడి సాకారమిదె వీడె
ఇందరు వర్ణించరే యీ రూపము ।
చుక్కలతో నాకాశము నూటైనిలువబోలు
నిక్కిన రత్నాలజలధి నీటుగాబోలు
మిక్కిలి నానావర్ణమేఘపంక్తి కాబోలు
ఇక్కడనే నిలుచున్న దీ రూపము ।
పున్నమయు నమాసయు పోగై నిలువబోలు
ఉన్నతి యోగీంద్రుల యూహ గాబోలు
వన్నిన బ్రహ్మాండాల భరణిది గాబోలు
ఇన్నిట శ్రీవేంకటేశు యీ రూపము ।

స్వామి కాయా సేవలు జరుగుచున్నపుడన్నమాచార్యుని కంటికాతని దివ్య సుందర విగ్రహము 'ఒకపరి కొకపరి కొయ్యారమై మొకమునఁగళలెల్ల మొలచినట్లుండి' కనిపించును. ఒకొక్క సేవావిభవ మొక్కొక లీలావిలాసముగా అతనికి తోచును. ఊయెలలోనున్న స్వామి బ్రహ్మాండడోలికలో నూగుచున్నట్లు రూపించును. తిరువీధిలో పాల్గొను యాత్రికులలో శివౌకనులుకూడ కన్పింతురు. అశ్వవాహనారూఢుడైన స్వామి దేవళముచుట్టి తిరిగి వచ్చుటకుకాదు, అధర్మ మణచి ధర్మమును గెలిపించుటకే బయలువెడలినట్లు పొడగట్టును.

నీవు తురగముమీద నేర్పుమెరయ
వేవేలు రూపములు వెదజల్లితపుడు ।
పదిలముగ నిరువంక పసిడిపింజల యంప
పొదుల తరకసము లొరపులు నెరవగ
గదయు శంఖంబు చక్రము ధనుఃఖడ్గములు
పదివేలు సూర్యబింబములైన వపుడు ।
కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌగిట నిన్ను దొడికిపట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెల్వుమని
మెరుగు కుచకుంభముల మిసిమితో నపుడు ।

వేంకటేశ్వరుని మూర్తిలో అన్నమాచార్యులు చూచినది శృంగార రసాధి నాథుడైన జగన్నాథునిమూర్తి. 'అతడేపోచెలియా మాయాతడు, చేతనే పరముచూపీ చెలువైన యాతడు' అని ఆ పరమాత్ముని రూపలావణ్యవిలాస విభ్రమము లెంతగానో యీ భక్తుడు వర్ణించును.

మలయు జెక్కులనవ్వు మకరకుండలముల
అలర నిగ్గులె చల్లే యాతడు
బలువైన ముత్యాలపదకాల హారాల
వెలుగొందెనదె చూడవే మాయాతడు ।

ఈస్వామి నెల్లు దర్శించునో ఈతని దేవేరి అలమేల్మంగాదేవినిగూడ అన్నమాచార్యుడట్లే ఒకానొక అలౌకికపు వాతావరణములో నిల్పి దర్శించును. ఆమె శ్రీవేంకటేశ్వరుని శృంగారనాయిక. 'అతివ జవ్వనము రాయలకు పెట్టనికోట. అతడు జొచ్చినవేళ నలరు నీయడవి, సతినీదు మురిపెంపు జవ్వనపుటడవి' అని నెచ్చెలియై కవి ఆమెతో పల్కుచుండును. ఆమె సహజసుందరి. ఆమెకు మేని తొడవులుగాని మైపూతలుగాని బరువుచేటు.

అద్దముచూచేవేలె అప్పటప్పటికిని
అద్దమునీ మోముకంటె నపురూపమా
ఒద్దిక తామరవిరి నొత్తేవు కన్నులు నీ
గద్దరికన్నులకంటె కమలములు ఘనమా ।

అని అలంకార ప్రీతిగల నెచ్చెలి నీకవి వారించును. సహజ సౌందర్యమునకు తోడు స్వాభావిక విలాసములే ఆమెలో గూడుకట్టుకొని నిల్చినవట. దానికా వేంకటేశ్వరు డమ్ముడువడితీరునని ఆతని విశ్వాసము. 'కలలు కాకలబెట్ట కనునన్నలవెతిట్ట చలపట్టినీకుజెల్లె జాణదే యతడు' అని వారొకరి కొకరీడు తీయరనికూడ అతడు చెప్పును. ఆయన అనుకూలించిననాడు తనసఖి ధన్యయైనదని యెంచి తాను హర్షించును.

లలిత లావణ్యవిలాసముతోడ
వెలత ధన్యతగల్గె వేటితోడ ।
కులుకు కబరీభరము కుంతలంబులతోడ
తొలగదోయని ప్రేమతోడ
మొలకనవ్వులు దొలకు ముద్దుజూపులతోడ
పులకలు పొడమైన పొలుపుతోడ ।

అన్నమాచార్యు డున్నరూపుకంటె ఆ వున్నదాని ప్రభావమెట్లున్నదో దానికి హేతు ప్రత్యయములేవో ఎంచి వర్ణించును. సౌందర్యగర్వమునకుతోడు స్వామి వాల్లభ్యము గడించితినన్న గర్వముకూడ కలిగిన సఖి నఖులతోనే మాటాడుట మానినదట.

చక్కదనములచేత జవ్వనభారముచేత
ఎక్కుడౌటా గానదిక నేమిసేతమే।
కమ్మనితావులతోడ కన్నుల నవ్వులతోడ
చిమ్ము జెమటలతోడ జెలువొంది
కొమ్మకువేడుగలిగె కోనేటిరాయని పొందు
నెమ్మనమున దాచనేరదేమిసేతమే,।

అని చెలికత్తెలలో చెలికత్తెయై ఈకవి వినవినలాడును. అన్నమయ్యకు స్థితచిత్ర ములకన్న గతిచిత్రములు దిద్దుటలో ప్రీతిమెండు. అభిసారిక, నాట్యసుందరి, మానిని, కలహాంతరిత మున్నగు నాయికల అంగభంగిమ లీతడెంతేని నేర్పుతో చిత్రించును. ఆ జగదేకదంపతుల నయ్యాట లాతడెట్లు చిత్రించెనో చూడుడు.

పొక్కిడి చెలి బన్నీటిపాట్లానదాకవేసి,
తక్కరినవ్వులతోడ తలవంచేవు
గక్కన వేడతివ వేంకటరాయ నినుగూడి
వెక్కనపుమరపుతో వెరగందినదివో।

---

# —— సంసారనిరసన

అన్నమాచార్యుడిద్దరాండ్రను గట్టుకొన్న సంసారి. కాని భగవద్గుణానుభవము నందు సతత సంతతానురాగి. అది కారణముగా అతని కీ సంసారమునందు విరక్తి సహజ మైనది. తామరాకుపై నిల్చిన నీటిచుక్కవలె అతడీసంసారము సాగించుచునే సంగరహితు డనిపించుకొనినాడు. తనకున్న నివృత్తి పరాయణత్వమంతయు నా భగవంతుని సేవా కైంకర్యములలో ప్రవృత్తిభరము గావించుకొని తరించినాడు. అతని జీవితమంతయు నిట్టి సాధనతోనే గడిచినది. ఈ తపస్సు ఫలించినగాని జన్మధన్యము గాదనియూ నాడుగాని విజ్ఞానమొదవదనియూ, అదిలేక భక్తి కంతరాయరాహిత్య మబ్బదనియూ, అతడాదిలోనే గ్రహించి విశ్వసించెను.

మనుజుడై ఫలమేది మరి జ్ఞానియౌదాక
తనువెత్తి ఫలమేది దయగలుగుదాక
ధనికుడై ఫలమేది ధర్మము సేయుదాక
పనిమాలి ముదిసితే పాసెనాభవము?

అని భవమెట్లు పాయునో అట్టియిన త్రోవ బోవలెనన్నదే అతడు నమ్మిన మతము. అదే అతడౌరులకిచ్చిన ఉపదేశము. సంసారసాగరమున మునిగి దరిజేరలేక అల్లాడు జీవులందరి కిని ఆ యాచార్యుడెలుగెత్తి చాటిచెప్పిన సన్మార్గమే అది. 'ఇంటివేలుపు వేంకటేశు గొలువక పరుల వెంటదిరుగుట ఓడవిడిచి వదరెడుట' అని చెప్పి. 'భగవంతుని వజ్జ జనుడు. ప్రకృతికి లోబడకుడు. కామినీకాంచనములపై మక్కువ విడువుడు' అని మరల మరల నా ఆచార్యుడు హెచ్చరించును.

కాని యీ హెచ్చరిక ఎంతవరకుపయోగించును? ఎందరిది వినినవెంటనే ఆచరణకు దెచ్చుకొనగలరు? అనలీవికారముల కాది కారణమేది? అందుకు తోడైన ఇతర విషయము లేవి? ఏదిముందు? ఏదివెనుక? ఏదిపోయిన మిగిలినవి పోవును? ఇత్యాది తర్క వితర్క ములెన్నియో అతడే ముందూహించి, చర్చించి, సమాధానమెరిగించును. 'పాలుమాలి ఇంద్రియాల బారి బడ్డ పుట్టువిది, అలరి వైరాగ్యసుఖ మందబోయీనా?' అని తానే ప్రశ్నించును, 'పాయపుమతిలో బలుపగువాసలు, కాయము భువిలో గలదాకా' అని వెంటనే నిశ్చయించును. మరుక్షణమే 'తన కర్మవశంబించుక దైవకృతం బొకయించుక, మనసు వికారంబించుక మానదు ప్రాణులకు' అని నిర్ణయించి చెప్పును.

'ఈ దైన్యము లీ హైన్యము లీ చిత్తవికారంబులు
ఈ దురవస్థలు గతులును నీ లంపటములు
ఈ దాహము లీ అనుబంధంబులు మరి
ఈ దేహము గలకాలము నెడయవు ప్రాణులకు।'

అందువలన నీ బాధలొకనాడు తెగి పటాపంచలై పోవలసినవికావు. అవి మనతో పాటు నిలువవలసినవే. కనుక బుద్ధిచెప్పిననూ విని వీనిని తొలగించుకొను ప్రయత్నమే మంత మీద మీద లేదు.

ఖారమైన వేపమాను పాలువోసి పెంచినాను
తీరని చేదేకాని తియ్య నుండీనా।

పాయదీసి కుక్కతోక బద్దలువెట్టి బిగిసి
చాయకెంత గట్టినాను చక్కనుండీనా
కాయపు వికారమిది కలకాలము చెప్పినా
పోయిన పోకలే కాక బుద్ధి వినీనా।

కాని యీ వికారములేవియు కలకాలముండవలసినవికావు. తన వెనుక రావలసినవి కావు. అయినను జీవుడివియే సర్వమని భావించును. ఈ సంబంధమువే సత్యమని భ్రమించును. మిగిలిన వెన్నియైన సద్బోధలు విస్మరించునుగాని తన చుట్టునున్న సంసారమును విస్మరించడు. అందుకు తగినంతగానే ఆ సంసారముకూడ జీవుని వ్యామోహపరచు చుండును. కనుకనే,

'హేయమేమీలేదు జగమంతారుచికరమే
మాయావికారమిది మనసెట్లురోసును
కాయధారణమింపు కాంతల భోగములింపు
ఆయతమై వారి వారి ఆహారాలింపు
సోయగపు కన్నులను చూచెడి వేడుకలింపు
చాయమన సొడబడి నమ్మతించి చేయ।

అని అన్నమాచార్యులీవ్యామోహగుణ మభివర్ణించుచునే దానికి మూలమీమనస్సే అనికూడ నిర్ధరించి చెప్పెను. అది ఇంద్రియములలో మేటియై, తనతోపాటు తక్కిన వాటినికూడ చేర్చుకొని ప్రకృతికి వశమగును. సరి, అంతటితో వివేకమడుగంటి, విజ్ఞానము కొల్లబోయి, వైరాగ్య ముడివోయి సాత్వికము చల్లబడును. కామక్రోధములు చెలరేగును. లోభమోహ మదమాత్సర్యము లొకటి కొకటి లంకెలై క్రమ్ముకొనును. తిరిగి ఎప్పటికథయే.

'వినుచున్నారము వెనుకటిపాట్లు
కనుచున్నారము కలిగెటివారల
దినదినభావము తెలిసీ తెలియదు
మనసున భయ మినుమంతయులేదు।'

ఇదియేమాయ, 'తలలేదు తోకలేదు దైవమా నీ మాయలకు, తెలిసియు తెలియక తిరిగేము వేము' అని యీ హరిమాయ సరసి అన్నమయ్య ఎప్పటికప్పుడే ఆశ్చర్యపడు చుండును. దీనిని గడచుట కేదిమార్గమని ప్రశ్నించుచుండును. 'ఏది తుద దీని కేదిమొదలు, పాదుకొని హరిమాయ బరగు జీవునికి' అని విస్తుపోవుచుండును.

'ఎందును బోరా దీ సంసారము
కందువ నీ మాయ గడవగ వశమా।
కలిమే చిత్త వికారహేతువది
అలరలేమి దైన్యహేతువు
పలులంపటములు బంధ హేతువులు
తలగిన నడవదు తను పోషణము।
మదవికారమిదె మహిత యౌవనము
తుదవార్ధకమే దురంతము
ఇదె అర్థార్జన యాతాయాతన
అదియు మానితే ఆకలి ఘనము।

అని అన్నమాచార్యుడాభగవంతునితోనే, దీనిలోగల విషమ సమస్యలన్నియు నేకరుపుపెట్టి చెప్పి, దీని గడచు నుపాయమేదో ఎరిగింపుమని అతనినే వేడుకొనును. 'చెదరక వెలుగే చేనుమేయగజొచ్చె, అదలించి తగదు నీ కనువారు వేరీ' అని ఆ అన్యాయమేదో అతనినే నవరింపుమనును. మా ప్రయత్నములు వ్యర్థము. మాకున్న శక్తి నున్న. మే మాసించిన దెల్ల నిరాశ. అర్థించినదెల్ల కల్ల. అనలీజీవునికి తన్నైనవారెవరు? అయినవారెల్ల తగులమై తగిలెడివారే కాని తారకులగుదురా? 'పండియు బండదు చిత్తము పరిభవమెడయదు కాంక్షల ఎండల కాగితి మికనేలా చాలు' నని అన్నమయ్య ఆ యీశ్వరునియందే భారమంతయు వైచి తా నతనికి శరణాగతుడై నిశ్చింతుడగును. ఇదే ఆచార్యుడై అతడితరుల కుపదేశించును. అప్పటికినీ వినని సంసారుల కందు రోతపుట్టించుటకు ప్రయత్నించును.

'తటతటన నీటి మీదట నాల జాలంబు
లిటు నటు జరించవా యీది యీది
అటు వలెనెపో, తమక మంది సంసారంబు
ఘటనకై తిరిగితిమి కడగానలేక'

కనుక ఇప్పటికైన నీ వ్యామోహము విడిచి పరమాత్మ ననునంధించుడని చెప్పును. 'ఒడలితో నిట్లనే ఉండేమా, కాక చెడని పుణ్యములెల్ల జేసేమా?' చాలు నింతటితోనైన నీ అభిమానము విడిచి హరిని సేవించుడని బోధించును.

'ములిగి భారపుమోవు మోచేటివాడు
అలసి దించుకొను నా డాడను
అలరు సంసారికి నదియు లేదాయె
తొలగని భారమెందును దించలేదు।

అని ఇందున్న సత్యమెరిగించును. అది ప్రియమో, అప్రియమో ఏదట కానిండు. నూటికి నూరుపాళ్లు సత్యము. సంసారియై, సాధకుడై, భక్తుడై, ఆచార్యుడై, స్వానుభవ జ్ఞానమేదో అది చాటిచెప్పి లోకుల నుద్ధరింపజూచిన మహాత్ముడన్నమయ్య. మహాత్ములకు లోక కల్యాణమునందు గురి. భాగవతులకు పామరుల నుద్ధరించుట యందాసక్తి. కవులకు స్వాత్మానందముతోపాటు లోకహితాపాదకమైన సందేశమిచ్చుటయందు ప్రీతి. ఆ యీ గుణములన్నియు అన్నమాచార్యునిలో జమకూడినవి. అది కారణముగా అతని కీర్తనలలో నొకవంక సంసారవిరక్తి కెంకె ఉపదేశముండునో, వేరొకవంక భగవదనురక్తి కంతకు మరింత హెచ్చుగా ప్రబోధముండును. ఏ కీర్తన చూసినను చివరి చరణమున భక్త్యుద్బోధమే గోచరించును. ముందెన్ని ఎంతవర్ణించి చెప్పినను చివరకా వేంకటేశ్వరుడే సర్వమునకు దిక్కని ధ్వనించును. ఈ క్రింది సంసారవర్ణన మొక్కటి చూచినచో చాలు. ఈ విషయము స్పష్టమగును.

సడిబెట్టె కటకటా సంసారము — చూడ
జడధిలోపల యీత సంసారము ।
జము నోరిలో బ్రదుకు సంసారము — చూడ
చమురుదీసిన దివ్వె సంసారము
సమయించుఁ బెనుదెవులు సంసారము — చూడ
సమరంబులో నునికి సంసారము ।
సందిగట్టినతాడు సంసారము — చూడ
సంది కంతలత్రోవ సంసారము
చందురుని జీవనము సంసారము — చూడ
చంద మేవలెనుండు సంసారము ।
చలువలోపలివేడి సంసారము — చూడ
జలపూఁత బంగారు సంసారము
ఇలలోనఁ దిరువేంకటేశ నీ దాసులకు
చలువలకుఁ గడుఁజలువ సంసారము ।

———

# —వైరాగ్యబోధ

సంసారమునుండి విరక్తి కల్గిననాడుగాని భగవంతునిపై భక్తి కుదుటపడదు. అది లేని నాడు ముక్తి పూజ్యము. అందుకని ఆచార్యులేమి ఆళ్వారులేమి విరక్తి మార్గ మువదేశించి, తద్ద్వారా భగవదనురక్తి కచంచలత్వము సాధించుకొండని చెప్పిరి. కొందరీ పట్ల సన్యాసముకూడ నుపదేశించిరి. కాని అన్నమాచార్యుని పద్ధతి అదికాదు. భగవదను రక్తికి వలసినంతగానే అతడు సంసార విరక్తుడు. సంసారమందున్న లోభమోహాదుల నా భగవంతునిపైకి మరలించుకొని, వలచినా, వరించినా, ఆ వేంకటేశ్వరుడేకాని, తదన్యము వలదని బోధించుట అన్నమయ్య పద్ధతి. ఆ మాట నెత్తికెక్కించి, ఒంట బట్టించుట కెన్నెన్ని చెప్పవలెనో, ఏది ఎట్లు చెప్పవలెనో, ఎవరి కేది పథ్యమో ఎరిగి చెప్ప గల నేర్పు ఆచార్యునిలో కలదు. అసలు జీవునితత్వమాత డెరిగినట్లెవ్వరు ఎరుగరు, 'ఎవ్వ రెవ్వరివాడో యీ జీవుడు చూడ నెవ్వరికి నేమౌనో యీ జీవుడు.' ఆ సంగతి గమనించక శాశ్వతమైన పరతత్త్వమెరిగి బాగుపడుటకు బదులు ప్రకృతికి వశుడై 'గద్దరి జీవుడు కామధేనువుమాని ఎద్దు బిదుకజొచ్చిన' చో నికనేదిగతి. ఒకసారి ఆ ప్రకృతికి లొంగినాడాసరి. ఇక నా జీవునిగతి అధోగతియే. అందులోగల 'మాయలకగపడి మతిచెడి ప్రాణులు, రోయగ దలచియు రోయగలేరు. 'ఊబిలో దిగబడిన ఎనుబోతుచందమై, దిగిన కొలదీ తరచైన మోహపంకమున కాతడెరయగును. అందేది నమ్మినసూ హితము లేదు.

ఏమిగలదిందు వెంతకాలంబైన
పామరపుభోగమావదవంటిదరయ
కొండవంటిది యాన, గోడవంటిది తగులు
బెండువంటిదిలోని పెద్దతనము
పుండువంటిదిమేను పోలించినను మేడి
పండువంటిది సరసభావమింతయును.

ప్రాకృతిక వ్యామోహమునకెరయైన జీవుని సద్గుణములన్నియు నన్యథా ఉపచ రించును. ఒకసారి మోహవశుడయ్యెనాసరి, ఒకటి కొకటిగా లంకెలై అతని సద్గుణము లణగారిపోయి, పాతర గోతిలో బడినవానిపై పైనున్న మన్నుపడి కప్పిపెట్టునట్లు చెట్టగుణము లెన్నో పెల్లుబికి అతనిని మరింత అణగార్చును.

ఎడమ పురివెట్టి పరహిత వివేకము, లోన
గుడుసువడె చదువు మెరుగులువారె చలము।
బయలు పందిరివెట్టి పనిలేని లంపటము
దయవిడువ దొడగె చిత్తములోని కాంక్ష
వయికొన్న మోహంబు పడనిపాట్ల బరచె
లయమాయెశాంతి మెల్లనె తీరె నెరుక।

అని అన్నమాచార్యుడే తన జీవుని గూర్చి తాను వర్ణించుకొన్నప్పుడు ఇతరుల మాటవేరే చెప్పవలయునా.

దీనికంతకు మూలము దురహంకారము. వలవని మమకారము. ఇవి విడిచి గాని జీవుడీ ప్రకృతిమాయను జయించలేడు. తన బ్రదుకేదో బాగున్నదని, తనకున్న భావములేవో అమృతకల్పములని, తనవారు తన్నైనవారే అని నమ్మి జీవుడీమాయావాగురమున చిక్కుకొనును. కాని యీ బ్రదుకు చాల విచిత్రమైనది.

ఎంత సేసినా ఎడయకేపోయ
ముంతలోని నీట మునిగిలేచుట
ఉట్టిపై చెరలాట, మూర బొత్తులకూడు
పట్టుచాలని కొమ్మ, బహునాయకమ్ము
వెట్టిమోపరిలాగు, వెర్రివోయినపోక
నట్టింటవైరంబు, నగుబాటు బ్రదుకు

దీనిని నమ్మి, తానేదో ఘనుడననుకొని 'మోనమున మాయావిమోహితుండయి పోయి కానుచేయని పనికి గాపివడి' యీ జీవుడు తపించుచుండును.

దురితంబులకువెల్ల తొడవు మమకారంబు
లరిది మమతలకు తొడ వడియాసలు
గురుతైన యాసలకు గోరికలు జీవనము
పరగనిన్నిటికి లంపటమెకారణము.

ఆలంపటము తెచ్చిపెట్టుకొన్నదే కాదు. కొంతవరకు పూర్వకృతము. మరొకరీతిగా చెప్పినచో ఆ భగవత్కృతము. ఎవరి కర్మ వారనుభవించవలసినదే, కాని ఆ కర్మకు కూడ జీవుడు కర్తగాడు. అదికూడ ఈశ్వరాధీనమే. ఆ సంగతి తెలియక తానే కర్తనమకొనుట జీవుని తప్పిదము. ఆ తప్పు మరికొన్నిటికి దోహదము. అందుకే,

ఏమిసేయగవచ్చు నీశ్వరాధీనంబు
తామసపుబుద్ధి కంతలు దూరవలసె।
తెగిదురాపేక్షబడి తివియ గతిలేదు
పగగొన్న పగల కూపముల బడవలసె
తగుమోహనలిలంబు దాట మతిలేదు, గన
మగుడబడి భవముతో మల్లాడవలసె।

అని అన్నమాచార్యుడు 'రేపులే పుట్టువులు, మాపులే మరణాలు' గాగల యీ సంసార చక్రమునెరిగి విస్తుపోవును. 'తనవారని ఆపద దగిలి భ్రమయనేల, తనువు ప్రాణుని కంటె తగులేది' అని యీ లంపటమును గూర్చి వితర్కించును.

చేయరో మనుజులు చింత హరినికవైన
రోయరోమీ భుజియించు రుచులమీద
కాయమస్థిరము యీ కలి మద్రువము చాల
బోయబో ఎందుకుగాక పోయ కాలము।

అని చేయెత్తి ఘోషించి తరణోపాయ ముపదేశించును.

భోగ సహాయులే పొరుగెల్లా
ఆగమ విధులు ననంతములు।
కులమున జుట్టాలు కోటానకోట్లు
కలిమిలేముల కొక్కడవే గురి
వలులంపటముల ప్రజలే ఇందరు
నిలచినచోటికి నేనొక్కడనె।

అను సత్యమివ్వడైన తెలుసికొండని యెలుగెత్తి యీ ఆచార్యుడు చాటును. కాని ప్రమత్తులైన జీవులకిది వినిపించునా?

"కడివూని జవ్వనము కలిమిలేమెరుగునా
బడినుండి మిగుల ఋణపరచుగాక
అడియానలెల్ల బుణ్యము పాపమెరుగునా
వెడగు దనలో దయ విడిపించుగాక।"

అట్లే యీ నదువదేశములుకూడ చెవికెక్కవు. సత్యాసత్యపరిజ్ఞానము కాని హితాహిత వివేకముకాని మమతగ్రమ్మి మాయలోబడి, భ్రమించిన వారికెట్లు కలుగును? కనుకనే.

' అమీద నిజసుఖమరయలేము
పామరవు మాయలకె భ్రమసితిమయ్యా ।
మనమున బొల్పుద్రాగి మదియించివున్నట్లు
ననిచి గిలిగింతలకు నవ్వినట్లు
ఎనసి సంసారసుఖ మిది నిజము సేసుక
తనివొంది యిందులోనె తడబడేమయ్యా ।"

అని అన్నమాచార్యుడీ భవరోగములకెల్ల వెజ్జయిన ఆ భగవంతునితోనే యీ విషయ ముగ్గడించి చెప్పను.

"ఇదివో సంసారమెంత సుఖమోకాని
తుదలేనిదుఃఖమను తొడవు గడియించె ।
పంచేంద్రియంబులను పాతకులను దెచ్చి
కొంచెపు సుఖంబునకు గూర్పగాను
మించి కామంబనెడి మేటి తనయందు జని
యించి దురితధనమెల్లగడియించె ।"

అందువలన యీ ప్రకృతినిమాని ఆ పరమేశ్వరు నెరిగి భజించుట శ్రేయస్కరము.

" వెరగుతో మరచితే వెనుకలేదు
కరివరదుడే తక్క గతియొండులేదు ।"

# — మానసబోధ

వైరాగ్యసాధనకు వలసిన ప్రధానగుణము మనశ్చాంచల్య మరికట్టుకొనుట, ఇంద్రియములన్నియు చపలములే. వానిలో మానసేంద్రియ మన్నిటికన్న మిన్న. దానిని వశము చేసికొనిగాని మిగిలిన ఇంద్రియముల లొంగదీసికొనుట కుదరదు. అట్లొకవరి కనులు మూసికొనియో, చేతులు కట్టుకొనియో గూర్చుండినను, మనస్సు యా విషయముల స్మరించి, నివృత్తిమార్గమున కంతరాయములు కలిగించుచునే యుండును. ఇది కారణముగా ఆచార్యులెల్లరు మనస్సును జయింపుమనియూ, చిత్తస్థైర్యమలవరచుకొనుమనియు బోధించుచుందురు. భక్తులైన సాధకులుకూడ అడప తడప మనశ్చాంచల్యమునకు గురియై, పట్టుదప్పి, పతనభీతిచే నల్లాడి, ఆమనసునే పరి పరి విధముల సంబోధించి వేడి వేసరుచుందురు. అన్నమాచార్యునిలోకూడ మనకీ తత్త్వము గోచరించును. అతడు సంసారముతోనున్న పరానురక్తుడు. మనస్సు సంసారముపై మరలును· అనురక్తి ఆధ్యాత్మమునకై అంగలించును ప్రాకృతిక వ్యామోహ మొకవంక భగవదనురాగ మొకవంకయై ఆ భక్తుడీ రెండిటిమధ్యమ లాగులువడి, యూగిసలాడి, స్థిరత్వమెంచి, చిత్తశాంతి నాసించి ఎన్నెన్నివిధములుగనో తన మనస్సును తాను బోధించుకొనును. దాని తత్త్వమరసి విస్తుపోవును. దానిని వశము చేసుకొనుటకుమారు తానే దానికి వశుడనైతినని పరితపించును. తుదకాపరమేశ్వరునితోనే ఆపాట్లు కూడ పూసగ్రుచ్చి వర్ణించి చెప్పును.

ఇన్నిటికి నోపునా యీ మనసు నన్ను
మన్నించి నీ మనసు మరిగించు మనసు ॥
పాలతుల కాకనే పుటమెక్కె మనసు
చలివేడి జవ్వనము సందిజిక్కె మనసు
వలరాజు తూపు నంజు వడివెక్కె మనసు
మలగి రతి సుఖాల మరపాయ మనసు ॥
పచ్చని కనకముపై భ్రమబడె మనసు
చిచ్చు వంటి విషయాల శివమెత్తె మనసు
ఒచ్చపు బాపాలకెల్లా నొడిగట్టె మనసు
బచ్చన చంచలముల బాటిచెడె మనసు ॥

అనలీ ప్రకృతి నిత్యనూతనము. క్షణ క్షణ వినూత్న లలితలావణ్య గుణాకరము. ఆకర్షణ దాని సహజశక్తి. కనుకనే ఎంతగా బోధించి ఎన్నిచెప్పి ఎట్లుమరల్చినను మనస్సు ప్రకృతివంకకే మరలుచుండును. ఇదికూడ ఆ హరి మాయయే.

కట కట హరిమాయాకల్ప వెట్టిదో
తటకున బారవేసే తలపెందు లేదు ।
అనంతకోటి యుగాలనుండియు
తనివోక విషయాలఁ దగిలుండినా
దినమొక్క రుచియై తీపులు వడిగాని
వెనుకొన్న ఆత్మకు వెగటిందు లేదు ।

కాని ఇది నిస్సారము. సారవంతమైనది భగవదనుభవము. అది విడిచి ఇది మరిగినవారికి సంసారచక్రమున పరిభ్రమించుటయే ఫలము. ఈ భ్రమలు దూరమై, జీవుడు భవదూరుడగుటయే పరమార్థమైనచో అతడు తన మనస్సు నరికట్టుకొనవలెను. ప్రాపంచికభ్రమలు వీడవలెను. ఈ సత్యమెరిగినవాడగుటచేతనే అన్నమాచార్యుడు తన మనస్సు నిట్లాశ్వాసించుకొన్నాడు.

నటనలభ్రమయకు నా మనసా
ఘటియించు హరియే కలవాడు ।
ముంచిన జగమిది మోహినీగజము
పొంచిన యాస పుట్టించే దిది
వంచనలు నిజమువలెనే యుండును
మంచులు మాయలే మరునాడు ।

ఇంతగా బోధించి, ఆశచూపి, ఆశ్వాసించినను మనస్సు తన అవివేకము మాను కొనదు. అప్పటి కంతయూ వల్లె అనిపించును. పరమార్థబోధ వినినంతసేపు హాయిగా నుండును. కాని మరుసటిక్షణమే అజ్ఞాన మల్లుకొనును. తిరిగి ఎప్పటిగతియే. యధా ప్రకారమే. అన్నమాచార్యునివంటి పరమభక్తుడే యీ విషయమున నెంతయో నొచ్చి ఇట్లు పరితపించినాడు.

మానదు మతిమరపును తెలవియు
యే నింక దైవమ యేమిచేయుదును ।
సకల పురాణాలు శాస్త్రాలు విని విని

ఒకవేళ సుజ్ఞాన మొదవును
వికటమై యంతలో విషయ సుఖముగని
అకట క్రమ్మర బుద్ధి నివియే కతలు ।
పలుదుఃఖముల బాధబడువారి బొడగని
పలికి నంసారముపై రోసును
నెలువంక సిరులలో నటియించువారి గని
తలచి యానలవెంట దగులు నంతటను ।

ఆశకంతములేదు. అట్లని అది తటాలున తెగుతెంపులై వీడుటయు లేదు. ఎరిగి ఎరిగి, తెలిసి తెలిసి, ఎప్పటి కవ్వదేదో ఒక క్రొత్తదాని కాసించి, అది అందక, అట మటించుట యీ జీవుని అజ్ఞత. ఆశఫలించునను తలపుతో నతడాచరించు కార్యము లాతనిని మరింతగా అడియానలపాలుజేసి, ఆచార విచారములుడిపి, హైన్యగతికి దింపి, అతని పూర్వపుణ్య సంచయమునే బుగ్గిచేసి విడుచుమండును. అయినను ఆశాపిశాచమునే యీ జీవుడాశ్రయించును. దాని యాజ్ఞకు బద్ధుడై అతడాచరించని అకార్యము లేదు. కనుకనే,

వరగి నాలుకసొంపు పరనిపోయె
పరులనే నుతియించి పలుమారును
విరసపు బాపముల వినికిచే వీనులెల్లా
గొరమాలె మాకు నేటి కులాచారము ।
మొక్కలాన పరధనమునకుజాచి చాచి
ఎక్కువచేతుల మహిమ మెందోపోయె
తక్కక పరస్త్రీల దలచి మనములొద్ది
ముక్కపోయె మాకు నేటి ముందటి పుణ్యాలు ।

అని అన్నమాచార్యుడు ఆశాప్రేరితములై సర్వేంద్రియములును మనల నధోగతి కీడ్చెడివే అని ఘోషించినాడు. ఈ ఆశ నా భగవంతునిపైకి మరల్చుకొన్నచో ఇవే ఇంద్రియములు, మన కాముష్మిక మరచేతికి దెచ్చి యియ్యగలవు. కాని మనస్సావనికి నచ్చదు. నచ్చి నమా కర్మ మొకవంక మనలనీ ఐహికమునకే మరల్చుచుండును. సాధకులైన భక్తులెల్లరు ఈవిషమనమన్యవెదుర్కొనినవారే. అన్నమయ్యకూడ దీని కెదిరి అటమటించినవాడే. అందుకే స్వానుభవ జ్ఞానముతో నతడిట్లుపల్కి నిట్టూర్చినాడు.

ఏలొకొ కర్మమా యిందుకు బాలైతివి
పాలుపడిన యీ జలభ్రమణము వలెను ।
ధరలో బుట్టినప్పుడే తలచ నీయాత్మ
మరువదు పరమైతే మరచీగాని
అరిది దుర్భాషల నలవడ్డ నాలికె
హరినామములయందు నలవడదు ।
జవకట్టి పూర్వ వాసనల సంసారమే
చవియౌతాగాని ముక్తి చవిగాదు
భువిగల విషయాల బుంగుడయ్యీగాని మతి
వివరించి దైవమును వెదకలేదు.

అన్నమాచార్యుని రచనలో నీరీతి సత్యాసత్య వివేకచర్చయెంతయో కనుపించును. అతడొకపరి తటస్థుడుగానిల్చి ప్రపంచమును విమర్శించును. వేరొక పరి జీవుని అజ్ఞతకు చింతించును. ఇంకొకపరి గొంతెత్తి పామరుల నుద్బోధించి భక్తిమార్గ ముపదేశించును. మరొకప్పుడు ప్రాలుమాలిన తన మనోబుద్ధులనే పరామర్శించి తనకు తానే వివేకముపదేశించుకొనును. ఎంత చెప్పినను వినని తన మనస్సునుజూచి ఇదికూడ దైవికమే అని నిశ్చయించుకొనును.

జీవు డెంతటివాడు చిత్త మెంతటిది
దైవికము గడవ నెంతటివాడు దాను ।
విడిచిపోవనియాస విజ్ఞానవాసనల
గడచి మున్నాడె నెక్కడివివేకములు
ఉడుగనియ్యని మోహముచ్చి పరమార్థముల
మెడవట్టినూకె నేమిటికింక నెరుక ।

అట్లని ఆతడలసుడై ఊరుకొనడు. "తిరువేంకటాచలాధిపుని మన్ననగాని వెరసి యిన్నిటి గెలువ వెరవు మరిలేదు" అని మరింతగా కృతనిశ్చయుడై ఆ దేవుని శరణువేడుకొనును. అందులకైన అంతరాయములేవో ఎరిగి తొలగించుకొనును. అవి తొలగనిచో తానై వాటికి దూరముగా తొలగ నెంచును. "దైవమొక్కడే సతతభజనీయుడు" మిగిలిన వన్నియు నిష్ఫలము. కనుక "ఎప్పుడును శ్రీవేంకటేశ్వరుని సేవించు, చపలచిత్తమువారి సంగమిక వలదు" అని తన మనస్సు నెచ్చరించును.

## — విజ్ఞానచర్చ

ఐహికతాపత్రయమున నవయుచున్న జీవుల కాముష్మికసాధనోపాయమెరిగించి, తాము తరించి, ఇతరులను తరింపజేసిన ఆచార్యులందరివలెనే అన్నమాచార్యుడుకూత తానెరిగి, ఆచరించి, అనుభవమునకు దెచ్చుకొన్న విజ్ఞానమార్గమేదో అది ఇతరుల కుప దేశించి తరించెను. అన్నమాచార్యుడు త్రికరణశుద్ధిగా ఆ వేంకటేశ్వరుని నమ్మి తరించిన భక్తుడు. అది కారణముగా అతడు బోధించినదెల్ల ఆ వేంకటేశ్వరభక్తియే ఏకైక లక్ష్య ముగా వెలసిన విజ్ఞానమయ మయినది. "కలది యీ మూర్తివల్ల గతిగనవలెను. ఇల నిందు నమ్మకుంటె ఎందు మరిలేదు'' అని ఆతని సునిశ్చయము. శ్రీ వేంకటేశ్వరుడే పరాత్పరుడు. అతడే అన్నిటికి మూలము. ఆతని కరుణకు మించి అశించవలసినదిం కొకటిలేదు. ఆతనిని శరణంటిమా అరచేతిలో మోక్షము. 'ఆయమెరిగితే ఆయుష్యము కరవా? మ్రొక్కనేర్చితే మోక్షములేదా?' అని అన్నమయ్య తన దేవుని మహా మహిమాతిశయ, కారుణ్యగుణవిశేష, పరమ పారమ్య వైశిష్ట్యము లన్నియు కంఠోక్తిగా నెరిగించును.

ఇంతదేవుడింక వేడీ, ఎంచి చూపుడా
చెంత నుండితే రక్షించు చేకొని కొలవరో।
వేసితే వేయిరూపుల విశ్వరూపమితడు
శ్రీసతీశు డిందరిలో శ్రీమంతుడు
భాసురపు భూమిమోచే బలవంతు డిన్నిటాను
దానులైతే మన్నించు నీ దైవము గొలువరో।
గుట్టున బ్రహ్మాండాలు కుక్షిలో నించినవాడు
అట్టే దేవతల మొరలాలించేవాడు
చిట్టకపు దానవుల చించి చెండాడేటివాడు
ఇట్టే శరణంటే గాచు నితని గొలువరో।
కాలము కర్మము మాయ గల్పించినయట్టివాడు
ఆలించి సర్వజీవుల అంతర్యామి
వాలి శ్రీ వేంకటపతై వరములిచ్చేటివాడు
యేలీల గొల్చిన మెచ్చు నీవిభు గొలువరో।

వేంకటేశ్వరుడు లక్ష్మీనాథుడు. భక్తపరాధీనుడు. చరాచరమేలినమేటి. ఆపద్బాంధవుడు. అవాథరక్షకుడు. అన్నిటికినికర్త. అతని గొలిచి మనుటకన్న మనకైన విధి మరియొకటిలేదు. 'పరము నిహము పంటపండినయట్లు ఇరవుగా దానే ఎదుటనున్న' ఆ దేవుని శరణువేడితిమా మనము తరించితిమి. లేదా అతని మాయకు జిక్కితిమి. ఈ మాత్రమెరిగితిమా చాలు. ఇదియే విజ్ఞానము. ఇదే ఎరుక.

చిక్కువడ్డ పనికి చేసినదే చేత
లెక్కలేని అప్పునకు లేమే కలిమి।
ఎదురులేమికిఁ దనకేదైవ తలపది
మదమత్తునకు తన మరుపే మాట
తుదిపదమునకుఁ జేదోడైన విభవము
పదిలపు వేంకటపతియే ఎరుక।

ఎరుక అనునరికి మనకెన్నియో సంశయములు. ఎన్నెన్నియో సందేహములు. ఏదిమార్గమో అది చెప్పగానే విని నడిచి తుదిజేరుట మనకు సరిపోని పద్ధతి. అది జీవలక్షణము. దాని నెరిగిన వారగుటచేతనే ఆముష్మికమెరిగింప దలచిన ఆచార్యులందరు అటు జీవస్వరూపముతో నారంభించి, ఇటు మోక్ష స్వరూపమువరకుగల సకల విషయములను సాకల్యముగా చర్చించి, సాధ్యమిది సాధనమిది యని నిష్కర్షచేసి నిశ్చయించి చెప్పుదురు. అన్నమయ్యకూడ అదేపద్ధతి ననుసరించి చెప్పవలసినదేదో అది సశాస్త్రీయముగా, సహేతుకముగా చెప్పివినిపించును. అతడనుభవమున్నజ్ఞాని. వశీకృత భగవంతుడైన భక్తుడు. తనకున్న సందేహములేవో ఆ పరమేశ్వరునితోనే చర్చించి, నిజమేదో తెల్సుకొని, అది అనుసంధించి, తరించిన ధన్యుడు కనుకనే,

"ఇదివో సుజ్ఞానము 'సూత్రే మణిగణా ఇవ' గాన
మది నితరమేలేదు మాయల యద్భావం తద్భవతి।"

అని అతడు చూచినట్లు చెప్పగల్గినాడు. దాని నా దేవునికే నివేదించి ఔననిపించుకొన్నాడు.

"ఎదుటగల యీ జగము యిది నీవన వెరతును
అది విపరీతజ్ఞానము యద్దృష్టం తన్నష్టముగాన
పొదలుచుండేటి యీ జగము పొనగ నీవు గావన వెరతు
అది విపరీతజ్ఞానము సద నచ్చాహం బంటివిగాన।"

ప్రకృతి నశ్వరమనుట అనుభవములోని విషయము. కాని చరాచర ప్రకృతి అంతయు నాపరమేశ్వరుడే అనుట గీతావాక్యము. ఏది నమ్ముట? ఏది కాదనుట?

" నిండిన యీ జీవులు మీరు గారన వెరతును
దండనే బదులు విరుద్వానువర్ణ యున్నది గాన
మెండగు యీ జీవులు మీరుగారన వెరతును
ఉండెకి వీరలు నిత్యులె యొగి నహదిశ్చ మామధ్యముగాన ॥ "

జీవుడెవరు? నిత్యుడా? అనిత్యుడా? దేవునితో నితనికి గల సంబంధమెట్టిది? ఈరీతి ప్రశ్నల కెందరెన్నివిధముల సమాధానమిచ్చినను సంతృప్తి నున్న. ఎప్పటికప్పు డేదో యొక సందేహము తలయెత్తుచునే యుండును. కాని ఔను కాదనుటకు వీలులేని సత్యమొకటి అనుభవములో నున్నది.

" ఇది మునుపే నీచిక్కు ఇందు ద్రుష్టం బొక్కటే
తుదదొల్లే నీ దానులుగలరు తుదదొల్లే నీవు గలవు
వెదకుమా శ్రీవేంకటపతి నిను సేవించగ సేవించగను
అదన నిన్నంటిన వారల నీ యంతలు సేతువుగాన ॥ "

" మహాజనో యేన గతః స పంథా ' అనునట్లు తొల్లింటి భక్తులేది నమ్మి చరించిరో అది నమ్మి చరించి తరించుట ఉత్తమోత్తమ మయిన మార్గము. అనవసరమయిన తర్క వితర్కములకు దిగి ఔను కాదులతో పెనగులాడి అలసట బడుటకంటె అన్నిటికి ఆ వేంక టేశ్వరుడే కలడని అచంచల విశ్వాసముతో నతని గొల్చుటయే అనువైన ఉపాయము 'భారకుడతడే బంధువు డతడే చేరితి మతనినే చంచలమేలా?' అని సునిశ్చయమైన మనసుతో నతని సేవించుట నయము. 'ఇదియే వేదాంత మింతకంటెలేదు. ఇదియే శ్రీవేంకటేశుమతము' దీనికాలన్యముకూడ పనికిరాదు. 'ఎప్పుడేబుద్ధిపుట్టునో ఎరుగరాదు దెప్పరపు మాబుద్ధి దేవునికే సెలవు' అని ఎరిగి త్వరపడి ఆదేవుని శరణు వేడుటమేలు

జీవమతి సూక్ష్మము చిత్తము చంచలము
భావము నిరాకారము భవమెల్ల నెయ్యము
ఏవిధుల బొరలెనో యిది నా బ్రదుకు
దేవుడ నీచిత్తము నాతేకువైన భాగ్యము ॥

అని ఆదేవుని కరుణ కటాక్షమే తన భాగ్యమని నమ్మి లోకమున విరతి, అతని సేవలో నిరతి కలిగి వర్ణించుట బ్రదుకుతెరువు.

ఈ సంగతి యెరుగక, యెరిగిననూ నమ్మక ఏదేదో భావించి యేమేమో తర్కించి, యీ జీవుడనవసరముగా 'తాను జేసినది కొంత దైవముజేసినది కొంత' గా సంసార తాపత్రయమునబడి మ్రగ్గుచుండును. అది అతని అజ్ఞత. ఆ అజ్ఞత నెరిగించుచో చాలు నదియే విజ్ఞత. ఉన్న వేదాంతములేమి, ఊహించిన తత్త్వములేమి అన్నియు నీ సత్యమునే చాటి చెప్పును. మూడు మాటలలో చెప్పవలెనన్న చెప్పి వినిపించదగిన యీ సత్యమున కింత రాద్ధాంత సిద్ధాంతము లెందుకు?

మూడేమాటలు మూడుమూళ్ళు తొమ్మిది
వేడుకొని చదువరో వేదాంతరహస్యము।
జీవస్వరూపము చింతించి అంతటాను
దేవుని వైభవము తెలిసి యెరిగి
భావించి ప్రకృతిసంపద యిది యెరుగుటే
వేవేలు విధముల వేదాంతరహస్యము।
తనలోని జ్ఞానము తప్పకుండా తలపోసి
పనితోడ సందువల్ల భక్తినిలిపి
మనికిగా వైరాగ్యము మరువ కుండుటే
వినవలసిన యట్టి వేదాంతరహస్యము।
వేడుకతో నాచార్య విశ్వాసముగలిగి
జాడల శరణాగతి సాధనముతో
కూడి శ్రీ వేంకటేశ్వరుగొలిచి దాసుడౌటే
వీడని బ్రహ్మానంద వేదాంతరహస్యము।

అని. అతిసూక్ష్మముగా అన్నమయ్య శరణాగతియే వేదాంతరహస్యమనియు, అది తెలిసి ఆచరించుటకన్న విజ్ఞత యింకొకటి లేదనియు చాటి చెప్పుటయే కాదు, చేసి చూపి ఆచార్యత్వముతోపాటు ఆదర్శపురుషలక్షణమునుకూడ తనలో వెలుగజేసుకొన్నాడు. 'ఇందుకు పరహితము లిన్నియు నజ్ఞాన' మని అతనితో పాటాదేవుని శరణందుట ముముక్షువులకేకైక కర్తవ్యము

మాధవ భూధర మదనజనక
సాధురక్షణ చతుర శరణు శరణు।

దేవదేవోత్తమ దివ్యావతార నిజ, భావభావనాతీత పద్మనాభ!
శ్రీ వేంకటాచలశృంగారమూర్తి నవ, సావయవసారూప్య శరణు శరణు।

———

# - సంకీర్తనతత్త్వము

తనకైన దంతయు నా సర్వేశ్వరునిదే అనినమ్మి త్రికరణశుద్ధిగా శరణాగతుడై మనుట ముముక్షువున కనువైన లక్షణము "ప్రజామిశరణం వరద తవాహం" అని ప్రపన్నుడై మనుట ఇహపరసాధనము. అన్నమాచార్యుడిదే ఒరులకుపదేశించి, అను క్షణము తానసుసరించి ఆచరించి తరించిన మోక్షోపాయము. ప్రపన్నత ఒక్కటి కుదిరినటా చాలు, మిగిలిన వాటితో నిమిత్తములేదు. కాని అది కుదుటబడుటకు వలసిన వన్ని మరిన్ని యున్నవి. భూతదయ, సత్యవాక్పరిపాలనము, భావశుద్ధి, సమబుద్ధి, చిత్తనైర్మల్యము, భాగవతకైంకర్యము, భగవన్నామచింతనము వంటివెన్నో అలవడిననాడు గాని ఆ ప్రపన్నత అలవడదు. అలవడినను నిలువదు. పైవన్నియు ఒకొక్కటి ఒకొక్క జన్మకు సరిపడు నంతగా ప్రయత్నించి సాధించిన గాని సిద్ధింపవు. అందువలన వీటన్నిటిని సాధించి అర చేతికి తెచ్చి యీయగల ఉపాయమింకొకటి కావలయును. అదే పరమరహస్యము. ఆ రహస్యమే సంకీర్తనము.

" అంతరంగమున దానుహరిదలచినజాలు
అంతటి మీదపనులాతడే యెరుగు
పంతమున నాతనిపై భారమువేసినచాలు
వింత ఉద్యోగములు గోవిందుడే యెరుగు ।"

అనుక్షణము ఆ హరినిదలచి, అన్నిటికి తడేకలడను నమ్మిక అలవరచుకొనినచో చాలు సమస్త దురితసంతానములును పటాపంచలై చిత్తశాంతి కుదురును.

" దురితములెల్ల దీరు దుఃఖములెల్లనణగు
హరియని ఒకమాటు అనినా జాలు
సురలు పూజింతురు సిరులెల్లజేరును
మరుగురుని నామమటు పేరుకొన్నజాలు ।"

దీనికి సంశయించ నక్కరలేదు. ఆదినుండి నేటివరకుగల పురాణేతిహాసము లన్నియు దీనియందలి సత్యమునే చాటిచెప్పి సాక్ష్యమిచ్చుచున్నవి.

"ఇందుకు ధ్రువాదు లిటుసాక్షి
చెంది నమ్మవో జీవుడనీవు
కొండల వంటి ఘోరపాపములు
ఖండించును హరిఘననామము
నిండించును మతి నిత్యానందము
పండించునపుడె పరమపదంబు।"

చదివినవారు, చదువనివారు, జ్ఞానులు, అజ్ఞానులు, స్త్రీ బాలవృద్ధులు, పతితులు, పరమయోగులు కూడ హరినామస్మరణమే అండగా నీ సంసారవార్ధి తరించి గట్టెక్కిరి. హరినామ మాశ్రయించియే అధికులైరి. హరిసంకీర్తనముననే అందరాని వైభవములంది శాశ్వతులైరి.

"తలప వేదశాస్త్రములను గానక
అలరుచు వాల్మీకాదులు
తలకొని హరిమంత్రమె దగబేర్కొని
అలవిమీద గరుననధికులైయెరి।"

ఆ యీరీతికథలెన్నో మనమెరిగినవి, విన్నవి, కన్నవి కలవు. కాని హరిస్మరణ మాత్రమే మనసున కంటనిది. అదికూడ ఆ భగవత్కృపలేక కుదురదు. అతని కరుణ కలిగి, అంతరంగపరిశుద్ధియై, అరనిముషమాయె హరిస్మరణచేయ గలిగితిమా అనంత నిధులబ్బినట్లు.

"తలపునకు విష్ణుచింతన నిముషమాత్రంబు
కలుగుటే యొకరీతి కలుగవలెగాక
వలనైన భోగములు వైభవంబులు మరియు
కలవెల్ల దమయెదుట గలిగినివె కావా।"

దీనికేదియుపాయము. వేదాంతములు వినుట, ధర్మశాస్త్రములు తిరుగవేయుట, తత్త్వార్థములు చర్చించుట, తగవులాడుకొనుట వంటివి మనలనుద్ధరించవు, అవినర్తియైన సాధనములే కావు. విష్ణుకథలు వినవలెను. విష్ణుకీర్తన మలవరచుకొనవలెను. విష్ణునామము లెంచి గుణించవలెను. చెప్పిన నవవిధాచరణములలోను 'శ్రవణం కీర్తనం విష్ణోః' అనునవి మొదట చెప్పినవి. అవిసాధించినచో చాలు, తక్కినవి తదుపరి తమంత తాముగావే సాధ్యములగును.

"వినికి గనవలసినను విష్ణుకీర్తన చెవిక
వినికి చేసినదియే వేదాంతబోధ
మనికి గనవలసినను మధువైరిపై భక్తి
యునికి ప్రాణులకు బ్రహ్మోపదేశంబు
చదువు గనవలసినను శౌరినామము దిరుగ
చదువుటే సకలశాస్త్రముల సమ్మతము।"

ఇంత సులభమైన ఉపాయమును విడిచి ఇతరోపాయముల వెంటబడి అటమటించి అల్లాడుట అవివేకము. తగినవారుకూడ ఏతత్త్వములో విప్పిచెప్పి తలనొప్పిపుట్టింతురే గాని యీ మాత్రముపదేశించి లోకులనుద్ధరించరేమి యని యన్నమాచార్యుడొకొక్కపరి నాశ్చర్య శంకాకుల మానసుడై కళవళించుచుండును.

"మాదృశానాం భవామయ దేహినాం
ఈదృశం జ్ఞానమితి యేపి నవదంతి
వాచామగోచరం వాంఛాసర్వత్ర
నీచకృత్యైరేవ నిబడీ కృతా
కేచిదపివా విష్ణుకీర్తనం ప్రీత్యా
సూచయంతో వాశ్రోతుం నసతి।"

అని అతడీ విష్ణుసంకీర్తనమే విశుద్ధమైన జ్ఞానమని నిర్ణయించి దానినే ఒరుల కుపదేశింపవలెనను. సంకీర్తనమును మించిన సాధనమింకొకటి లేదని చెవినిల్లుగట్టుకొని చెప్పును.

"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం
సామజము గాచినది సంకీర్తనం
సామమున కెక్కుడీ సంకీర్తనం
సామీప్యమిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణుసంకీర్తనం।"

అని సంకీర్తనస్వరూప మాహాత్మ్య స్వాభావికములన్నియూ నెకరువుపెట్టి అదియే గతియని నమ్మి ఆచరించి తరింపుడని ఆ ఆచార్యుడెలుగెత్తి బోధించును. తన సంగతిచెప్పి తార్కాణ జూపును. తానాచరించి చూపి అనుసరింపుడని ప్రబోధించును.

"అన్నిమంత్రములు నిందే ఆవహించెను
వెన్నతోనాకు గలిగె వేంకటేశుమంత్రము.
నారదుడు జపియించె నారాయణమంత్రము
చేరె ప్రహ్లాదుడు నారసింహమంత్రము
కోరి విభీషణుడు చేకొనె రామమంత్రము
వేరెనాకు గలిగె వేంకటేశుమంత్రము।"

అని ఆ వేంకటేశుమంత్రమునే లోకులకుపదేశించును. "పదలకిటు వేంకటేశ్వరుడె దైవమని చదువ గలిగిన మంచి చదువదియెపో" అని నిర్ణయించును. "అణురేణు పరిపూర్ణుడైన శ్రీవల్లభుని ప్రణుతించువారు వో బ్రాహ్మణులు" అని భగవన్నామానుస్మరణ దీక్షాధురంధరులైన భక్తులెవరో వారే పూజ్యులని నిశ్చయించును "శ్రీకాంతునామము జిహ్వదగిలితే చాలు ఏ కులజుడైనాను హీనమేమి" అని భగవద్భక్తులకు పై కులశీలాదులతో నిమిత్తములేదని వాదించును.

"నెలవై తత్త్వార్థము నేనెరుగకుండినాను
తలపులోపలివాడు తానెరుగుగా
అలరిదేహమున నేనశుచినైయుండినాను
ఇలనా అంతరియామి యెప్పుడూ శుచేకా।"

కనుక అనవసర శంకా సంశయములకెడ యీయక చిత్తమా శ్రీనివాసుని దరిజేర్చి "నీ నామమే మాకు నిధియు నిధానము; నీ నామమే ఆత్మనిధానాంజనము" అను విశ్వాసముతో నతని కీర్తించి సేవించుమని అన్నమాచార్యు డుద్బోధించును. తానహర్నిశమా సర్వేశ్వరుని అనంత కల్యాణగుణ వైభవములను కీర్తించును. మాటి మాటికి తన మనుస్సును హెచ్చరించుకొనును

మరచితిమంటే మరిలేదు
తరితో దలచవొ దైవము మనసా।
పుట్టుచు నున్నది పోవుచు నున్నది
పట్టపు జీవుల ప్రపంచము
నట్టనడుమనే నరహరి నామము
గుట్టున దలచుమ గొనకొని మనసా।

హరినామ సంకీర్తనమే కలికాలమున భవరోగములకెల్ల దివ్యౌషధము. ఆముష్మిక సాధనోపాయముల యందాసాధనముకన్న సులభమైన సాధనమింకొకటిలేదు. కాని ఆ సంగతి యీ జీవుని తలకెక్కదు. ఎక్కినను ఒంటబట్టదు. ఎన్నెన్ని కామితములతో ఊహించి, దివాస్వప్నములుగాంచి, తీరుబడిగా కునుకుచునే మిథ్యానుభవములవే నమ్మి ఆనందించుచుంటిమే! హరినామమెంచి, ఆతని సుగుణ సంపద స్మరించి, ఆనందించరాదా?

"తెలియకుగాక ద్రిష్టము జీవుడు
సులభమిదివో యిచ్చటనే పరము।
మనసున దలచిన మర్మములు గరగి
చౌనుపుచు నింద్రియ సుఖమిచ్చు
అనువుగ నటువలె హరి దలపోసిన
తనకు బ్రహ్మానందము సమకొనదా।"

అని అన్నమయ్య తర్కించును. 'హరినామమే ముక్తి అరసికైకొంటేను, ధరనాతని దాస్యమే తగినముక్తి' అని సూత్రప్రాయముగా నుపదేశించి తిరిగి దానినే సుదీర్ఘముగా విస్తరించి వ్యాఖ్యానించి ఒరుల తలకెక్కించుట కతడు ప్రయత్నించును.

సకల సంగ్రహము సకల సంచయము
అకృత సుకృతమిది హరినామం।
సకల వేదశాస్త్రముల సారమిది
సకల మంత్రరాజంబు నిది
సకల పురాణరసముల మధువిది
అకుటిల పావనం హరినామం।
సకల తత్త్వ సంశయఖండనమిది
సకల కర్మ నిశ్చయము నిది
సకల విధిరహస్య ప్రధానమిది
అకారణహితం హరినామం।
సకల దేవతాస్వామి ప్రియంబిది
సకల లోకరక్షకము నిది
ప్రకట వేంకటపతి నామాంకిత
మకించన ధనం హరినామం।

"కలౌ వేంటనాయకః" అని ఆర్యోక్తి. అన్నమయ్య ఆ వేంకటేశ్వర సంకీర్తనమే లోకుల కుపదేశించి సంకీర్తనాచార్యుడనిపించుకొనెను. తెలుగు నాట సంకీర్తన సంప్రదాయమే నాటినుండి వెలసినదో మనమెరుగము. అన్నమయ్యకు పూర్వమీక్షేత్రమున వాసిగాంచిన వారు సింహగిరి వచనములు వ్రాసిన కృష్ణమాచార్యులొక్కరే. వారి రచనలు వచనములు అన్నమయ్య కృతులు పదములు. అన్నమయ్యకు పూర్వపుదని రూఢిగా చెప్పదగినంత ఆధారసంపద గల పదసాహిత్యమింకొకటి మనకీతెనుగునాట యీ నాటికి దొరకలేదు. సంకీర్తన పద్ధతి నొకసంస్థగా వెలయించి, వేలాదికీర్తనలు వ్రాసి, వ్రాయువారి కొక లక్షణముచూపి, తాను లక్ష్యములుగూర్చి, ఆడి, పాడి, ఆచార్యుడనిపించుకొని నాడీ అన్నమయ్య. తెలుగు పదకవిత్వమునకే పితామహుడని, హరికీర్తనలకే ఆచార్యుడని అన్వర్థనామధేయుడై తరించి నాడీభక్తుడు. తరువాతివారాతని స్మరించి ఎట్లు కీర్తించిరో చూడుడు.

శరిణంటి మాతని సంబంధమునఁజేసి
మరగించి మమునేలి మన్నించవే ॥
సకల వేదములు సంకీర్తనలుచేసి
ప్రకటించి నిను బాడి పావనుండైన
అకళంకుడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన వేంకటనిలయ ।

---

# — లోకానుభవము

అన్నమాచార్యుని జీవిత మనేకానేక విచిత్రసంఘటనలతో కూడినది. బాల్యమున స్వగృహమునందే పలురకములైన బాముల కెరయై, జీవితమునందే విరక్తిగొని, దానిని తుద ముట్టింపదలచి విఫలుడైనవ్యక్తి మన అన్నమయ్య. పదారు వత్సరముల ప్రాయమున నే పరుషవారితోనో దేవదర్శనార్థమై తిరుమలకు వచ్చి, మతాంతరమంది, దైవసన్నిధానమున దీక్షితుడై, లోకమే మరచి, భక్తి నిలవరించిన ధీరు డీ అన్నమాచార్యుడు. ప్రాయమున నిద్రాంద్రను గట్టుకొని, సంసారియై, సంతతిగని, సామ్రాజ్యాధిపుల మన్ననలందుకొని, విరోధుల నెదిర్చి, ప్రతిభాప్రభావములలో నతసి కతడే సాటి అనిపించుకొని, భగవంతునే తన కైవశము చేసుకొన్న భక్తు డీ అన్నమయ్య తనవారి కితడే దైవమయ్యెను. రారాజులతో పొత్తు నెరపెను. మతావేశమున నొరులతో నోరు నొప్పి పుట్టునంత వరకు వాదించి పోరాడెను. తనవాక్కు నరాంకితము చేయనని పట్టుబట్టి సంకెళ్లబడెను. అర్చించు విగ్రహము లపహరింపబడి, ఆరాధ్యదైవమున కెడపడదపదూరమై నిలిచి, అజ్ఞులైన వారి నిందలకెల్ల గురియై, ఆవరాని కోపతాపము లనుభవించినను ఇతడు తన పట్టుదల విడువలేదు. పదరచన మానలేదు. భక్తి కంతరాయము రానీయలేదు. కడవరకు తాను సంసారియే. కాని మొదటి నుండియు విరాగియే ఇట్టివ్యక్తి కెంత లోకానుభవ మబ్బునో అది వేరే చెప్పనక్కరలేదు. ప్రజ్ఞాచక్షువైన అన్నమయ్యకట్టి అనుభవ మనుకొన్నదాని కైదింతలున్నదని చెప్పినను అతిశయోక్తికాదు.

అన్నమయ్య కీ సంసార మామూలాగ్ర మవగతమయ్యెను. "ఇదిగో సంసారమెంత సుఖమో కాని, తుదలేని దుఃఖమను తొడవు గడియించె" నని తెలిసికొనిన వేంటనే హేతుప్రత్యయము లూహించి, నిజానిజము లెరిగి — "మంచిదివో కడు సంసారము, మద మత్సరములు మానిన" అని అతడు నిర్ణయించెను. 'ఏమి గల దిందు నెంతకాలంబైన, పామరపు భోగ మాపదవంటి దరయ" అని నిశ్చయించెను. "అప్పులవారే అందరును, కప్పగ విప్పగ కర్తలు వేరు" అని నిజమూహించెను.

బడి బడి నింద్రియాలే పెరుపులు వెట్టుగాని
ఎడయని చుట్టరికా లెవ్వరికీ లేవు
వన్నె సతులరూపులు వారివద్దనె వుండగా
కన్నుల జూచేవారికి కళ రేగును
ఎన్నిక వారి గుణాలు ఎంచి మాటాడగా
విన్నవారి కూరకే వేడుకలు పుట్టును.

లోకమెరిగి చరించినవారికీ లోకము మంచిది. ఆ ఎరుక లేనివారి కిది కీడు. దోషము నితరులలోనో, ఇంకొకచోటనో వెదకుట వ్యర్థము. ఉన్నదోషమంతయు మనలోనే యున్నది. "తాపలేక మేడలెక్కదలచేము, ఏపులేని చిత్తముతో నిహిహీ నేము." ఈ చిత్తము చంచలము. దీనితలపోతల కంతము లేదు. ఆ తలచినదైననూ సత్యమా? స్వార్థకమా? "తలచినవన్నియు తన కొరకే. వెలి దెలియుట తన లోదెలియుట కొరకే" కాని యీ లోదెలియుటలోనే నిజమున్నది. అది చిక్కబట్టుకొంటిమా సంసారము గడిచి గట్టెక్కినట్టే. అందుకనియే అన్నమయ్య మరల తన మానసమునెంచి, సంబోధించి, వితర్కించుచుండును.

ఎంత లేదు చిత్తమా యీతలేల మోతలేల
వంతులకు బారనేల వగరించనేలా.
పారి పారి వేడనేల బడలికి పడనేల
మీరి దైవమిచ్చినంతే మెచ్చరాదా
పీరిడై పాడవెక్కి విరగబడనేల
చేరి యుండినంతకే చే చాచరాదా.

కాని ఇవెల్ల మన వశమా? మనమొకటి దలచిన మరియొకటి సంఘటించుట యీ లోకపు వైఖరి. ఒకతప్పున కింకొకతప్పు వడ్డిగా పెరిగి ఉరులలో దింపుట యీ సంసారపు న్యాయము. కోరి కోరి సుఖమని యెంచి, చే జాచి దుఃఖపడుట మానవ సహజమైన గుణము.

ఎదుట వేమైన గోరు నింతలోనే మనసు
అది సంభవించకున్న నలమట పడును
కదిసి చేకూరితేను ఘనమై హర్షించును
వెదనీరు వంక తుంగవిధమాయె మనసు.
ఎక్కడికైనా నేగు నెరుగక తనువు
అక్కడ దుర్లభమైతే అంతలో వేసారు
దక్కిఅందే సుఖమైతే దానే విశ్రమీగు
గక్కున రొంపిలోని కంభమాయె మనసు.

అని అన్నమయ్య, యీ మనస్తత్వము సద్దములో చూచినట్లు గ్రహించి వర్ణించెను. ఇది తెలిసి చరించినవారు మెరుగుదురని తెలిసికొనెను. అది ఎరుకగలవారికే చెల్లినదని గ్రహించెను.

తరుచు మాటాడితే తప్పులెన్నైనా దొరలు
వరచై తిరిగితేను పాప మంటును
మెరసి తిరుగాడితే మిక్కిలి దూరుముట్టు
ఎరుకగలవాడిందు నేమరదెప్పుడును.

ఇట్లెంచి చెప్పిన అనుభవములే అన్నమయ్యకవిత కొక అలంకారము. తాను చెప్పినదేదో అది పారలౌకికమునకు సంబంధించినదే అయినను, లౌకికమునే మరచి, తనదే లోకమన్న ధోరణి నాత డలవరచుకొనలేదు. అది నేలవిడిచి సాముచేయుట వంటిది. అదిగాక చెప్పినదేదో అది సుస్పష్టముగాచెప్పి, శ్రోతల తలకెక్కించవలెనన్న ఆచార్యసహజమైన సదుద్దేశ్యము కూడ అన్నమయ్యలో కాన్పించును. అందుకే అతడేది చెప్పినను, లోకసహజమైన వస్తు, వ్యాపారముల నెన్నిటినో సాటి చూపి, సాదృశ్యమెంచి, సామ్యము గుర్తించి, సంభావ్యమెంతో, సత్యమూ అంతే అని తేల్చి చెప్పును. సంసార శాతమున గ్రుంగి అటమటించు గృహస్థుని అవస్థ నితడెట్లు వర్ణించెనో చూతుడు—

ములిగి భారపు మోపు మోచేటివాడు
అలసి దింపుకొను నాడాడను
అలరు సంసారికి నడియు లేదాయె
తొలగని భారమెందును దింపలేదు.

నిత్యనైమిత్తిక కర్మలతో నారంభించి, తాపత్రయాధీనమున తలవని తలంపుగా నాచరించు కర్మ లన్నియు జీవుని వ్యవసాయములట! తత్ఫలము లాతడు పండించిన పంటలట!

కలుషము పుణ్యము కర్మపుచేను
వెలయగ జీవుడు విత్తుచును
కలిగిన సుఖదుఃఖములను గాదెల
కొలుచులు నించుక కుడిచీ బ్రాలి.

కామినీ కాంచనముల కంటె కావలసిన దింకొకటి లేదన్నదే మనకున్న రోగము. కాని వాటి పొత్తు పాములతోపొత్తు. "ఏణనయనల చూపు లెంత సొబగైయుండు ప్రాణసంకటములగు పనులు నట్లుండు" అని అన్నమయ్య నిశ్చయము, "తలపు కామాతురత్వము మీద నలవడిన నిల నెట్టివారైన నేలాగుకారు" అని అతని అనుభవము. "ఎట్టుజేసిన జేసె నేమిసేయగవచ్చు. చుట్టపు విరోధంబు నూనాస్తు చెలిమి" అని అతడు గ్రహించిన సత్యము.

తనియు బనురమైన ధరణి గసవు మేసి
తనియదు నామనను ధనకాంక్షల
ఒనర గారుచిచ్చైన నొకవేళ శాంతి బొంటు
పొనిగి యేప్రొద్దు శాంతి బొందదు నామనను.
నిఖిలమంతయు మేలు వేనేతిలు
మఖరక్షకుఁడ నిన్ను మన్నించవే।

అని అతడా భగవంతు వర్ణించి చెప్పిన విషయము.

అన్నమాచార్యులు మాటకారి. ఒకటొకటి పూనగ్రుచ్చినట్లు సాటులు చెప్పి, అతడు మాటాతగలడు.

ఒడలిలోపల రోగ మొనర పరితాపంబు
కడుపులోపలి పుండు కడలేని యాస
తడిపాత మెడగోత తలపు విషయానక్తి
గుడిమీద తరువు అలగులము ప్రాణులకు.

ఒక్కొక్కచోట నతని వాక్యములు సానబట్టి, అంచులు దిద్ది, మెరుగులు పెట్టిన మేలిరత్నములవలె మెరయుచుండును.

(1) వత్తిలోపలి నూనెవంటి దీ జీవనము
విత్తుమీదట పొల్లువిధము దేహంబు.

(2) చిక్కువడ్డ పనికి జేసివదే చేత
లెక్కలేని అప్పునకు లేమే కలిమి,

(3) అప్పులేని సంసారమైనపాటే చాలు
తప్పులేని జీతమొక్క టారమైన జాలు.

అన్నమాచార్యుని కవిత సామెతల కొక గని, నుడికారములకు నెలవు. అనుభవములపుట్టి, అతని పదములలో పల్లవులు స్వయముగా సామెతలై, సత్యములై, స్వానుభవ దీపకములై వెలయుచుండును.

———

# -లోకసంగ్రహము

ముముక్షువులై ముక్కుమూసికొనువారె దరో యీ లోకమునుకూడ తమతోపాటుగా ఉద్ధరించి, సద్గతికి నెట్టి సమస్తకల్యాణ సంపన్నముగా చేయవలెనని యత్నించిరని మన పురాణకథలు సాక్ష్యమిచ్చుచున్నవి. భక్తులైనవారి కా భగవంతుడే సర్వమైతోచినను, తదంశసంభూతమై, తల్లీలానిలయమై, వెలసిన యీ జగత్తుకూడ, కొంతకు కొంతగానైన అనురాగమూలమే. "సర్వం విష్ణుమయంజగత్" అను సత్యమును సాక్షాత్కరింప జేసికొనిన మహాత్ములకా పరమెంత ప్రియమో యీ ప్రత్యక్షముకూడ అంతే ప్రియము. లోకకల్యాణా కాంక్షయే ఉదారాశయులైన ఉత్తముల స్వభావము. ఆ యీ లక్షణములన్నియు అన్నమా చార్యునివంటి పరమభాగవతులలో అనుక్షణము రూపించును. అన్నమయ్య భగవంతునికి మేల్కొలుపుపాడును. కాని ఆమేలుకొనుట తన్నుద్ధరించుటకే కాదు, తనతోపాటి లోక మంతటిని ఉద్ధరించుటకేనట!

మేదిని జీవులగావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్లరక్ష నిద్ర మేలుకోవయ్యా।

తగు గోపికల కన్నుదామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుడ మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనే తిమిరము విరియగ
నెగడిన పరంజ్యోతి నిత్య మేలుకోవయ్యా।

ఘనదురితపు నల్లకలువలు వికసించె
మినుకు శశివర్ణుడ మేలుకోవయ్యా
పనిబడి వేదాలనే పక్షులెల్లా బలుకగ
జనక జాశ్రితపారిజాత మేలుకోవయ్యా।

ముల్లోకములలోని జీవులును నీ ముంగిలి నిల్చి తమతమ దైన్యములు విన్నవించ నున్నారు. స్వామీ, ఇది నిద్రసమయమా? 'విన్నపాలు వినవలె వింత వింతలు, పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా' అని చనవరియై, సాన్నిధ్యమందునిల్చి యీ భక్తుడా ఆపద్బాంధవుని మేలుకొల్పును. ఆయన కన్నువిప్పిన చాలును. అన్నిబాధలు పటాపంచలగును.

ఈతడు విష్ణుడు రిపులెక్కడ జొచ్చేరు మీరు
చేత చక్రమెత్తినాడు శ్రీ వేంకటేశ్వరుడు।

మట్టి దైత్యపురాల మర్మాలు విదళించినాడు
చుట్టువేదెమున నింతా సోధించినాడు
ఇట్టి శ్రీ వేంకటాద్రి నిరవై యెక్కినవాడు
రట్టుగా దనదాసుల నిట్టె రక్షించినాడు।

అని అన్నమాచార్యు డపారహర్షోన్మత్తుడై ఆలపించును. 'అతడే రక్షకుడందరి కతడే పతియుండగ భయపడ జోలేది' అని లోకుల కభయము చాటును. 'కలియుగమున శ్రీ వేంకటగిరిపై గదసిన నీ మహిమకు వెలితా' అని ఆ పరమేశ్వరుని ప్రోత్సహించి 'ధరలోను జనహితము నానా భక్తరక్షణము నడప గదవయ్యా' అని ప్రార్థించును. కలిమాయ ఘనమైనది. జనుల కాపాట్లు దుర్భరమైనవి. కని విని యెరుగనంతగా కలివిజృంభించినది. కనికరించి కాపాడకున్నచో వేరుగతియేమి?

తతిగాని యీ పాటు దైవమా విచారించవే
కతలాయ జెప్ప నేడు కలికాలమహిమ।
దేవాలయాలు నా నా దేశములెల్లా జొచ్చి
దేవగా నెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత పుట్టదాయ
కావరమె ఘనమాయ కలికాలమహిమ।
నిరపరాధులజంపి నెత్తురు వారించగాను
తెరల నెట్లుండిరో దిక్పాలులు
విరస వర్తనులుండే విపరీతకాలమున
గరువాలు కపటాలె కలికాలమహిమ।
పలుమారు నమ్మించి ప్రాణములు గొనగాను
ఇల దమలో ప్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే యెరుగుదువు
కలుషమే ఘనమాయ కలికాలమహిమ।

అని అన్నమయ్య తన దేవునికి నివేదించును. ఇందానాటి సామాజిక సంకటావస్థ లెన్నియో, ఆతడు కన్నారచూచి, వీనులార విన్ననత్యములే వర్ణించబడినవని. అయినను వీటికాతడు భయపడలేదు. 'అన్నిటికా భగవంతుడే కలడని నమ్మి, అతడే శరణ్యమని చాటి, నడవరా జడియక నవ్యమార్గమిది మదుగిది వైష్ణవమార్గమిది' అని లోకుల నతడుద్బోధించును.

కలియుగంబునకు కలదిదియే
వెలసిన పంచమవేదమె కలిగె।
బోధలహరి నుతిపాఠమెను శూద్ర
స్వాధని కలిదోషము మాన్ప
రాధా మాధవరచన సకలజన
సాధువేదమే జగమున కలిగె।

అని రాధా మాధవలీలారచనానురక్తులైన భక్తులకే యీ కలి లొంగిపోవునని అతడు నచ్చజెప్పును. "కటకటా మీరితివి కలికాలమా, పుణ్యఘటన కరవైపోయె కలికాలమా" అని విసిగి వేసరుచునే "ఇట్టైన తిరువేంకటేశదాసులు నిన్ను కట్టివైతురునుమా కలికాలమా" అని కలిని బెదిరించును. వైష్ణవులందట్టి శక్తికలదని తాను విశ్వసించును. తాను నమ్మినదేదో అదే ఇతరుల కతడు పదే పదే చెప్పి వినిపించును.

నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు
నిగమాంతవిదులు వైష్ణవులు
సత్యము వీరల శరణని బ్రదుకరొ
సాటికి బెనగక జడులార।

అని జనులకుపదేశించును. వారి మాహాత్మ్యమిట్టిట్టిదని వట్టిమాటలాటి ప్రయోజనము లేదు. ఆశ్రయించి, అనుసరించిచూచి, అనుభవించినవారికి తెలియగలదని నిరూపించి చెప్పును. ఆవైష్ణవులు తన్నుద్ధరించినవారని చాటును.

తప్పరు తమపట్టినవ్రతమెప్పుడు
దైవమొక్కటే గతియనుచు
ఒప్పగు తమ పాతివ్రత్యంబున
నుందురు సుఖమున వైష్ణవులు
కప్పిన శ్రీ వేంకటపతిదాసులు
కర్మవిదూరులు సాత్వికులు
చెప్పకు డితరుల సరిగా వీరిని
సేవించగ నే ధన్యుడనైతి।

అని వైష్ణవప్రపత్తినే 'వ్రతానాముత్తమంవ్రత' మని నిర్ధరించును. కాని ఎవరీ వైష్ణవులు? బహిరంగవేషము జూచి మోసపోవలసినదేవా? కాదు. వారి లక్షణములు వేరు.

మదమత్సరము లేక మనను పేదైపోవ
పదరిన యానలవాడు వో వైష్ణవుడు।
ఆవల ఒరుల విడనాడగ విని విని
చేవమీరి యెవ్వరిని జెడనాడక
కోవిదు శ్రీ వేంకటేశు గొలిచి పెద్దలకృప
వావి వర్తనగలవాడు వో వైష్ణవుడు।

అని అతని నిర్వచనము. అట్టి వైష్ణవులున్నచోట కలికి తావులేదు. వారి మాట కా భగవంతుడైన లొంగవలసినదే. వారి నాశ్రయించిన వారి కా పరాత్పరుడు వశంవదుడు. వారే యీ లోకమున నుత్తమోత్తములు.

వినియు జదివియు రమావిభుని దలపక వృథా
తనువు వేపుచు దిరుగు దపసి కంటె
చనవుగల వేంకటేశ్వరు దానులకు వెంట
బని దిరుగు నతడు వో బ్రాహ్మణోత్తముడు।

అట్టి ఉత్తముల సాంగత్య మీ భవబాధలకెల్ల విరుగుడు. 'ఇన్ని జన్మము లేటికి హరిదానులున్న వూర దానుండినజాలు' అని అన్నమయ్య నిర్ణయము. అదియే లోక కల్యాణ సంధాయకమైన సత్కర్మమని ఆతని నమ్మిక. అన్నమాచార్య డీ లోకమును మరచి తనభక్తియేదో తనదని తలవంచుకొని నడుచు వ్యక్తికాడు. అతడీలోకుల బహిరభ్యంతర ప్రవృత్తులన్నియు గమనించును. అవసరమైనచో విమర్శించును. అనువైన ఉపాయముచెప్పి ఉద్ధరింపజూచును. అందుకని లోకులకు మారా భగవంతుని ప్రార్థించును. లోకకంటకులైనవారి ఉద్ధృత మణగవలెననియో, లోకవిరుద్ధమైన ఆచారవ్యవహారము లడుగంటవలెననియో, లోకోపకారియైన సద్ధర్మమంతటా వ్యాపించవలెననియో, అతడు తహ తహపడి మరీప్రయత్నించును, అడుగడుగునా అతని కా భగవద్వ్యాపార మీరీతి ఆశయముల కనుకూలముగనే కనిపించును. అంతులేని ఆనందముతో నతడా విషయమును వర్ణించిపాడి లోకులకు వినిపించును. భగవంతుని శృంగారలీల లెంత అనురక్తితో వర్ణించునో అంతే ఆసక్తితో ఆ జగద్రక్షకుని ఆశ్రితరక్షణోద్యమమునుకూడ యీ కవి వర్ణించును. అట్టి సమయములలో నతని ఆనందము మిన్నుముట్టును. "చాలదా మా జన్మము నీ పాలింటివారమై బ్రతుకంగ గలిగె" నని అతడు గుండెపై చేయివేసుకొని నిబ్బరపడును. "జయము జయము ఇక జనులార. భయములు వాసెను బ్రదికితి మిపుడు" అని జయధ్వానములు చేసి ఉప్పొంగును.

# — గేయసాహిత్యము

అన్నమాచార్యుని రచన నూటికి తొంబదితొమ్మిదిపాళ్లు గేయరచన. అతడు వ్రాసిన శృంగారమంజరికూడ రాగతాళములతో పాడుకొనుట కనుకూలించునదే. ఇవిగాక అతడు ద్విపదకావ్యముగా రామాయణము వ్రాసెననికూడ తెలియుచున్నది. ఆగ్రంథ మింతవరకు లభింపకపోయినను, అదికూడ ఆడిపాడుట కనువైనదే అని దాని ఛందస్సును బట్టి ఊహించవచ్చును. ఇంతగా సంగీతమయమైన కృతులొనర్చిన కవిని గాయకుడని చెప్పుట అనవసరము. అదిగాక సంకీర్తన లక్షణమును మొదట సంస్కృతభాషలో అన్నమాచార్యుడే సంతరించెననియు, దాని అనువాదమే నేడు లభించిన తెలుగు సంకీర్తన లక్షణమనియు తెలిసినపిదప, అతని సంగీతశాస్త్రపాండిత్యమెంత అని అనుమానించుటకు తావేలేదు. అతడు కవి. లక్షణజ్ఞుడు, గాయకుడు, సంగీతశాస్త్ర పారంగతుడు.

భక్తుడైన అన్నమాచార్యునికి సంగీత మూతగఱ్ఱయై, సాధనకు బలమిచ్చినది. నాదమే బ్రహ్మమనియు, సంగీతసాధనలో నవశ్యానుసరణీయములైన ఉచ్ఛ్వాస నిశ్వాస నియమములు ప్రాణాయామ సాధనలోని కుంభకరేచకాదులతో తుల్యములే అనియు, స్వర సాధనకూడ శరీరగతనాడీచక్రముల నుద్బోధించుటకు సమర్థమైనదే అనియు, నాదలయాను సంధానమున పరమాత్మాను సంధానమేమి, తల్లయమేమి, సుసాధ్యములే అనియు తజ్ఞులెల్లరును అంగీకరించిన సత్యము. ఈ సత్యమే సాధకులచేతనేమి, తత్త్వజ్ఞులైన దార్శనికుల చేతనేమి, పరానురక్తులైన భక్తులచేతనేమి, సంకీర్తన మనవరతాచరణీయమైన విధిగా గ్రహింపబడుటకు హేతువైనది. తాము సంకీర్తన మాలపించి తన్మయులై తరించుటయే కాదు, తమకైనంతవరకు లోకులనుకూడ తమవంక త్రిప్పుకొని సామూహికముగా బృంద గానములో, కీర్తనగోష్ఠిలో, భజనకూటములో వెలయించి, సంకీర్తన మొనరింపజేసి సంతసించుటయు, తన్మూలకముగా ధార్మిక ప్రవృత్తులు ప్రచారములోనికిదెచ్చి కృతకృత్యులగుటయుకూడ అట్టిసాత్త్వికుల స్వభావవృత్తమే. అన్నమాచార్యుడికోవలోని వాడగుటచేత నతనికికూడ సంకీర్తనమే స్వపర తారణోపాయముగను, ఇహపరసాధనముగను రూపించినది. దినమొకటిగా ముప్పదిరెండువేల సంకీర్తనము లదేపనిగా రచించి, పాడి, అటు ఆ వేంకటేశ్వరునికి ఇటు యీ లోకమువారికి వినిపించి అతడు ధన్యుడైనాడు.

సంకీర్తనములకు పదములని వ్యవహారము. అన్నమాచార్యుని రచనలో అవి శృంగారకీర్తనలుగాను, అధ్యాత్మకీర్తనలుగాను వింగడించి వ్రాయబడినవి. ఆయాపదముల

భావము ననుసరించి తత్తదనుకూలమైన భాషాశైలు లుపయోగించి అతడీపదములు రచించెను.

> కం॥ పదములు శృంగార వధూ
> మృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనన్
> విదితార్థ గ్రామ్యోక్తులు
> పదిలముగా బొంక మెరగి పలుకగ జెల్లున్.

అను సంకీర్తనలక్షణము ననుసరించి అతడు తన శృంగారకీర్తనలలో నచ్చటచ్చట వ్యాకరణ విరుద్ధమైన భాషనే, బుద్ధిపూర్వకముగా వాడెను.

> "పల్లవ నారీమ్లేచ్ఛా
> ద్యుల్లా న మనోజ్ఞ బంధురోక్తులు చవులై
> జెల్లును గ్రామ్యములైనను"

అను లక్షణము ననుసరించియో ఏమో, పామరశృంగారము నభివర్ణించు పట్టుల యందతడు విశేషించి వ్యవహారికభాషనే ప్రయోగించెను. లోకవ్యవహారసిద్ధములై చెల్లుబడియైన నానుడుల నతడట్లే గ్రహించి వాడుకొనెను. ప్రచలితములైనచో చాలు విభాషాశబ్దములు కూడ అతనికి గ్రాహ్యములే అని తోచెను. దీని కిదే లక్షణమని చెప్పగల సాహసము, చేసి చూపగల స్వాతంత్ర్యము అతని కాజన్మసిద్ధమైన వ్యక్తిత్వములోని భాగములు మాత్రమే. అట్లని అతని పట్టుదల మొండి పట్టుదలకాదు. అవసరానుకూల్యము లెరిగి అతడు వ్రాయగలడు. పాత్రనిబద్ధ ప్రౌఢోక్తులలో తతదుచిత భాషాప్రయోగమే అతనికి సమ్మతము. తదితర ప్రసంగములలో అతడు సలక్షణమైన భాషనే ప్రయోగించును.

> "వైరాగ్యవృద్ధికర గం
> భీర పదశ్రేణి పొసగ బెనుపుచు సగ్రా
> మ్యారమ్య విమ్మచరితో
> దారములైయున్నఁ జాలు ధరణిన్వెలయున్"

అని అతడు పద సామాన్యమున కిచ్చిన లక్షణము ననుసరించి 'అగ్రామ్య' భాషనే తరచుగా వాడెను. అధ్యాత్మకీర్తనలలో అసలీ గ్రామ్యా గ్రామ్య ప్రశ్నయే లేదు. అని విశుద్ధమైన భాష కుదాహరణములు. విషయ దృష్టికికూడ అవి మాన్యములే.

" దేహాత్మేశ వివేకో
త్సాహంబును లోకవేద ధర్మా ధర్మా
ద్యూహాపోహంబులు గల
యా హరిసంకీర్తనంబు లధ్యాత్మంబుల్ ''

అను లక్షణ మాతని అధ్యాత్మకీర్తనల కక్షరశః అన్వయించును.

అన్నమాచార్యుని పదములన్నియు యతిప్రాస యుతములైన వృత్తబంధములు. రగడ, మంజరి, ద్విపద, విషమజాతి సీసము వంటి జాతిచ్ఛందములే అతడు వాడెను. వాటి మాత్రలనే తాళమానమున కనుకూలముగా పేర్చుకొనెను. సంస్కృతభాషలో వ్రాసిన పదములందుకూడ అతడు యతి ప్రాసములు పాటించెను. తననాటికి ప్రసిద్ధమై ప్రచార ములోనున్న దేశిచ్ఛందములన్నియు అతడు వాడుకొనెను. ఏల, జోల, డోల, లాలి, చందమామ, తుమ్మెద, సానముఖా, ఓలాల, జాజర, మంగళహారతి వంటి గీతి భేదములన్నియు అతని రచనలో కనిపించును. ఒకటి రెండు చరణములతో నారంభించి పదిపదేను చరణములవరకు సాగిన పదములు నహితమిట లభించును. అష్టపదులు, తరంగములు, విభిన్నరాగ తాళములలో నడిపిన సూడాది గీతములు, కథాగేయములు కూడ ఇందు దొరకును. ప్రతిపదమునకును పల్లవియు, క్వాచిత్కముగా ననుపల్లవియు జోడించబడియుండును. అన్నమాచార్యుని పల్లవులకొక విశిష్టతకలదు. అవి సానబట్టి అంచులుదిద్ది తీర్చిన వజ్రపుతునకలవలె, పదమునకు శీర్షప్రాయములై నిల్చును.

'' పదముల యర్థము బల్లవి
వదలక యన్నిటికి నేక వాక్యత జేయన్
గుది గ్రుచ్చినట్లు తగులై
పదము తుదిన్ మరియు మరియు పల్లవియమరున్ ''

అను లక్షణము ననుసరించి పదార్థమువేకాదు పదగత చరణార్థమును కూడ పల్లవి అనువర్తించుచుండును. అది కారణముగా కొన్ని కొన్ని పదములలో పల్లవికిమారు ప్రథమ చరణమే ముందు వ్రాయబడును. పిమ్మట చరణాంతమున వాక్యపూరణార్థమో, అన్వయాపేక్ష చేతనో అనునట్లు పల్లవి వ్రాయబడును. కొన్ని కొన్ని చోట్ల పల్లవి ఎత్తుబడియే యీ ధోరణిలోనుండును.

(1) కాకున్న మాపాటు కడమున్నదా
నీకృప వంకనే నిలిచితిమిగాక ॥ పల్లవి ॥

(2) ఎట్టుదోయవచ్చు దీని నెంతటి వారికైనాను
పట్టి నీకు శరణంటే బ్రతికింతువుగాక ॥ పల్లవి ॥

అన్నమాచార్యుని రచనలో తుమ్మెద పదములవంటి వింక నెన్నో అమరినవి. మనను, నంసారం, హరినామం, పెండ్లికొడుకు, పెండ్లికూతురు, జాజర వంటి ఊతపదములతో వ్రాసిన పదములెన్నో ఇతని రచనలో దొరకును. ఇట్టి పదము లెన్నిటిలోనో పల్లవియు చరణములు వేరు వేరుగా కనిపించుచున్నవి. చరణార్థ ప్రమాణము గల వాక్యము పల్లవి అని చెప్పి "అందులోన నర్థమైన శిఖాపదమనిరి లక్షణజ్ఞులు" అని వ్రాసిన లక్షణముకూడ వీటి కన్వయించదు. ఇట్లే నంకీర్తన లక్షణములోని ధాతుపంచకముకూడ అన్నమాచార్యుని కీర్తనలలో విస్పష్టముగా గోచరించదు.


ఇతని పదములలో పల్లవి వేరుగా గోచరించుటచేత ధ్రువమే కాలాంతరమున పల్లవిగా మారినదనువాదమునకుకూడ వీలుచాలదు. "విదిత చతుష్పాదం బగునది వృత్తం బదియె ధాతు వవయవ నంజ్ఞం బదియె" అని చెప్పిన దానినిబట్టి ప్రతిచరణము (నాల్గుపాదముల వృత్తబంధము) ను ఒకధాతువుగా భావించినచో, అన్నమాచార్యుని రచనలో హెచ్చుభాగము త్రిధాతుక పదములుగా కనిపించును.

అన్నమాచార్యుని రచన ద్రావిడ ప్రబంధము ననుకరించి వెలసినది. దానికి వలెనే దీనికికూడ కీర్తించుపద్ధతులు రెండంగీకరింపబడినవి. ఒకటి రాగ తాళ యుక్తముగా బాడుకొనుట, రెండవది అర్థయుక్తముగా పదములు విరిచి చదువుకొనుట. ఈ రెండవపద్ధతి అధ్యయనోత్సవములలో నుపకరించును. అన్నమాచార్యుని కీర్తనలిట్లు వినియోగింపబడ వలెనను కట్టుబాట్లతో పెదతిరుమలాచార్యుడు తిరుమలేశ్వరునిపేర కొన్ని దానములు చేసినట్లు శాసనాధారములున్నవి. ఎవరికివారు స్వాత్మానందమునకు పాడుకొని ఆనందించుటకు లేదా సాహిత్య సుధాస్వాదన మొనర్చి రసార్ద్ర హృదయులగుటకుకూడ ఈ పద్ధతి సహకరించును. పాటలన్నిటికి రాగనిర్ణయము చేయబడినది. ఛందోనుసారముగా మూడు

నాలుగు, అయిదు మాత్రలు గల ఏ జాతి తాళములోనో అవి తమంతట తామే నడచుచుం డుట చేతనో ఏమో యీ పాటలకు తాళ నిర్దేశము మాత్రము జరుగలేదు. ఒకటి రెండు చోట్ల అట్టి నిర్దేశమున్నను అది అప్పటిదో, వెనుకటి వారెవరైన చేసిపెట్టినదో తెలియదు. రాగనిర్ణయము లిట్లు తారుమారైన సందర్భములుకూడ కొన్ని కలవు. ఏది ఎట్లున్నను తెలుగులో నింతగా పదసాహిత్యము వెలయించిన అన్నమాచార్యుడాంధ్రుల కేనాటికి మరవరాని మహనీయుడు.

T. T. D. Religious Publications Series No. 88

Subsidised Price: 0—75



Published by P.V.R.K. Prasad, I.A.S., Executive Officer, T. T. Devasthanams
and Printed at T.T.D. Press, Tirupati—C. 2000—29-9-81.